thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 253 కరీంనగర్ గురువారం, 20 నవంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ముస్తఫాబాద్ ఇకపై కబీర్‌ధామ్

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో మరో గ్రామం పేరు మారనుంది. లఖింపూర్ ఖేరి జిల్లాలోని ముస్తఫాబాద్ గ్రామం పేరును 'కబీర్‌ధామ్'గా మార్చనున్నట్టు ముఖ్య మంత్రి యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. ఈ మేరకు తమ ప్రభుత్వం ఒక అధికారిక ప్రతిపాదనను కోరుతుందని, అవసరమైన పరిపాలనా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. అప్పటి పాలకులు మార్చిన పేర్లను తిరిగి పునరుద్ధరించడం గతంలోనూ తమ ప్రభుత్వం చేసిందని తెలిపారు. స్మృతి మహోత్సవ్ మేళా 2025లో యోగి అదిత్యనాథ్ మాట్లాడుతూ, గతంలో పాలకులు ప్రభుత్వ ధనంతో స్మశాన వాటికలకు సరిహద్దు గోడలను నిర్మించే వారని, ఇప్పుడు ప్రభుత్వ ధనాన్ని మత, సాంస్కృతిక ప్రాధాన్యత ఉన్న స్థలాలను అభివృద్ధి చేసేందుకు వినియోగిస్తున్నామని చెప్పారు. సెక్యులరిజం పేరుతో ఒక ప్రాంతం పేరును మార్చడం హిపోక్రసీ అనీ, సెక్యులరిజం సాకుతో వారసత్వాన్ని తుడిచివేసే శకం ముగిసిందని అన్నారు.




చెన్నై: ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకానికి సంబంధించి 21వ విడత డబ్బులను ప్రధాని మోదీ విడుదల చేశారు. తమిళనాడు పర్యటనలో ఉన్న ప్రధాని.. డీబీటీ పద్ధతిలో లబ్ధిదారులైన రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారు. ఇప్పటి వరకు 20 విడతలుగా పీఎం కిసాన్ డబ్బులు వేసిన కేంద్ర ప్రభుత్వం.. ఇప్పుడు 21 విడత నిధులను రైతుల ఖతాల్లోకి బదిలీ చేసింది. బుధవారం నాడు తమిళనాడులో కోయంబత్తూరులో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటించారు. ఈ పర్యటనలోనే పీఎం కిసాన్ నిధులను విడుదల చేశారాయన. దేశ వ్యాప్తంగా 9 కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి రూ. 18 వేల కోట్లకు పైగా నిధులు జమ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రధాని.. వ్యవసాయంలో రసాయనాల వాడకాన్ని తగ్గించాలని రైతులను సూచించారు. అధిక రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం వల్ల భూమి సారం దెబ్బతింటుందన్నారు. రైతులు సేంద్రీయ వ్యవసాయానికి మొగ్గు చూపాలన్నారు. సేంద్రీయ వ్యవసాయంతో భూసారం పెరగడంతో పాటు.. అన్ని రకాలుగా మేలు జరుగుతుందన్నారు. ముఖ్యంగా వాతావరణ మార్పుల వల్ల ఎదురయ్యే సవాళ్లను సైతం ఎదుర్కునే అవకాశం ఉంటుందన్నారు ప్రధాని. దేశ రైతులు తృణ ధాన్యాలను పండించడంపై ఫోకస్ పెట్టాలని ప్రధాని పిలుపునిచ్చారు. రైతులకు అండగా నిలిచే ఉద్దేశంతో పంట పెట్టుబడి సాయం కింద ఆర్థిక సాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే.

# రెండో రోజు ఏపీ లో భారీ ఎన్కౌంటర్ .!

## -టెక్ దిగ్గజం శంకర్ సహా 7 గురు మృతి

### -లొంగి పోయిన వారిని అదుపులోకి తీసుకుని చంపారంటున్న సంఘాలు

### -మరో వైపు 50 మంది మావోల అరెస్ట్




అమరావతి :చురకలు,చీఫ్ రిపోర్టర్ –ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా అటవీ ప్రాంతం రెండోరోజు కాల్పుల మోతలతో దద్దరిల్లిపోయింది. ఈ ఘటనలో మావోయిస్టు టాప్ టెక్నికల్ ఇంచార్జ్ జోగారావు ఏశంకర్ సహా 7 మందిని పోలీసులు చంపేశారు.వరసగా రెండో రోజు కూడా ఎదురు కాల్పుల ఘటన చోటు చేసుకుంది. బుధవారం ఉదయం అల్లూరి జిల్లాలోని జీఎం వలస అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురు కాల్పుల్లో మావోయిస్టు పార్టీకి చెందిన ఏఢుగురు మావోయిస్టులు చనిపోయినట్టుగా ఏపీ పోలీసులు ప్రకటించారు.. అయితే ఈ ఘటనపై కొత్త కోణం వెలుగులోకి వచ్చింది.మృతులంతా వారం రోజుల క్రితం లొంగిపోయెందుకు ప్రభుత్వం వద్దకు వచ్చారని ,వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని ఎన్కౌంటర్ చేశారని అంటున్నారు.గత కొద్ది రోజులుగా టెక్ శంకర్ అడవి నుంచి బయటకు వచ్చినట్టు ప్రచారం జరిగింది.తీరా చూస్తే పోలీసులు మాత్రం బుధవారం ఉదయం రంపచోడవరం కాల్పుల్లో మరణించినట్టు వెల్లడించడం విశేషం.ఈ ఘటనలోశ్రీకాకుళం జిల్లా వజ్ర కొత్తూరు మండలం బాతుపురం గ్రామానికి చెందిన మెట్టూరి జోగారావు అలియాస్ టెక్ శంకర్ అలియాస్ శంకర్ అలియాస్ బాబు అలియాస్ శివ మరణించాడు. %AOB% స్పెషల్ జోనల్ కమిటీ సభ్యునిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న జోగారావు మందుపాతరలు పేల్చడంలో వ్యూహకర్తగా వ్యవహరించేవాడు. గత మే నెలలో దండకారణ్యంలో జరిగిన ఎదురుకాల్పుల్లో మరణించిన కేంద్ర కమిటీ కార్యదర్శి నంబళ్ల కేశవ రావు అలియాస్ బసవరాజ్ గార్డ్స్ కమాండర్ గా పని చేసి, ప్రస్తుతం డివిజనల్ కమిటీ మెంబర్ హోదాలో ఉన్న జ్యోతి అలియాస్ సరిత మరణించింది. ఈమె సుక్మా జిల్లా కిష్టారం ప్రాంతంలోని బూర్గులంక నివాసి అని పోలీసులు పేర్కొన్నారు.

కమ్యూనికేషన్ టీమ్ స్పెషల్ జోనల్ కమిటీలో ఏరియా కమిటీ సభ్యునిగాపనిచేస్తున్న సురేష్ అలియాస్ రమేష్ మరణించాడు.వరుస ఎన్కౌంటర్ లలో 6 ప్లస్ 7 మొత్తం 13 మంది ప్రాణాలు కోల్పోయారు.ఎలాంటి కార్యక్రమాలు లేకుండా ఏపీ వ్యాప్తంగా సైలెంట్ అయిన మావోయిస్టులు సేఫ్ ప్రాంతంగా పొరపడి ప్రాణాలు కోల్పోయారని అభిప్రాయ పడుతున్నారు..

1. మెట్టూరి జోగా రావు ఏ టెక్ శంకర్ ఏ శంకర్ ఏ బాబు ఏ శివ, నివాసం, బతుపురం (గ్రామం), వజ్రపు కొత్తూరు మండలం,, శ్రీకాకుళం. ఎస్ జడ్ సి యం, ఇంఛార్జ్ ఏ. ఓ. బి. 2. జ్యోతి ఏ సరిత, డి వి సి యం,, (గతంలో నంబాల కేశవ రావు ఏ బి ఆర్ దాదా మాజీ మావోయిస్టు చీఫ్‌కి గార్డ్ కమాండర్‌గా పనిచేశారు) 32 సంవత్సరాలు, నివాసం, బూర్గులంక ప్రాంతం (కిస్టారం ప్రాంతం), సుకుమా జిల్లా. 3. సురేష్ ఏ రమేష్, ఏ, సి యం, (గతంలో జగరగొండ ఎల్ ఓ ఎస్, ఎస్, బి, టి డి, వి, సి & ఎర్రా ఎస్ జడ్, సి, యం కమ్యూనికేషన్ టీమ్‌లో పనిచేశారు).. 4. లోకేష్ ఏ గణేష్, ఏ, సి, యం (గతంలో జగరగొండ ఏరియా మిలీషియా కమాండర్, ఎస్, బి, టి, డి, వి, సి & కటకం సుదర్శన్ ఏ ఆనంద్ దాదాకు గార్డుగా పనిచేశారు). 5. సైను ఏ వాసు, ఏ, సి, యం (గతంలో జాగర్గొండ ఎల్, ఓ, ఎస్, ఎస్, బి, టి, డి, వి, సి యొక్క డిప్యూటీ కమాండర్‌గా పనిచేశారు). 6. అనిత, ఏ, సి, యం (గతంలో జగరగొండ ఎల్, ఓ, ఎస్, ఎస్, బి, టి, డివిసి లో పనిచేశారు).. 7. షమ్మీ ఏ, సి యం(గతంలో జగరగొండ ఎల్, ఓ, ఎస్,,హొఎస్, బి, టి,హొడి వి సి లో పనిచేశారు)..

# మహిళల ఆత్మగౌరవానికి కోటి చీరలు: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, నవంబరు18 : కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరలు అందజేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అర్హులైన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరలను అందజేస్తామని పేర్కొన్నారు. దేశంలో రాజకీయ శూన్యత ఏర్పడిన సమయంలో ఇందిరాగాంధీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారని గుర్తుచేశారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం ఇందిరాగాంధీ ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఇవాళ(బుధవారం) ఇందిరమ్మ చీరల పంపిణీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు చీరలను అందజేశారు. అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగించారు.

**ఇందిరమ్మకే సాధ్యం..** బ్యాంకుల జాతీయకరణ, అగ్రికల్చర్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని తీసుకువచ్చి పేదలకు భూములు పంచినా, పేదలకు ఇండ్లు కట్టించినా అది ఇందిరమ్మకే సాధ్యమైందని గుర్తుచేశారు.

పాకిస్థాన్‌తో భారతదేశానికి యుద్ధం జరిగిన సమయంలో ధీటుగా నిలబడి ఎదుర్కొన్న ధీశాలి ఇందిరమ్మ అని కీర్తించారు. దేశానికి బలమైన నాయకత్వం అందించిన ఘనత ఇందిరాగాంధీదని ప్రశంసించారు. ఇందిరమ్మ స్ఫూర్తితో తమ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని తెలిపారు.

మహిళలకు పెట్రోల్ బంకులు ఇచ్చి ప్రోత్సహించామని వివరించారు. ఆర్టీసీలో వెయ్యి బస్సులకు మహిళలను యజమానులుగా చేశామని పేర్కొన్నారు సీఎం రేవంత్‌రెడ్డి.

**ఆడబిడ్డల పేరుతోనే ఇందిరమ్మ ఇళ్లు..** 'మా ప్రభుత్వంలో మహిళల సంక్షేమంతో పాటు ఆర్థిక ఉన్నతి కలిగించే కార్యక్రమాలు చేపట్టాం. ఆడబిడ్డల పేరుతోనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నాం. రాజకీయాల్లోనూ మహిళలకు తగిన ప్రాధాన్యం కల్పించాం. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులుగా చేయాలని లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నాం. తెలంగాణ ఆడబిడ్డలకు ప్రభుత్వం తరఫున సారె పెట్టి గౌరవించాలని భావించాం. అందుకే కోటి మంది ఆడబిడ్డలకు కోటి చీరలు పంపిణీ చేయాలని నిర్ణయించాం.

ఇందిరమ్మ జయంతి రోజున ప్రారంభించిన ఈ కార్యక్రమం డిసెంబర్ 9వ తేదీ వరకు గ్రామీణ ప్రాంతాల్లో పంపిణీ చేస్తాం. అలాగే, మార్చి 1వ తేదీ నుంచి 8వ తేదీ మహిళా దినోత్సవం వరకు పట్టణ ప్రాంతాల్లో అందజేస్తాం. ఈ విషయంలో మహిళలు ఆందోళన చెందొద్దు.. ప్రతీ ఆడబిడ్డకు చీరను అందిస్తాం. మొదటి విడతలో 65 లక్షల చీరలు పంపిణీ చేస్తాం. చీరల ఉత్పత్తికి సమయం పడుతున్న నేపథ్యంలో రెండు విడతలుగా చీరలను పంపిణీ చేస్తున్నాం. మహిళా మంత్రులు, మహిళా ఎమ్మెల్యేలు, మహిళా అధికారులు ఇందిరమ్మ చీర కట్టుకోవాలి. మీరే బ్రాండ్ అంబాసిడర్‌గా మారి ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని చాటాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.






# కగార్ 'నెక్స్ట్ టార్గెట్ 'తిప్పిరి తిరుపతి?!

## -ఫైనల్ కి చేరిన మావోయిస్టుల కాల్చివేత

## -హిడ్మా ఖతంతో కుప్పకూలిన ఛత్తీస్ ఘడ్

### -మార్చి కాదు, డిసెంబర్‌లోనే క్లోజ్డ్

హైదరాబాద్ చీఫ్ రిపోర్టర్–2025 జనవరి 2 నుంచి ఘరియాబాద్ ఎన్కౌంటర్లో మావోయిస్టు టాప్ సీసీ మెంబర్ చలపతి మరణంతో దెబ్బతింటున్న అపార్టీ నేతలు ఒక్కొక్కరు ఒక్కోలా కన్నుముస్తున్నారు.మంగళవారం ఉదయం జరిగిన ఈ ఘటన లో హిడ్మా హతంతో మావోయిస్టు పార్టీ చివరి మజిలీలో పడింది.గుండెకోట ఎన్కౌంటర్ లో పార్టీ నేత సెక్రటరీ జనరల్ నంబాల్లా కేశవరావు సహా 28 మందిని పోలీసులు కాల్చి వేశారు.ఇక మిగిలిన వారంతా పార్టీ ని వీడాలని ప్రభుత్వం హెచ్చరిస్తూ వచ్చింది.మరోవైపు లొంగుబాట్లను పెంచింది.మల్లోజుల,తక్కళ్లపల్లి లను లొంగుబాటులోకి తెచ్చిన సర్కార్ మిగితా వారిని టార్గెట్ చేస్తూ వస్తోంది.ఈనేపధ్యంలో హిడ్మాను టార్గెట్ చేసి మట్టుబెట్టారు.ఈ క్రమంలో తెలంగాణ ముఖ్యనేత తిరుపతిని టార్గెట్ చేస్తూ కగార్ ను వేగవంతం చేశారు. ఈ సందర్భంగా బుధవారం నాడు జరిగిన ఎన్కౌంటర్లో దేవ్ జి ఏతిరుపతి చనిపోయారని పొద్దంతా ప్రచారం జరిగింది.చివరికి ఈ ఎన్కౌంటర్లో ఆయన లేరని వెల్లడించారు. జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవజీ ని జనరల్ సెక్రటరీ గా నియమించారు అంటూ దేశవ్యాప్త ప్రచారాన్ని మీడియా ప్రారంభించారు .తిరుపతికి వచ్చిన పగ్గాలు రావడంతో మళ్లీ కేంద్ర సర్కార్ దృష్టి దేవ్జీ వైపు మళ్లింది.ఇంతకు ముందే జగిత్యాల జిల్లా కు చెందిన ముప్పాళ్ల లక్ష్మణ్ రావు ఏగణపతి సెక్రటరీ గా పనిచేశారు ఆయన దగ్గర శిష్యుడు మావో సిద్ధాంత నిపుణుడు గా మారిన తిరుపతికి పార్టీ పగ్గాలు అప్పగించారు.ఈ పదవి ఇచ్చారన్న వార్తతో జగిత్యాల జిల్లా అగ్రనేతలకు అడ్డాగా మారింది.తిరుపతి 1980 నుంచి ఆర్ ఎస్ యు **కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన ఎస్ ఆర్ ఆర్** కాలేజ్ పూర్వ విద్యార్థి. కోరుట్ల తిరుపతి మావోయిస్ట్ పార్టీ జాతీయ కార్యదర్శి గా ఎన్నికయ్యారని ప్రచారం జరుగుతోంది .ఆయనపై కరీంనగర్ జిల్లా లో ఆర్ ఎస్ యు విద్యార్థి నాయకుడు ఉన్నప్పుడు బీజేపీ ఏబీవీపీ కార్యకర్తలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు.ఆ తరువాత తిరుపతి అడవి బాట పట్టారు.ఇక ఆయన విప్లవ రాజకీయాలతో పాటుగా సైనికులవిభాగంలో ఆరితేరిన అనుభవం ఉంది. ఈ విధంగా ప్రపంచదేశ విప్లవ రాజకీయాలపై అవగాహన కలిగి ఉన్న తిరుపతి మాజీ దళపతి గణపతికి ప్రియ శిష్యుడు. విప్లవ పాఠాలు బోధించే తిరుపతిని తిరుపతి సార్ అంటూ పిలిచే వారు.దళిత మాల వర్గంకు చెందిన తిరుపతి తండ్రి 1980 దుబాయ్ లో ఉద్యోగం చేస్తూ జీవనం సాగించేవారు.ఆర్థికంగా ఇబ్బందులు లేని కుటుంబం నుంచి విప్లవ రాజకీయాల్లోకి వెళ్లారు.1984 లో ఆయన బస్తర్ వెళ్లారు.చంద్రబాబు పై దాడి స్కెచ్ గీసిన నలుగురిలో తిరుపతి ఒక్కరు.దేశంలో అమిత్షా బలగాలు ముప్పేట దాడులు జరుపుతున్నా కూడా కేంద్ర కమిటీ కీలక సమావేశం జరగినట్టుగా సమాచారం అందింది.ఈ సమావేశంలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ నాయకత్వ బాధ్యతలు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవుజీకి అప్పగించినట్టుగా తెలుస్తోంది.

సెంట్రల్ మిలటరీ కమిషన్ (సి యం, సి) చీఫ్ గా, పొలిట్ బ్యూరో సభ్యునిగా పని చేస్తున్న దేవుజీని కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నట్టుగా ప్రచారం జరుగుతోంది. గతంలో కూడా సెక్రటరీ పనిచేసిన నంబాల్లా కేశవరావు మిలిటరీ చీఫ్ గా పనిచేసిన వారే దేశంలోని 6రాష్టాల్లో నుండి కేంద్ర కమిటీలో ఉన్నప్పటికీ కేంద్ర కమిటీ కార్యదర్శి బాధ్యత మరోసారి తెలుగు రాష్ట్రాలకు చెందిన వారికే దక్కుతున్నాయి.నాటి పీపుల్స్ వార్ ఆవిర్భావం తరువాత కొండపల్లి సీతారామయ్య సీసీ కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించగా ఆయనను ఆ బాధ్యతల నుండి తప్పించి ముప్పాళ లక్ష్మణ్ రావు సుదీర్ఘ కాలం పని చేశారు. 2005లో మావోయిస్టు కమ్యూనిస్ట్ సెంటర్ (యం, సి సి) ఆవిర్భావం తరువాత కూడా ముప్పాళే ఆ బాధ్యతల్లో కొనసాగారు. పార్టీలో సంస్థాగత మార్పులు చేర్పుల జరిపినప్పుడు నంబళ్ల కేశవ రావును కేంద్ర కమిటీ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. 2025 మే 21న ఛత్తీస్‌గఢ్ బస్తర్ డివిజన్‌లోని నారాయణపూర్ జిల్లా అడవుల్లో భద్రతా దళాలతో జరిగిన కాల్పుల్లో నంబాళ్ల కేశవ్ రావు అలియాస్ బసవరాజ్ అలియాస్ గగనన్న 28 మంది సహచరులు చనిపోయారు. ఆ తరువాత పార్టీ



పొలిట్ బ్యూరో, సెంట్రల్ మిలటరీ కమిషన్ కమిటీల సంయుక్త సమావేశం జరగలేదు. దీంతో పార్టీకి సీనియర్ నేత ముప్పాళ లక్ష్మణ్ రావు దిశా నిర్దేశం చేస్తున్నట్టుగా ప్రచారం జరిగింది. పెద్దపల్లి వేణుగోపాల్ రావు పై మొదట్లో ప్రచారం జరిగింది.ఇక వేణుగోపాల్ సరెండర్ కావడంతో పార్టీ హైకమాండ్ అంతా తిరుపతి నెరవేరుస్తున్నారు అయితే తాజాగా కేంద్ర కమిటీ బాధ్యతలను తిప్పిరి తిరుపతికి అప్పగించినట్టుగా వెలుగులోకి వచ్చింది. దీంతో మరోసారి తెలుగు నాయకత్వానికే పట్టం కట్టినట్టయింది.


**జగిత్యాల వైపు కగార్ కన్ను..** జగిత్యాలకు చెందిన తిప్పిరి తిరుపతి,ముప్పాళ్ల లక్ష్మణ్ రావు లను ఇద్దరిని కలిపి మట్టుబెడితే ఇక మిగిలిన వారు తమ దారిలో వస్తారని ప్రభుత్వం భావిస్తుంది.హిడ్మా తర్వాత కేంద్ర ప్రభుత్వం లో గురి కూడా ఆ గురు శిష్యుల పై పడింది.దీంతో జగిత్యాల జిల్లాలోని ఇద్దరే కీలకంగా మారారు.కగార్ చివరి వేట మొదలైంది.చివరి నిమిషంలో ఆ ఇద్దరు కలిసి లొంగిపోతారని సమాచారం..ప్రచారం కూడా జోరుగా సాగుతోంది.లొంగిపోతారా?కగార్ లో నెలకొరుగుతారా?చూడాలి.

**మార్చి 2026 కంటే ముందేనా?..** మావోయిస్టు రహిత భారత్ మార్చి నాటికి ముందే పూర్తి స్థాయిలో ఖతం కానుందని కగార్ అధికారులు చెబుతున్నారు.అన్నట్టు గానే దేశంలో పలు రాష్ట్రాల్లో భారీ ఎత్తున ఎన్కౌంటర్లు జరుగుతున్నాయి.ఈ నేపథ్యంలోనే పదిమంది మావోయిస్టు పార్టీ సీసీ మెంబర్లను చంపేశారు.ముగ్గురిని కలిపి ఒకే నెలలో లొంగిపోయారు.

25 మందికి పైగా రాష్ట్ర స్థాయి నాయకులు లొంగిపోయారు.తెలంగాణ లో ఉన్న వారు కూడా లొంగుబాటులో ఉన్నారని తెలుస్తోంది.ఆల్రెడీ తెలంగాణ రాష్ట్ర పోలీస్ అధికారులు వద్దకు 23 మంది మావోలు ఉన్నారని సమాచారం.రేపో మాపో ఈ లొంగుబాటు అధికారికం గా మారే అవకాశముంది.




హైదరాబాద్: తెలంగాణలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా పంచాయతీల్లో ఓటరు జాబితా మరోసారి సవరణకు ఎస్ఈసీ షెడ్యూలు ప్రకటించింది. రేపటి నుంచి ఈనెల 23 వరకు గ్రామాల్లో ఓటర్ల జాబితాలను సవరించాలని నిర్ణయించింది. 20న ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాల స్వీకరణ, తప్పుల సవరణ, 21న ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాల పరిష్కారం, 23న తుది ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ప్రచురణ ఉంటుందని ఎన్నికల సంఘం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈమేరకు జిల్లా పంచాయతీ అధికారులకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో డిసెంబరు రెండో వారంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు షెడ్యూలు వెలువడే అవకాశం ఉంది. అదే నెలాఖరులోపు పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తిచేసే వీలుంది. డిసెంబరు 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాల తర్వాత పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు మంత్రిమండలి నిర్ణయం నేపథ్యంలో ఈ ప్రక్రియపై రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ, రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టి సారించాయి. సోమవారం మంత్రిమండలి భేటీలో 'స్థానిక' ఎన్నికలపై విస్తృతంగా చర్చ జరిగింది. రిజర్వేషన్ల అమలు, రాష్ట్ర హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలు, న్యాయనిపుణుల సలహాలపై పంచాయతీరాజ్‌శాఖ నివేదిక ఇవ్వగా దానిపై మంత్రులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈనెల 24న హైకోర్టులో విచారణ గురించి చెప్పారు. మార్చి 31లోపు పంచాయతీ ఎన్నికలను పూర్తి చేస్తేనే కేంద్ర ఆర్థిక సంఘం నుంచి నిధులు విడుదలయ్యే అవకాశం ఉందన్నారు.




హుజూరాబాద్: నక్సలైట్లు అడవుల్లో చనిపోతుంటే.. అర్బన్ నక్సల్స్ పదవులు అనుభవిస్తున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యానించారు. అమాయక నక్సలైట్లను రెచ్చగొట్టి వాళ్ల చావులకు కారకులయ్యారని విమర్శించారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడారు. "నక్సలైట్లు చనిపోతే వాళ్ల తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల గుండెకోత మీకేం తెలుసు? నక్సలైట్లు తుపాకీని సమర్థించిన వారు కూడా చేరొస్తు లే. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాది మాటంటే మాటే. మార్చిలోపు మావోయిజాన్ని పూర్తిగా అంతమొందిస్తాం"అని బండి సంజయ్ అన్నారు.

## వారి వల్లే పార్టీ ఓడిపోయింది.. బీఆర్ఎస్ కేడర్ సంచలన ఆరోపణలు




హైదరాబాద్, నవంబర్ 19: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమిని చవిచూసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో జూబ్లీహిల్స్‌లో ఎన్నిక అనివార్యమవగా.. సిట్టింగ్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు గులాబీ పార్టీ తీవ్రంగా ప్రయత్నించింది. బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతను బరిలో నిలిపింది. సెంటిమెంట్‌తో జూబ్లీహిల్స్ ఎన్నికల్లో గెలవాలని భావించినప్పటికీ ప్రజలు మాత్రం కాంగ్రెస్‌కే పట్టంకట్టారు. ఫలితంగా ఉపఎన్నికలో బీఆర్ఎస్ ఓడిపోయింది. ఈ క్రమంలో ఉప ఎన్నికలో ఓటమికి కారణాలపై జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తలు సమావేశమయ్యారు. ఉప ఎన్నికల్లో ఓటమికి కారణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా బైపోల్స్‌లో ఓటమిపై కార్యకర్తల నుంచి కేటీఆర్ ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. సొంత పార్టీ నాయకుల్లో కొందరు.. కాంగ్రెస్ కోవర్టులుగా పనిచేశారని పలువురు కార్యకర్తలు ఆరోపించారు. సొంత పార్టీ నేతలు సరిగా పనిచేయకపోవడం వలనే బీఆర్ఎస్ ఓడిపోయిందని గులాబీ కార్యకర్తలు చెప్పుకొచ్చారు. స్థానిక నేతలు, జిల్లాల నుంచి వచ్చిన బీఆర్ఎస్ నేతల మధ్య సమన్వయ లోపం కూడా ఓటమికి కారణమని నేతలకు చెప్పారు. స్థానిక జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ నేతలు బైపోల్స్‌ను పెద్దగా పట్టించుకోలేదని.. నియోజకవర్గంలో ద్వితీయ శ్రేణి నేతలు కరువయ్యారని పార్టీ కార్యకర్తలు తెలిపారు.

కాంగ్రెస్ పోల్ మేనేజ్‌మెంట్‌ను ఎదుర్కోలేకపోవటం కూడా ఓటమికి కారణమని సమావేశంలో బీఆర్ఎస్ క్యాడర్ పేర్కొంది.

## సింగరేణి భవన్ ముట్టడికి యత్నం.. కవిత అరెస్ట్



హైదరాబాద్ : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్ట్ చేశారు. సింగరేణి సంస్థలో డిపెండెంట్ ఉద్యోగాలను పునరుద్ధరించడంతోపాటు మెడికల్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం నాంపల్లిలోని సింగరేణి భవన్‌ను కల్వకుంట్ల కవితతోపాటు ఆ సంస్థ నేతలు, హెచ్ఎంఎస్ నాయకులు ప్రయత్నించారు. వారి ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఇరు వైపులా తోపులాట చోటు చేసుకుంది. స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కల్వకుంట్ల కవితతోపాటు పలువురు నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం వారిని నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు పోలీసులు తరలించారు. అంతకుముందు జాగృతి అధ్యక్షురాలు కవిత ఆటోలో సింగరేణి భవన్‌కు చేరుకున్నారు. బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన కవిత.. తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలిగా కల్వకుంట్ల కవిత.. ప్రజా సమస్యలపై గళం విప్పుతున్నారు. అందుకోసం జనం బాట కార్యక్రమాన్ని ఆమె ఎంచుకున్నారు. నవంబర్ 17వ తేదీ సోమవారం.. సత్తుపల్లిలోని సింగరేణి ఉపరితల బొగ్గు గనులను సందర్శించారు ఈ సంస్థలో డిపెండింగ్ ఉద్యోగాలనూ కాపాడుకోలేని పరిస్థితిలో ఉందన్నారు. మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి 54 మందిని ఎంపిక చేస్తే.. ముగ్గురిని మాత్రమే తీసుకుని మిగతా 51 మందిని రద్దు చేశారని విమర్శించారు. సింగరేణి అంశంలో సీఎం రేవంత్ రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ సంస్థ కార్మికులపై మాట్లాడడం లేదని విమర్శించారు. సింగరేణిలోని కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని.. వేజ్ బోర్డు ప్రకారం వేతనాలు అందజేయాలని.. ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా కవిత డిమాండ్ చేశారు.

సింగరేణి సూపర్ స్పెషాలిటీ వైద్యశాల, కార్మికుల పిల్లలకు పాఠశాలలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సంస్థ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నవంబర్ 19వ తేదీన జాగృతి, హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌ను ముట్టడిస్తామని జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రకటించిన విషయం విదితమే. కవిత ప్రకటన నేపథ్యంలో బుధవారం ఉదయం సింగరేణి భవన్ వద్ద భారీగా పోలీసులు మోహరించారు.

## ఐ-బొమ్మ కేసు.. ఇమంది రవి కస్టడికి నాంపల్లి కోర్టు అనుమతి



హైదరాబాద్: ఐ-బొమ్మ కేసులో అరెస్ట్ అయిన ఇమంది రవిని కస్టడీకి అనుమతిస్తూ హైదరాబాద్ నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన పైరసీ మూవీ రాకెట్ ఐ-బొమ్మ కీలక సూత్రధారిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. రవిని ఏడు రోజులు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన నాంపల్లి కోర్టు.. ఐదు రోజుల కస్టడీకి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కస్టడీ విచారణలో మరికొన్ని కీలక అంశాలు వెలుగు చూసే అవకాశముంది. ఇప్పటికే ఇమంది రవి కేసుపై ఈడీ దృష్టి సారించింది.




## మత విద్వేషాలు రెచ్చగొట్టే కంటెంట్.. నోయిడాలోని ఇస్తాంబుల్ ప్రింటింగ్ ప్రెస్‌పై దాడి

ఢిల్లీ పేలుడు కేసులో కీలక నిందితుడు డా.ఉమర్ నబీ, ఫరీదాబాద్ ఉగ్ర నెట్‌వర్క్‌కు చెందిన డా.ముజమ్మిల్ గనాయీ తదితరులు 2021లో తుర్కియేకు వెళ్లారని.. ఆ దేశంలో వారు జైషే మహమ్మద్ ప్రతినిధులను కలిసినట్లు దర్యాప్తు అధికారులు ఆరోపించిన విషయం తెలిసిందే. దర్యాప్తులో భాగంగా తుర్కియేతో సంబంధాలు ఉన్న సంస్థలపై అధికారులు నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో ఉత్తర ప్రదేశ్ ఉగ్రవాద నిరోధక దళం అధికారులు గ్రేటర్ నోయిడాలోని ఇస్తాంబుల్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రింటింగ్ ప్రెస్‌పైనా దాడులు చేశారు. ఇస్తాంబుల్ ఇంటర్నేషనల్ ప్రింటింగ్ ప్రెస్‌లో మత విద్వేషాలు రెచ్చగొట్టే కంటెంట్‌ను ప్రచురిస్తున్నట్లు గుర్తించామని ఏటీఎస్ అధికారులు పేర్కొన్నారు. కార్యాలయంలోని సీసీటీవీ ఫుటేజీ, ఇతర పత్రాలు, డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. 2021లో డా.ముజమ్మిల్ గనాయీ, ఉమర్ తుర్కియే వెళ్లిన సమయంలో ఉమర్ ఓ విదేశీ హ్యాండ్లర్‌ను కలిశాడని.. ఈ హ్యాండ్లర్ భారత్‌లో టెర్రర్ మాడ్యూల్‌ను ఏర్పాటు చేయడం, నిర్వహించడంపై వివరణాత్మక సూచనలు చేశాడన్నారు. పేలుడు పదార్థాలు, ఇతర వనరులను సేకరించడానికి తుర్కియే ఆధారిత నెట్‌వర్క్‌ల ద్వారా వారికి ఆర్థికసాయం అందిందని తెలిపారు. దీంతో తుర్కియేతో సంబంధాలు ఉన్న సంస్థలపై దాడులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నిందితుల విచారణ ప్రకారం.. 2021లో డా.ముజమ్మిల్ గనాయీ, ఉమర్ తుర్కియే వెళ్లొచ్చిన తర్వాత బహిరంగ మార్కెట్ నుంచి పెద్దఎత్తున రసాయనాలు సేకరించడం ప్రారంభించారు. వీటిలో 360 కిలోల అమ్మోనియం నైట్రేట్, పొటాషియం నైట్రేట్, సల్ఫర్ ఉన్నాయి. వీటిలో ఎక్కువ భాగం అల్ ఫలా విశ్వవిద్యాలయ ప్రాంగణం సమీపంలో నిల్వ చేశారు. డిసెంబర్ 6న (బాబ్రీ మసీదు కూల్చివేత రోజు) భారీ పేలుళ్లకు ఉమర్ నబీ ప్రణాళిక రచించినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. అంతలోనే ఫరీదాబాద్ ఉగ్ర నెట్‌వర్క్ కుట్ర బయటపడింది. ఇదికాస్త ఉమర్‌లో భయాందోళనకు దారితీయడం.. చివరకు ఎర్రకోట సమీపంలో ముందుగానే పేలుడు చోటుచేసుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు.

**పేలుడుకు వారం ముందు ఫోన్‌ను సోదరుడికి ఇచ్చిన ఉమర్...** ఢిల్లీ పేలుడుకు కారణమైన నిందితుడు ఉమర్ ఎర్రకోట వద్ద పేలుడుకు వారం రోజుల ముందు కశ్మీర్‌కు వెళ్లాడని.. ఆ సమయంలో తాను వాడే ఫోన్‌ను తన సోదరుడు జహూర్‌కు అప్పగించాడని దర్యాప్తులో గుర్తించినట్లు అధికారులు పేర్కొన్నారు.

విచారణలో జహూర్ మొదట తన సోదరుడి ఉగ్రదాడి ప్రణాళికల గురించి తనకు తెలిదని చెప్పినప్పటికీ.. తర్వాత ఉమర్ అతని ఫోన్‌ను తనకు ఇచ్చినట్లు తెలిపాడు. తన గురించి మీడియాలో ఏవైనా వార్తలు వస్తే ఫోన్‌ను వెంటనే నీటిలో పారేయాలని సూచించినట్లు తెలిపాడు. అతడు చెప్పిన వివరాల ఆధారంగా ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న అధికారులు అందులోని డేటాను పరిశీలిస్తున్నారు.




ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు కేసును అధికారులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి తాజాగా మరో కీలక విషయం బయటపడింది. ఎర్రకోట వద్ద పార్కింగ్‌లో ఉన్నప్పుడే.. ఉమర్ ఈ బాంబు తయారుచేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఢిల్లీలోకి వచ్చే సమయంలోనే ఉమర్ తన సహచరులతో టచ్‌లో ఉన్నాడని అధికారులు గుర్తించారు. ఏ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకోవాలనే దానిపై వారు చర్చలు జరిపినట్లు అనుమానిస్తున్నారు. ఎర్రకోటకు ఉన్న ప్రాముఖ్యత కారణంగా దానికి సమీపంలోని పార్కింగ్ ప్రదేశాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. అయితే, ఆ రోజు సోమవారం కావడంతో సందర్శకులు ఉండరనే విషయాన్ని వారు పరిగణనలోకి తీసుకోలేదని స్పష్టమవుతుంది. ఈ క్రమంలో మూడు గంటల పాటు ఉమర్ పార్కింగ్ ప్రాంతంలోనే ఉన్నట్లు అధికారులు కనుగొన్నారు. ఆ సమయంలో అతడు ఒక్కసారి కూడా కారు నుంచి దిగలేదని సీసీటీవీ ఆధారంగా గుర్తించారు. పార్కింగ్ ప్రాంతం చాలాసేపు ఖాళీగా ఉండటంతో.. పేలుడు ప్రణాళికను పక్కన పెట్టినట్లు అధికార వర్గాలు తెలిపాయి. దీంతో అత్యంత రద్దీగా ఉండే నేతాజీ సుభాష్‌మార్గ్‌లో పేలుడు నిర్వహించాలని ఉమర్, అతడి నిర్వాహకులు నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. దీనికి ఓవైపు ఎర్రకోట ఉండగా.. మరోవైపు చాందినీచౌక్ ఉంది. కారులో ఉన్న సమయంలో ఉమర్ పేలుడు పదార్థాలను తయారుచేస్తూ ఉండిపోయాడని పేర్కొన్నారు. అది పూర్తయిన తర్వాత పార్కింగ్ నుంచి కారు బయటకు తీసి ట్రాఫిక్‌లో వస్తుండగా.. దాన్ని పేల్చేశాడని తెలిపారు. ఫరీదాబాద్‌లోని ఉగ్ర మాడ్యూల్ గురించి బయటపడిన నేపథ్యంలో ఉమర్ భయపడినట్లు తెలుస్తోంది. అరెస్టు చేస్తారనే భయంతో అంతకుముందే.. పేలుడు జరపాలని నిర్ణయించుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలోనే అతడు ఢిల్లీలోకి ప్రవేశించినట్లు తెలుస్తోంది.

**ఎలాంటి పశ్చాత్తాపం లేదు..** ఎర్రకోట వద్ద పేలుడుకు కారణమైన హ్యుందాయ్ ఐ20 కారు తనదేనని.. ఢిల్లీ బాంబర్ డాక్టర్ ఉమర్ నబీ సన్నిహితుడు అమీర్ రషీద్ అలీ పేర్కొన్నట్లు అతడి లాయర్ స్మృతి తెలిపారు. ఓ మీడియాతో మాట్లాడుతూ.. ఢిల్లీ ఉగ్రవాద పేలుడు కేసు దర్యాప్తులో అమీర్ రషీద్ రిమాండ్ చాలా ముఖ్యమని ఎన్ఐఏ తెలిపినట్లు వెల్లడించారు. ఈ దాడికి సంబంధించి తప్పు చేశాననే భావన కానీ.. పశ్చాత్తాపం కానీ అతడిలో లేదని ఆమె పేర్కొన్నారు. ఢిల్లీ పేలుడు కేసు దర్యాప్తులో భాగంగా.. ఇటీవల జమ్మూకశ్మీర్‌కు చెందిన అలీని అధికారులు అరెస్టు చేశారు. కారు కొనుగోలు.. దానిలో పేలుడు పదార్థాలు అమర్చడం, ఆ తర్వాత పేల్చి వేయడంలో ప్రధాన పాత్ర పోషించాడని ఎన్ఐఏ తెలిపింది. రషీద్‌ను ఢిల్లీ కోర్టు 10 రోజుల ఎన్ఐఏ కస్టడికీ అప్పగించింది.




హైదరాబాద్: జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు జనసేన పార్టీ సిద్ధంగా ఉందని ఆ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రాజలింగం అన్నారు. ఈ మేరకు కూకట్‌పల్లి నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కేపీహెచ్‌బీలో సమావేశం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి నేమూరి శంకర్‌గౌడ్ హాజరై పార్టీ బలోపేతం, కార్యకర్తల సమీకరణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రేమ్‌కుమార్, వీర మహిళ చైర్మన్ కావ్య, ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.




ఢిల్లీ పేలుడు ఘటన నేపథ్యంలో ప్రముఖంగా వినిపిస్తున్న అల్-ఫలా యూనివర్సిటీపై మంగళవారం ఈడీ అధికారులు దాడులు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో యూనివర్సిటీ తప్పుడు అక్రిడిటేషన్ ఆధారంగా విద్యార్థుల నుంచి మొత్తం రూ.415.10 కోట్లు వసూలుచేసినట్లు ఈడీ అధికారులు వెల్లడించారు. ఫీజుల రూపంలో వచ్చిన ఆదాయాన్ని స్వచ్ఛంద విరాళంగా చూపినట్లు గుర్తించామన్నారు. ఎటువంటి గుర్తింపు లేకుండానే విశ్వవిద్యాలయాన్ని నిర్వహిస్తూ.. ఫీజులు వసూలుచేస్తున్నట్లు ఆరోపించారు. విశ్వవిద్యాలయానికి చెందిన ప్రధాన కార్యాలయంతో పాటు సంస్థ ట్రస్టీల ప్రాంగణంలో దాడుల అనంతరం మనీలాండరింగ్ కేసులో ఈడీ అధికారులు విశ్వవిద్యాలయం ఛైర్మన్ జావెద్ అహ్మద్ సిద్దిఖీని అరెస్టు చేసి ప్రశ్నిస్తున్నారు. సోదాల్లో రూ.48 లక్షలకు పైగా నగదు, డిజిటల్ పరికరాలు, డాక్యుమెంటరీ ఆధారాలు లభ్యమైనట్లు తెలిపారు. 2014-15 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరాల వరకు ఉన్న విశ్వవిద్యాలయ ఆదాయ పన్ను రిటర్నులలో ఫీజుల రూపంలో వచ్చిన ఆదాయాన్ని స్వచ్ఛంద విరాళంగా చూపిస్తున్నట్లు గుర్తించారు. అక్రమంగా సంపాదిస్తున్న ఈ నిధులను ఎక్కడికి మళ్లిస్తున్నారనే విషయంపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇటీవల ఫరీదాబాద్‌లో ఉగ్ర మాడ్యూల్‌ను అధికారులు ఛేధించిన సంగతి తెలిసిందే. మాడ్యూల్‌లోని వ్యక్తులకు ఈ యూనివర్సిటీతో సంబంధాలు ఉన్నట్లు బయటపడింది. దీంతో దీని పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. మాడ్యూల్‌తో సంబంధాలు బయటపడిన తర్వాత ఇండియన్ యూనివర్సిటీల సంఘం అల్-ఫలా విశ్వవిద్యాలయం సభ్యత్వాన్ని రద్దు చేసింది. ఈక్రమంలో ఢిల్లీ పోలీసులు యూనివర్సిటీలపై రెండు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఫోర్జరీ, మోసం పేరిట ఇవి నమోదయ్యాయి. మరోవైపు.. విశ్వవిద్యాలయానికి న్యాక్ షోకాజ్ నోటీసులు ఇచ్చింది. విద్యాసంస్థ వెబ్‌సైట్‌లో గుర్తింపు గురించి తప్పుడు సమాచారం ప్రచురించినందుకు గానూ ఇవి జారీ చేసినట్లు తెలిపింది. సోమవారం విశ్వవిద్యాలయం ఛైర్మన్ జావెద్‌కు రెండు సమన్లు జారీ చేశారు.

# మసక బారుతున్న పాల బుగ్గల పసి బాల్యం

**కాగితాలకే పరిమితం... బాలల హక్కుల పరిరక్షణం - నవంబర్ 20... ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం**




ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం ప్రతి సంవత్సరం నవంబరు 20న ప్రపంచవ్యాప్తంగా జరుపు కుంటారు. బాలల హక్కుల గురించి ప్రజల్లో అవగాహన కలిగించి, పిల్లలు తమ భావాలను, సమాచారాన్ని పంచు కోవడాన్ని, పరస్పర అవగాహనను పెంచు కోవాలన్న ఉద్దేశ్యంతో ఈ దినోత్సవం నిర్వహించ బడుతున్నది. 1954, డిసెంబరు 14న ఐక్యరాజ్య సమితి సాధారణ సభ 1956 నుంచి ప్రపంచ బాలల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం వేడుకగా నిర్వహించాలని అన్ని దేశాలకు సూచించింది. 1959, నవంబరు 20న ఐక్యరాజ్య సమితి జనరల్ శాసనసభ బాలల హక్కుల ప్రకటనను ఆమోదించింది..1989, నవంబరు 20న బాలల హక్కుల పై సంప్రదాయ ఆచరణను ఆమోదించింది. చాలా దేశాలు ఐక్యరాజ్య సమితి జనరల్ శాసనసభ సూచించిన నవంబరు 20 న ప్రపంచ బాలల దినోత్సవంగా పాటిస్తున్నారు. అయితే ప్రభుత్వాలు పలు పథకాలు చేపట్టినా ఇంకా అధిక శాతం పిల్లలు విధి లేక బాలకార్మికులు గానే ఉండి పోతున్నారు. బాలల శ్రేయస్సుకు కృషి జరుగుతున్నా ఆచరణలో ఫలితాలు కానరావడం లేదు. పాఠశాల సౌకర్యాలు లేక కొందరు, అవి ఉన్నా వివిధ కారణాల రీత్యా బడికి వెళ్లలేక మరి కొందరు బాలలు తమ ఉజ్వల భవిష్యత్తును అంధకారమయం చేసుకుంటున్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలతో ముడిపడి సంక్షేమ పథకాలకు నోచుకోక, చదువు చెప్పించే స్తోమత లేక ఎందరో పేద తల్లిదండ్రులు గత్యంతరం లేని స్థితిలో చిన్నారులపై భారాన్ని మోపుతున్నారు. హోటళ్లు, కిరాణా దుకాణాలు, ఫ్యాక్టరీలు, మిల్లులు, క్వారీలు, గనులకు తమ పిల్లలను పనికి పంపుతున్నారు. వ్యవసాయ పను లకు కొందరు బాలలు వెళుతున్నారు. చివరికి కొందరు పిల్లలను భిక్షాటన వృత్తిలోకి బలవంతంగా నెడుతున్నారు. వివిధ రంగాలలో బాలకార్మికులు అవస్థలు పడుతూ అనుక్షణం శ్రమిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పెద్దలు చేయాల్సిన పనులను సైతం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు నీళ్లు వదిలి బాలల చేత వెట్టిచాకిరీ చేయించు కుంటున్నా, వారికి విముక్తి కలిగించాలన్న ధ్యాస సంబంధిత అధికారుల్లో లేకపోవడం బాధా కరం. యజమానులు చెప్పిందే చట్టంగా, వారు చేసేదే సంక్షేమంగా పరిస్థితులున్నా కార్మికశాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అప్పుడప్పుడు తూతూ మంత్రంగా దాడులు చేస్తున్నా దోషులకు ఎలాంటి శిక్షలు పడడం లేదు. 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ - ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని భారత రాజ్యాంగం లోని 24వ నిబంధన స్పష్టం చేస్తున్నా అది కాగితాలకే పరిమిత మవడం శోచనీయం. పేదరికం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పసి పిల్లల బంగారు కలలు చెదిరి పోతున్నాయి. పాలబుగ్గల లేత వయసులో వారు కార్మికులుగా మారడం బాధాకరం. కార్మిక చట్టాలకు విరుద్ధంగా పిల్లల చేత పని చేయించుకునే యాజ మాన్యాలు తగిన వేతనాలు ఇవ్వడం లేదు. పిల్లలు పనిచేసే చోట తగిన రీతిలో భద్రతా సౌకర్యాలను కల్పించక పోవడం ఆక్షేపణీయం. ప్రాథమిక హక్కులను పేర్కొన్న రాజ్యాంగంలోని 3వ ప్రకరణంలోని 15(8)వ అంశం బాలల కోసం ప్రత్యేక శాసనాలు చేసే అధికారం ప్రభుత్వానికి కలుగ జేస్తున్నది. 28వ అధికరణం ప్రకారం బాలలను వ్యాపార వస్తువుగా మార్చడం, నిర్బంధ సేవలను చేయించ కోవడం అపరా ధంగానే పరిగణించాలి. 14 సంవత్సరాల లోపు పిల్లలను కర్మాగారాలలో, గనులలో, ఇతర ప్రమాద కరమైన పనులలో నియమించడాన్ని 24వ ఆర్టికల్ నిషేధించింది. 39(ఇ) ప్రకారం బాలలను వారి వయసుకు తగని, శక్తికి మించిన పనులలో నియమించ రాదు. పేదరికాన్ని సాకుగా చేసుకుని బాలలను పనుల్లో నియ మించడం నిషేధించా లని రాజ్యాంగం ఆదేశం చింది. కఠిన చట్టాలు ఎన్ని ఉన్నా చాలా మంది పిల్లలు బాల కార్మికులు గానే మిగిలి పోతున్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న నిర్బంధ ప్రాథమిక విద్య ఈనాటికీ ఫలించని కలగానే మిగిలి పోతున్నది. ప్రపంచ బాలకార్మి కుల్లో మూడవ వంతు మంది మన దేశంలోనే ఉన్నారని ఒక అంచనా. దీంతో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. 5 నుండి 15 సంవత్సరాల లోపు వయసు గల పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు పలు కార్యక్రమాలను చేపట్టారు. పాఠ శాలలో నమోదు కాని, మధ్యలో మాని వేసిన, అర్హతగల పిల్లల సమగ్ర వివరాలను సేకరించి వారిని తిరిగి తరగతులకు పంపేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొం దించి, ఆచరణాత్మక చర్యలను చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చదువుల పండగ పేరుతో 2002 ఆగస్టు 1 నుండి 10వరకూ, 2003 సంవత్సరం నవంబర్ 24 నుండి 29వరకూ బడి బయట ఉన్న పిల్లలనందరినీ పాఠశాలలలో చేర్పించే బృహత్ కార్యక్రమాన్ని అమలు చేశారు. ఆ తర్వాత ఏటా ఆ కార్యక్రమాన్ని అమలు చేస్తునే ఉన్నారు. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్నది వాస్తవం. అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు చెబుతున్నా బాల కార్మికులు వివిధ పనుల్లో కొనసాగుతూనే ఉన్నారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించ డానికి, నిర్బంధ ప్రాథ మిక విద్య అమలుకు మరింతగా చర్యలు చేపట్టవలసి ఉంది. ముందుగా వారి తల్లిదండ్రులకు చదువు పట్ల అవ గాహన కలిగించాలి. బాల కార్మికులకు వసతి సైతం కల్పించేలా ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయాలి. నిరుపేద కుటుంబాల్లో ఆర్థిక సమస్యలను తొలగించేలా వారికి సంక్షేమ పథకాలను అమలు చేయాలి. పిల్లల సంపాదనపై ఆధార పడకుండా తల్లిదండ్రులకు సాధికారత కల్పించాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల... సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్ 9440595494**

# తెలుగు సాహిత్యానికి గిరిజా మనోహర్ ఎనలేని సేవలు

## - నవంబర్ 20... గిరిజా మనోహర బాబు జన్మదినం



తెలంగాణకు చెందిన నటులు, కవి, రచయిత, ప్రముఖ ప్రాసంగికులు, ప్రయోక్త, సాహితీ సేవకులు గన్నమరాజు గిరిజా మనోహర బాబు గురించి తెలంగాణలో తెలియని సాహిత్యాభిమానులు ఉండరంటే అతశయోక్తి లేదేమో. 1951 నవంబరు 20 న మహబూబ్ నగర్ జిల్లా ఆలంపూర్ లో శకుంతలమ్మ, రామేశ్వర్ రావు దంపతులకు ఆయన జన్మించారు. ఆలంపూర్, పాలెంలలో ప్రాథమిక , ఉన్నత విద్యాభ్యాసాలు పూర్తి చేసి, ఉస్మానియా విశ్వ విద్యాలయం , హైదరాబాద్ నుండి ఎం ఏ. తెలుగులో పట్టా పొందాడు. జూనియర్ లెక్చరర్ గా 6 జనవరి 1978 జనవరి 7 న ఉద్యోగంలో చేరి , డిగ్రీ కళాశాల అధ్యాపకులు గా పదోన్నతి పొంది 33 సంవత్సరాల పాటు సత్తుపల్లి, ఖమ్మం, వర్ధన్నపేట, మహబూబాబాద్ , హుజురాబాద్, హనుమకొండ పట్టణాల్లో విధులు నిర్వర్తించారు. 2009 ఆగష్టు 31 న ఉద్యోగ విరమణ పొందారు. హన్మకొండలో 1996లో ప్రారంభింప బడిన "సహృదయ" సాహిత్య సాంస్కృతిక సంస్థకు వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షునిగా గత ఇరవై నాలుగేళ్ళ సేవలందించి ప్రస్తుతం ఆ సంస్థ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పండితులను ఆహ్వానించి "మహాభారత దర్శనం" పేరిట పద్దెనిమిది పర్వాల పై పద్దెనిమిది మంది పండితులతో ప్రసంగాలు ,"భాగవత సుధా స్రవంతి " పేరిట ద్వాదశ స్కంధాలపై పన్నెండు మంది పండితులతో ప్రసంగాలు," రామ కథా పరిమళం" పేరిట కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ విరచిత రామాయణ కల్పవృక్షంపై పది రోజుల పాటు ప్రసంగాలు, "ఉపనిషచ్చంద్రిక " పేరిట దశోపనిషత్తులపై పదిమంది పండితులతో పదిరోజుల ప్రసంగాలు"గీతామృతం" పేర భగవద్గీత లోని పద్దెనిమిది అధ్యాయాలపై పద్దెనిమిది మంది విద్వాంసులతో ప్రసంగాలు, "వేద సూక్త కౌముది " పేరుతో పది రోజులపాటు వేద సూక్తాల పై ప్రముఖులతో ధార్మిక ప్రసంగాలు,"రామాయణం - మానవ ధర్మము"అనే అంశం పై బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు తో ప్రవచనాలు సహృదయ పక్షాన ఏర్పాటుచేసి విజయవంతంగా నిర్వహించారు .. సహృదయ పక్షాన వందల సంఖ్యలో గ్రంథావిష్కరణ సభలు, సాహిత్య సమావేశాలు ,కవిసమ్మేళనాలు, చర్చా గోష్ఠులు నిర్వహించడమే గాక వ్యక్తిగతంగా జాతీయ స్థాయిలో జరిగిన అనేక కళాశాలల సదస్సులలో వివిధ అంశాలపై పత్ర సమర్పణలు చేశారు. వీటిలో కొడాలి సుబ్బారావు - హంపీ క్షేత్రము, కళా పూర్ణోదయము - ఆధునిక రచనా దృక్పథము, తిలక్ రచనలు, పద్యాన్ని ప్రజాపక్షం చేసిన దాశరథి , ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి కావ్యాలు, గోపీనాథ రామాయణం, కాళోజీ ఆత్మకథ,"కాళోజీ"జీవన గీత', తెలంగాణ కథ-స్థానికత, వేయిపడగలు - ప్రకృతి, మానవుడు, నవీన్ నవలలు - చారిత్రక దృక్కోణము, కుబ్జా విలాసము, పండరినాథ రామాయణం - వర్ణనలు, అలంకారములు , శ్రీశ్రీ అనంతం- ఒక దృష్టి .... మొదలైన సుమారు 50 అంశాలకు పైగా ఆధునిక ప్రాచీన సాహిత్యానికి సంబంధించిన వివిధ విషయాలపై సమర్పించిన పత్రాలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల లోని అనేక పట్టణాలలో ప్రదర్శించిన "శతక కవుల గోష్ఠి, ప్రతాప రుద్ర సభ, రామసభ, పోతనవిజయం, కృష్ణా పత్రిక దర్బారు, వందే మాతరం, భువన విజయం, ఇంద్ర సభ, పుష్కర సభ, బ్రహ్మసభ, గణపతి విజయం, గోలకొండ విజయం " వంటి పలు సాహిత్య రూపకాల్లో చారిత్రక కవుల పాత్రధారణ చేశారు. ఆకాశవాణి, దూరదర్శన్ లోనే కాకుండా ఇతర చానళ్ళలో కూడా వివిధ ధార్మిక అంశాలతో పాటుగా, సాహిత్యోపన్యాసాలు కూడా చేస్తున్నారు. తిరుమల బ్రహ్మోత్సవాలలో, పుష్కరాల సందర్భాలలో శ్రీరామనవమి మొదలైన పలు ఇతర ప్రత్యేక సందర్భలలో జరిగిన ఎన్నో కార్యక్రమాలలో అనేక పర్యాయాలు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఆయన పొందిన సత్కారాల్లో సాహితీ విరించి బిరుదు, తో బాటు తెలుగు విశ్వవిద్యాలయం వారి కీర్తి పురస్కారం , దేవరకొండ బాలగంగాధర తిలక్ పురస్కారం, (తణుకు) సంకీర్తన వారి జీవన సాఫల్య పురస్కారం (హైదరాబాదు), తెలుగు భాషా దినోత్సవ పురస్కారం, జాతీయ సాహిత్య పరిషత్ పురస్కారం, స్వరసుధ వారి సత్కారం, కళా వాహిని సత్కారం, స్వర రవళి వారి సత్కారం, శాంతిదూత పురస్కారం, శాతవాహన విశ్వ విద్యాలయం పురస్కారం ప్రధానమైనవి. ఆయన సంపాదకత్వంలో రసహృదయ , కథకు శతమానం , శతక సాహిత్యం - సామాజిక నైతిక విలువలు , యువజన విజ్ఞానము (రెండవ ముద్రణ సురవరం ప్రతాపరెడ్డి ) , శతపత్రము (రెండో ముద్రణ - గడియారం రామకృష్ణ శర్మ ఆత్మకథ - కేంద్ర సాహిత్య అకాడెమీ వారి పురస్కారం పొందిన రచనబీ తెలుగు కథ వెలుగులు , ఓరుగల్లు కళా వైభవము తదితరాలను వెలువరించారు. స్వీయ రచనలు :: సాహిత్య సుధ , చయనిక , శతక సమీరం , తెలుగు శతకాలు ( లఘు గ్రంథం ది నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా వెలువరించిన లఘురచన ) , వెలుగుదారి , గన్నమరాజు పీఠికలు తదితర రచనలు చేశారు. హైదరాబాద్, ఖమ్మం, మధిర, విజయవాడ, మహబూబు నగర్ , తిరుపతి, కర్నూలు, వరంగల్, కరీంనగర్, రాజమండ్రి, విశాఖ పట్టణం, బాపట్ల, తాండూరు, వికారాబాద్, సూర్యాపేట, ఎమ్మిగనూరు, ఆదోని, షాద్ నగర్ మొదలైన పలు చోట్లవివిధ సాహిత్య , సాంస్కృతిక , సామాజిక అంశాలను గురించి వందలాది ప్రసంగాలు చేశారు. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ లోని 23 జిల్లాలలోని పలు ప్రాంతాలలో సాహిత్య, సాంస్కృతిక, సామాజిక అంశాల పై వందలాది ప్రసంగాలు చేస్తూనే ఉన్నారు. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# వైద్యులకు రోగులకు వారధులు ఫార్మసిస్టులు

## - నవంబర్ 16నుండి 22... జాతీయ ఫార్మసీ వారోత్సవాలు




ప్రజలు, ప్రభుత్వాలు ఫార్మసిస్ట్ ల గురుతర సేవలను గుర్తించటానికి, ఫార్మసిస్ట్ లు తమను తాము పునరంకితం చేసికొనటానికి ఇండియన్ ఫార్మస్యూటికల్ అసోసియేషన్ (ఐపిఏ) నవంబర్ మూడవ వారాన్ని జాతీయ ఫార్మసీ సప్తాహం గా ప్రతి ఏటా పాటిస్తున్నది. అంటే జాతీయ ఫార్మసీ వారోత్సవాలను నవంబర్ 16, నుండి నవంబర్ 22 వరకు ఏటా జరుపు కుంటారు. ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా మరియు ఢిల్లీ ఫార్మాస్యూటికల్ ట్రస్ట్ సంయుక్తంగా వృత్తిపరమైన ఔషధ తయారీదార్ల ప్రతిష్టను పెంచడమే లక్ష్యంగా వారోత్సవాల కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఔషధం లేనిది చికిత్స లేదు. ఔషధ పరిశోధన, ఆవిష్కరణ, ఉత్పత్తి, పంపిణి, నిలువ, వితరణ, పర్యవేక్షణ, గుణదోష నిర్ధారణ వంటి అన్ని దశలు ఫార్మసిస్ట్ ల పరిధిలోని అంశాలు. భారతదేశంలో 11.25 లక్షల ఫార్మసిస్ట్ లు నిత్యం ప్రజలకు సేవలు అందిస్తున్నారు. దేశంలోని ఫార్మసిస్ట్ లందరికి 1939లో ఏర్పడిన ఇండియన్ ఫార్మస్యూటికల్ అసోసియేషన్ (ఐపిఏ) ప్రాతినిధ్యం వహిస్తున్నది. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని డ్రగ్ టెక్నికల్ అడ్వైసరీ బోర్డ్ సభ్యురాలుగా ఐ పి ఏ ప్రభుత్వానికి మార్గదర్శనం చేస్తుంది. ఐరోపా ఖండ వాసుల వలసలతోనే దేశంలోనికి అలోపతి వైద్యం ప్రవేశించింది. ఫార్మసి వృత్తి బ్రిటన్ లో అపోతెకరీ నుంచి, కెమిస్ట్ డ్రగిస్ట్ వంటి దశలను దాటి ఫార్మసిస్ట్ గా పరిణమించింది. దేశంలో మొదటి అలోపతి జెనరల్ హాస్పిటల్ 1664లో మద్రాస్ లో ఏర్పాటు కాగా, మొదటి కమ్యూనిటి ఫార్మసి 1811లో కోల్‌కతాలో ప్రారంభం అయింది. ఆసియా లోనే తొలి ఫార్మసి కళాశాల గోవా లోని పంజింలో 1842లో పోర్చుగీస్ ప్రభుత్వం వారిచే ప్రారంభమైంది. ఆరోగ్యంపై ప్రతి వారికీ శ్రద్ధ ఉండడం సహజం. ఆరోగ్యం కోసం ప్రపంచంలోని ప్రతి ఒక్కరూ నానా పాట్లు పడుతుంటారు. చికిత్స కన్నా, నివారణే నయమని, ఇప్పుడిప్పుడే చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఏ చిన్నపాటి రోగం వచ్చినా, వెంటనే మందులు తీసుకుంటున్నారు. ఆరోగ్య మెరుగుదలలో మందులు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఇంతకూ మందులను ఎవరు మెరుగు పరుస్తారో, ఎవరు తయారు చేస్తారో తెలుసా? ఫార్మాసిస్టులు. వైద్య బృందంలో ఫార్మసిస్టుల ప్రాముఖ్యత ఎంతో ఉంది. చికిత్స, ఉత్పత్తులను సమర్థవంతంగా ఉపయోగించడం ద్వారా రోగులకు ఆరోగ్య సేవలను మెరుగు పరచడం ఔషధ నిపుణుల ప్రాథమిక లక్ష్యం. వాస్తవానికి ఫార్మాసిస్టు రెండో వైద్యుడిగా పరిగణించ బడతాడు. రోగులకు కావాల్సిన మందులను, ఏ రోగికి ఎంత మోతాదులో కావాలో నిర్ధారిస్తాడు. అంతేకాదు వాటి వల్ల ప్రయోజనాలు కలిగేలా చేస్తాడు. దుష్ప్రభావాలు కలగకుండా మార్గ నిర్దేశాలు చేస్తాడు. క్లినికల్ ఫలితాలను మెరుగు పరచడానికి మందులు వాటి వాడే పద్ధతిని, సురక్షితమైన వాడకాన్ని కూడా ప్రోత్సహిస్తాడు. ప్రపంచం లోని ప్రతి ఒక్క రోగికీ అందరికీ సురక్షితమైన మరియు సమర్థ వంతమైన మందులు అందించేందుకు అనుక్షణం ఫార్మా సిస్టులు కృషి సల్పుతారు. ఔషధాల వాడకాన్ని మెరుగు పరచి, రోగుల భద్రతను నిర్ధారించే మరియు పరిరక్షించేందుకు ఫార్మాసిస్టులు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తారు. ప్రజల ఆరోగ్య భద్రత రీత్యా మెడిసిన్స్ లోని లోపాలను తగ్గించేందుకు ఫార్మా సిస్టులు ఎక్కువగా కృషి చేస్తారు. ఫార్మాసిస్టులు వారి విస్తృత జ్ఞానం మరియు నైపుణ్యాన్ని ప్రజల ఆరోగ్యాల కోసం ఉపయోగిస్తారు. ఏ ఒక్క రోగిని హాని కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత వారిపై ఉందనే విషయాన్ని అనుక్షణం గుర్తుంచుకుని, పని చేస్తారు. వారు తయారు చేసిన మెడిసిన్స్ నుండి ఉత్తమ ఫలితం వచ్చేలా చాలా కృషి చేస్తారు. చాలా మంది వారి పని, తాము సూచించిన మందులను అప్పగించడమే అనుకుంటారు. కానీ జ్ఞానం, అనుభవ పరంగా వారు డాక్టర్ కంటే ఏ మాత్రం తక్కువ కాదు. ఫార్మాసిస్టులకు మెడిసిన్స్, వాటి దుష్ప్రభావాల గురించి సంపూర్ణ అవగాహన ఉంటుంది. ప్రధానంగా వైద్యుల వద్దకు వెళ్లలేని, వైద్యం చేయించు కోలేని నిరు పేదలకు, ఔషధాలను అందించడం లోనూ వారు ఎక్కువ బాధ్యత వహిస్తారు. ఫార్మాసిస్టును కూడా ఒకరకంగా వైద్యుడి లాగే తెల్లటి కోటు ధరించి, మందులు పంపిణీ చేసే ఆరోగ్య సంరక్షక నిపుణుడిలా భావించ వచ్చు. కాని ఔషధ పంపిణీకి మించి ఫార్మాసిస్టు పాత్ర విస్తరిస్తుందని మనం తెలుసుకోవాలి. రోగులకు హాని లేదా మరణానికి మరో ప్రధాన కారణం ఔషధ లోపం అని కొన్ని అధ్యయనాలు చెపుతున్నాయి. లోపం తరచుగా శాశ్వత అవయవ నష్టం, పక్షవాతం లేదా మరణానికి దారి తీస్తుంది. ఇంటర్నేషనల్ ఫార్మాస్యూటికల్ ఫెడరేషన్ 2009 ఇస్తాంబుల్ (టర్కీ)లో జరిగిన వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ ఫార్మసీ అండ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ లో గుర్తించింది. 1912 సంవత్సరం లోనే సెప్టెంబర్ 25న ఫార్మాసిస్టు డే జరుపు కోవడానికి ఎంపిక చేయ బడి, అప్పటి నుండి ఫార్మాస్యూటికల్ ఫెడరేషన్ ప్రారంభించ బడింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచ వ్యాప్తంగా కనీసం 2.6 మిలియన్ ఫార్మసిస్టులు ఇతర ఫార్మాస్యూటికల్ సిబ్బంది ఉన్నట్లు అంచనా వేసింది. ఆరోగ్య కరమైన జీవనానికి సలహా ఇవ్వడం, వ్యాధిని నివారించడానికి టీకాలు వేయడం మందులు సరిగ్గా తీసుకునేలా చూడడం, తద్వారా వ్యాధులను చక్కగా నయం చేయడం, జీవిత నాణ్యతను మెరుగు పరచడం, సురక్షితమైన మరియు సమర్థ వంతమైన మందులు మరియు వ్యాక్సిన్లను అభివృద్ధి చేయడం ద్వారా ఔషధ శాస్త్రవేత్తలు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చేస్తున్న సేవలు అమోఘం. జాతీయ ఫార్మాసిస్ట్ వారోత్సవం అంటే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అందరూ ఫార్మాసిస్టుల సేవలను గుర్తించి, ఔషధ తయారీ నుండి, వలసిన వారికి పంపిణీ, మందులు వాడే విధానం వరకు, అసమాన, అమూల్య సేవలు అందిస్తున్న, వారి ప్రతిభావంత మైన పాత్రకు సముచిత గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలి. ప్రధానంగా ప్రస్తుత పరిస్థితులలో కరోనా వైరస్ యొక్క వ్యాప్తిని ఆపడానికి ఫార్మసిస్ట్‌లు అవిశ్రాంతంగా కృషి వెల కట్టలేనిది. ప్రజలకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచడం, పంపిణీ చేయడం, కుటుంబ సభ్యులకు దూరంగా, స్వార్థం మరిచి, మానవ సేవే పరమార్థంగా, ఈ క్లిష్ట సమయంలో ఫార్మసిస్టులు చేస్తున్న సేవలకు ప్రతి ఒక్కరూ ప్రోత్సాహం అందించి, కృతజ్ఞతలు ప్రకటించాల్సిన సమయం ఇది.

**రామ కిష్టయ్య సంగన భట్ల... సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్ 9440595494**




**ఏపీ ఏజెన్సీ ప్రాంతంలో వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో మావోయిస్టు దళ మాజీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ వీడియో సందేశం విడుదల చేశారు. ఇప్పుడు సమాజం మారిందని, పరిస్థితులను అర్థం చేసుకుని తాము ఆయుధాలను వీడామని వివరించారు. మిగతా దళ సభ్యులు కూడా ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. లొంగిపోయే దళ సభ్యులు తనను సంప్రదించొచ్చని చెప్పారు. తన ఫోన్ నంబర్ 8856038533 తెలియజేశారు.**




# మావోయిస్టులకు రిమాండ్ విధించిన కోర్టు..

అమరావతి, నవంబర్ 19: ఆంధ్రప్రదేశ్‌లో వివిధ ప్రాంతాల్లో అరెస్టయిన 50 మంది మావోయిస్టులను పోలీసులు బుధవారం కోర్టులో హాజరుపర్చారు. అంతకుముందు వైద్య పరీక్షల నిమిత్తం వారిని ప్రభుత్వాసుపత్రులకు తరలించారు. అనంతరం వారిని కోర్టులో హాజరుపరిచారు. వీరికి కోర్టు రిమాండ్ విధించింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మంగళవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మాతోపాటు పలువురు మావోయిస్టులు మరణించారు. మరోవైపు అదే సమయంలో ఏలూరు, కాకినాడ, విజయవాడలలో మావోయిస్టులు ఉన్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీని ఆధారంగా ఆయా నగరాల్లోని ఆ ప్రాంతాల్లో పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించి.. భారీగా మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో భాగంగా వీరి నుంచి పోలీసులు కీలక సమాచారం రాబట్టినట్లు తెలుస్తోంది. అదుపులోకి తీసుకున్న మావోయిస్టుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా భద్రతను పర్యవేక్షించే జ్యోతి సైతం ఉన్నట్లు సమాచారం. ఇంకోవైపు ఆంధ్రప్రదేశ్‌లోని ఈ ప్రధాన నగరాలకు వీరు ఎందుకు వచ్చారు. దీని వెనుక ఏమైనా కారణాలు ఉన్నాయా? ప్రముఖులను ఎవరినైనా టార్గెట్ చేసుకున్నారా? అనే కోణంలో మావోయిస్టులను పోలీసులు విచారిస్తున్నారు. 2026, మార్చి నెలాఖరు నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించడమే లక్ష్యంగా కేంద్రం.. ఆపరేషన్ కగార్‌ను తెరపైకి తీసుకు వచ్చింది. మావోయిస్టుల ప్రభావం అధికంగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాలు కూంబింగ్‌ను తీవ్రతరం చేశాయి. వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. ఈ నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతం నుంచి ఆంధ్రప్రదేశ్ అటవీ ప్రాంతంలోకి మావోయిస్టులు వచ్చారనే ఒక చర్చ సైతం సాగుతోంది. అదీకాక ఈ ప్రాంతాన్ని తమకు షెల్టర్ జోన్‌గా ఉపయోగించు కోవచ్చని వారు భావించారని అందుకే ఏపీకి వచ్చారని తెలుస్తోంది.

చురకలు

## సంపాదకీయం

# రష్యా పేరు చెప్పి భారత్ పై ఈ బాదుడు ఆలోచనలేంది ట్రంప్?

రష్యా – ఉక్రెయిన్ మధ్య యుద్ధం ఆపడం సంగతేమో కానీ.. ఈ గ్యాప్ లో ప్రపంచ దేశాలను, ప్రధానంగా భారత్ ను గట్టిగా బాదే ఆలోచనలు చేస్తున్నారు అమెరికా అధ్యక్షుడు ట్రంప్! భారత్ తమకు మంచి మిత్రదేశం అని, భారతీయులంతా మంచివారని, ప్రధాని మోడీ తనకు మంచి మిత్రుడని చెబుతూనే చేయాల్సినదంతా చేస్తున్నారు. ఈ సమయంలో మరో భారీ బాంబు పేల్చారు! అవును... రష్యా – ఉక్రెయిన్ ల మధ్య యుద్ధం ఆపేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా అవి ఫలించకో.. లేక, ఆ పేరు చెప్పి తన పని తాను కానివ్వాలనో తెలియదు కానీ... పలు ప్రపంచ దేశాలను సుంకాలతో గట్టిగా బాదే పనికి పూనుకున్నారు ట్రంప్. ఇందులో భాగంగా... రష్యాతో వ్యాపారం చేసే దేశాలపై సుంకాల పెంపుకు సంబంధించిన బిల్లుకు తాను మద్దతిస్తున్నట్లు తాజాగా వెల్లడించారు. వాస్తవానికి రష్యాతో వ్యాపారం చేసే దేశాలపై ఇప్పటికే పెద్ద మొత్తం లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలు విధిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మరింతగా సుంకాల పెంపుకు సంబంధించిన బిల్లుకు తాను మద్దతిస్తున్నట్లు తాజాగా ఆయన వెల్లడించారు. మాస్కోతో వాణిజ్యం చేసే దేశాలపై మరిన్ని కఠిన చర్యలకు సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే బిగ్ బాంబ్ పేల్చారు. ఇందులో భాగంగా... రష్యాతో వ్యాపారం చేసే దేశాలపై 500శాతం టారిఫ్ లు విధిస్తానన్నారు. అయితే.. ఈ జాబితాలో కచ్చితంగా భారత్, చైనా ఉంటాయని చెబుతున్నారు! వీటితో పాటు ఇరాన్ కూ ఎఫెక్ట్ తప్పదనే కామెంట్లు వినిపిస్తున్నాయి. దీనికి సంబంధించిన బిల్లును రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహం ఇటీవల ప్రతిపాదించారు. ఈ బిల్లులో... రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూ, ఉక్రెయిన్ కు సాయం చేయని దేశాల ఉత్పత్తులపై 500 శాతం సుంకం విధిస్తున్నామని ట్రంప్ అన్నారు. ఇదే సమయంలో.. భారత్, చైనాలే రష్యా నుంచి సుమారు 70శాతం చమురును కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో.. ఈ బిల్లు అమల్లోకి వస్తే ఆ దేశం నుంచి పెద్ద మొత్తంలో ముడి చమురు దిగుమతి చేసుకుంటున్న భారత్, చైనాలపై తీవ్ర ప్రభావం పడనుంది.

కాగా... భారతదేశంపై 50 శాతం సుంకా లు, రష్యా నుంచి ఇంధన కొనుగోళ్లకు సంబంధించి ఇంకో 25 శాతం సుంకం సహా ప్రపంచంలోని పలు దేశాలపై కొన్ని అత్యంత తీవ్రమైన సుంకాలను ట్రంప్ పరిపాలన ఇప్పటికే విధించిన సంగతి తెలిసిందే! అవే బాదుడు అనుకుంటే.. ఇప్పుడు ఏకంగా 500% అని ట్రంప్ అంటుండటంతో ఇది తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# శ్రోతల జీవితాలలో భాగాలు... బావగారి కబుర్లు - నవంబర్ 20... ప్రయాగ నరసింహ శాస్త్రి జయంతి



ఆకాశవాణి శ్రోతలకు చిర పరిచితులు ప్రయాగ నరసింహ శాస్త్రి. రేడియోనే ప్రధాన మనో రంజక సాధనంగా ఒకనాటి ప్రజల నిత్య జీవితాలతో పెనవేసుకున్న రోజులలో ప్రయాగ నిత్య విధి కార్యక్రమాలు శ్రోతల జీవిత భాగస్వాములు అయినాయంటే అతిశయోక్తి కాదేమో. ఆకాశ వాణి ప్రయోక్తగా, తెలుగు సినీ నటునిగా, హరికథకులుగా, రచయితగా, గాయకునిగా ప్రయాగ నరసింహ శాస్త్రి (నవంబరు 20, 1909 – సెప్టెంబరు 11, 1983) తెలుగు ప్రజలకు రేడియో ద్వారా చిర పరిచితులు. తన ప్రత్యేక కంఠ స్వరంతో ఖంగుమని పలుకుతూ, జానపద శైలిలో పాడుతూ శ్రోతల్ని ఉర్రూత లూగించిన వ్యక్తి శ్రీ ప్రయాగ నరసింహ శాస్త్రి. మూడు దశాబ్దాలు ఆకాశవాణిలో పనిచేసి ప్రశంసా పాత్రుడైన వ్యక్తి. 1936 లో ప్రయాగ ఆకాశవాణి మదరాసు కేంద్రంలో నిలయ విద్వాంసుడుగా చేరారు. ‘ బావగారి కబుర్ల ద్వారా ఆయన శ్రోతలకి చేరువయ్యారు. ఆయన, గాడేపల్లి సూర్య నారాయణతో కలిసి బావగారి కబుర్లు నిర్వహించే వారు. అవి శ్రోతల జీవనంలో భాగమై పోయాయి. “ఏమండోయ్ బావగారు రావాలి రావాలి” అనే పలకరింపులు సహజమయ్యాయి. స్క్రిప్టు లేకుండా యధాలాపంగా అనర్గళంగా తన సంభాషణలతో వినోదాన్ని అందించేవారు ప్రయాగ. నరసింహశాస్త్రి 1909 నవంబర్ 20 న విశాఖపట్నం జిల్లా పెదగాడి గ్రామంలో సంప్రదాయ కుటుంబంలో జన్మించారు. బాల్యం నుండి సంగీత సాహిత్యాలపై అపారమైన ప్రీతి. విజయనగరం మహారాజా కళాశాలలో చదువు కొని పట్టభద్రులయ్యారు. శ్రీశ్రీ, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి ఆయన సహాధ్యాయులు. హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణ దాసు వద్ద హరికథా గానంలో మెళుకువలు నేర్చు కొన్నారు. చక్కని గాత్రము రూపము ఉన్న ప్రయాగ 1935లో చలన చిత్రరంగ ప్రవేశం చేశారు. భీష్మ చిత్రంలో విచిత్ర వీర్యుని పాత్రను పోషించారు. నాగయ్య గారి త్యాగయ్య చిత్రంలో గణపతి పాత్రను పోషించారు. అనేక చిత్రాలకు పాటలు వ్రాశారు. 1969లో ఆకాశవాణిలో పదవీ విరమణ చేసిన తర్వాత మళ్లీ నటన పై ఆసక్తి తో చిత్రరంగంలో ప్రవేశించారు. చీకటి వెలుగులు, అందాల రాముడు, డబ్బుకు లోకం దాసోహం వంటి సినిమాలలో నటించారు. ఆకాశవాణి మదరాసు కేంద్రంలో 1936 నుండి రెండు దశాబ్దాలు పని చేశారు. అక్కడ వీరు ప్రసారం చేసిన మొద్దబ్బాయ్ హెచ్.ఎం.వి. గ్రామఫోన్ రికార్డు కంపెని వారు రికార్డు చేసి విడుదల చేశారు. 20కి పైగా హెచ్.ఎం.వి. రికార్డులు ఆయన విడుదల చేశారు. శ్రోతలలో వీరికంత ప్రశస్తి వుండేది. 1956లో ఆకాశవాణి విజయవాడ కేంద్రానికి బదలీ అయ్యారు. అక్కడ పింగళి లక్ష్మీకాంతం, బందా కనక లింగేశ్వర రావు, బాలాంత్రపు రజనీ కాంతారావు, జరుక్ శాస్త్రి, బాల మురళి, ఓలేటి వంటి పండితుల సాహచర్యం లభించింది. విజయవాడలో ప్రయాగ గ్రామీణ కార్యక్రమాల ప్రయోక్తగా పనిచేశారు. ఎన్నో జానపద గేయాలను పాడి, పాడించి శ్రోతల మన్ననలందు కొన్నారు. హరికథలు స్వయంగా రచించి గానం చేశారు. త్యాగరాజ చరిత్ర, కన్యాకుమారి, గాంధీజీ, శంకర విజయం హరి కథలు ప్రముఖాలు. 1962లో భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ సమక్షంలో గాంధీజీ బుర్రకథను వినిపించి బంగారు పతకంతో సన్మానించ బడ్డారు. ఆయన వివిధ బుర్రకథలు హెచ్.ఎం.వి. గ్రామఫోను రికార్డులుగా విడుదలైనాయి. వినోదాల వీరయ్యగా విజయవాడ కేంద్రం నుండి ఎన్నో కార్యక్రమాలు సమర్పించారు. ఆకాశవాణిని ప్రయాగకు ఆరోప్రాణంగా భావించే వారు. 1969లో పదవీ విరమణ చేసేంత వరకు ఆయన ప్రయోక్తగా ఎన్నో కార్యక్రమాలు వెలువడ్డాయి. 1970 నుండి ఐదు సంవత్సరాలు కేంద్ర సంగీత నాటక అకాడమీ పక్షాన ‘ బాలాజీ ఆర్ట్ థియేటర్ ‘ పేరుతో ప్రభుత్వ పథకాలను ప్రచారం చేశారు. 1980 నుండి తిరుమల తిరుపతి దేవస్థానం వారి సంగీత కళా పీఠంలో యక్షగానాలు, హరికథల అధ్యాపకులుగా పని చేశారు. హిందు ధర్మ ప్రచార పరిషత్ లో జానపద కళా ప్రచారకులుగా వ్యవహరించారు. 1983 సెప్టెంబరు 11న పరమ పదించారు. మాట, పాట, ఆటలతో శ్రోతల్ని సంబరపెట్టిన ప్రయాగ నిత్యోత్సాహి. ప్రయాగ నరసింహ శాస్త్రి కుమార్తె వేదవతి ఆకాశవాణిలో నిజామాబాద్ లో అసిస్టెంట్ స్టేషను డైరక్టరుగా సుపరిచితులు. భీష్మ – విచిత్ర వీర్యుడు, త్యాగయ్య – గణపతి, చీకటి వెలుగులు, అందాల రాముడు, డబ్బుకు లోకం దాసోహం తదితర చిత్రాలలో ఆయన నటించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# స్వాతంత్ర్య యోధులకు స్ఫూర్తి ప్రదాత టిప్పు సుల్తాన్ - నవంబర్ 20...టిప్పు సుల్తాన్ జయంతి



టిప్పు సుల్తాన్ (1751–1799) భారతదేశ చరిత్రలో దేశభక్తుడు, శక్తివంతమైన పాలకుడు, మైసూర్ సామ్రాజ్యానికి పునాది పటిష్ఠం చేసిన మహానాయకుడిగా నిలిచారు. “మైసూర్ పులి” అని ప్రఖ్యాతి గాంచిన ఆయన, బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ కబంధ హస్తాల్లో భారత స్వతంత్రాన్ని కాపాడేందుకు చేసిన పోరాటానికి చిహ్నంగా నిలిచారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో మొదటి పోరాట యోధుడిగా భావించబడే టిప్పు సుల్తాన్, తన పాలనలో సైనిక, ఆర్థిక, సాంకేతిక రంగాల్లో విశేషమైన ప్రగతిని సాధించారు. టిప్పు సుల్తాన్ 1751 నవంబర్ 20న దేవనహళ్లి (నేటి కర్ణాటకలోని బెంగళూరుకు సమీపం)లో జన్మించారు. ఆయన తండ్రి హైదరాలి, తల్లి ఫాతిమా ఫకరున్నిస్సా. హైదరాలి మైసూర్ సామ్రాజ్యానికి సైన్యాధికారి నుంచి సామ్రాజ్య స్థాపకుడిగా ఎదిగారు. తన తండ్రి నుండి టిప్పు సుల్తాన్ మంచి సైనిక వ్యూహాలు, పరిపాలన నైపుణ్యాలు, మరియు ధైర్య సాహసాలను నేర్చుకున్నారు. యువస్థాయి లోనే టిప్పు సైనిక చాతుర్యంతో ప్రసిద్ధి చెందారు. 15 ఏళ్ల వయసులోనే ఆయన తన తండ్రితో కలిసి ఆంగ్లేయుల మీద యుద్ధాల్లో పాల్గొన్నారు. వారి కుటుంబం మైసూరును స్వతంత్రమైన, బలమైన సామ్రాజ్యంగా తీర్చిదిద్దేందుకు తన శక్తి అంతా ఉపయోగించింది. టిప్పు సుల్తాన్ 1782లో తన తండ్రి మరణం తరువాత మైసూరు సామ్రాజ్యానికి పాలకుడిగా నియమితుడయ్యారు. ఆయన పాలనను చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలిపింది. టిప్పు సుల్తాన్ తన పాలనలో ఆర్థిక ప్రగతికి పెద్దపీట వేశారు. వ్యవసాయానికి సంబంధించి భూమి పన్ను వ్యవస్థను పునర్నిర్మించి రైతుల సంక్షేమాన్ని మెరుగు పరిచారు. వాణిజ్యానికి పునాది వేసి, విదేశీ దేశాలతో వాణిజ్య సంబంధాలను బలపరిచారు. టిప్పు సుల్తాన్ రాకెట్ టెక్నాలజీ అభివృద్ధికి కీలకమైన నాయకుడిగా నిలిచారు. “మైసూర్ రాకెట్లు” అనేవి ప్రపంచం లోనే మొదటి క్షిపణి మార్గదర్శకంగా గుర్తించ బడుతున్నాయి. ఈ రాకెట్లు బ్రిటిష్ దళాల మీద ప్రభావవంతంగా ఉపయోగించ బడ్డాయి. సైన్యాన్ని ఆధునీకరించి, ఆయుధ తయారీ కేంద్రాలను నిర్మించారు. ఫ్రెంచ్ సైన్యంతో కుదుర్చుకున్న స్నేహ సంబంధాలు ఆయన సైనిక శక్తిని మరింత బలపరిచాయి. టిప్పు సుల్తాన్ పాలనా కాలం ప్రధానంగా బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీతో జరిగిన యుద్ధాల చరిత్రగా గుర్తించబడింది. మైసూరు యుద్ధాలు నాలుగు ప్రధాన దశల్లో సాగాయి. మొదటి మైసూరు యుద్ధం (1767–1769): హైదరాలి నాయకత్వంలో ప్రారంభమైంది. రెండవ మైసూరు యుద్ధం (1780–1784): టిప్పు, తన తండ్రితో కలిసి బ్రిటిష్ బలగాలను ఎదుర్కొన్నారు. మూడవ మైసూరు యుద్ధం (1790–1792): ఈ యుద్ధంలో టిప్పు పరాజయం చెందారు, అయినప్పటికీ ఆయన ధైర్యం ప్రపంచం మొత్తానికి నిలువెత్తు ఉదాహరణగా నిలిచింది. నాలుగవ మైసూరు యుద్ధం (1799): చివరి యుద్ధం, మైసూరుకు తీవ్ర ప్రమాదం తెచ్చింది. సీరంగపట్నం నగరంలో టిప్పు తన జీవితాన్ని త్యాగం చేయడం దేశభక్తి చిహ్నంగా నిలిచింది. శ్రీ రంగపట్నం యుద్ధం 1799లో శ్రీరంగపట్నంలో జరిగిన యుద్ధం టిప్పు సుల్తాన్ జీవితానికి ముగింపు చిహ్నమైంది. బ్రిటిష్, నిజాం, మరాఠా సంయుక్త బలగాలకు వ్యతిరేకంగా చివరి వరకు పోరాడి, దేశానికి త్యాగం చేశారు. ఆయన మృతితో మైసూరు స్వాతంత్ర్య పోరాటం ముగిసింది. టిప్పు సుల్తాన్ భారతదేశ చరిత్రలో అన్ని మతాలను సమానంగా గౌరవించిన పాలకుడు. మైసూరును ఒక ఆధునిక సాంకేతిక కేంద్రంగా అభివృద్ధి చేశారు. వాణిజ్యానికి ప్రాధాన్యత ఇచ్చి, సామ్రాజ్య ఆర్థిక స్థిరత్వానికి పునాదులు వేశారు. టిప్పు సుల్తాన్ ధైర్యం, దేశభక్తి, ప్రజాసేవ భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో నిలకడైన స్థానాన్ని సంపాదించాయి. ఆయన తన జీవితాన్ని త్యాగం చేసి స్వాతంత్ర్య స్ఫూర్తికి చిరస్మరణీయంగా నిలిచారు. భారతదేశ చరిత్రలో ఒక శాశ్వత స్ఫూర్తిగా టిప్పు సుల్తాన్ పేరు సుస్థిరంగా ఉంటుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల... సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్ 9440595494**

# తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి చిహ్నం ఆంధ్రా బ్యాంక్ - నవంబర్ 20...ఆంధ్రా బ్యాంక్ స్థాపన దినం

ఆంధ్రా బ్యాంక్, భారతదేశం లోని ప్రసిద్ధ బ్యాంకులలో ఒకటిగా పేరొందింది. దశాబ్దాల పాటు ఆర్థిక రంగంలో అపారమైన కృషి చేసి, ప్రజల జీవితాలలో కీలకమైన మార్పులు తీసుకు వచ్చింది. 1923లో ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం ప్రాంతంలో భోగరాజు పట్టాభి సీతారామయ్య నేతృత్వంలో ఈ బ్యాంకు స్థాపించ బడింది. భారత స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో, ప్రజల ఆర్థిక అవసరాలను తీర్చేందుకు, స్వదేశీ ఆర్థిక సంస్థగా ఆంధ్రా బ్యాంక్ తన ప్రయాణాన్ని ఆరంభించింది.

**స్థాపన మరియు ప్రారంభ దశ...** భోగరాజు పట్టాభి సీతారామయ్య ఆర్థిక అవగాహన కలిగి, సామాజిక అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని ఆంధ్రా బ్యాంక్‌ను స్థాపించారు. ఈ బ్యాంక్‌ను ప్రారంభించడంలో ప్రధాన లక్ష్యాలు: భారతీయులు స్వయం సమృద్ధిని పొందడం, గ్రామీణ ప్రజలకు ఆర్థిక సదుపాయాలను అందించడం, చిన్న వ్యాపారాలు, వ్యవసాయ రంగానికి రుణ సహాయాన్ని అందించడం. 1923, నవంబర్ 20న ప్రారంభమైన ఆంధ్రా బ్యాంక్, తొలి సంవత్సరంలోనే విశ్వసనీయతను అందుకుంటూ మచిలీపట్నం ప్రాంతాన్ని అధిగమించి, ఇతర ప్రాంతాలకు విస్తరించింది.

**పెరుగుదల మరియు విస్తరణ...** ఆంధ్రా బ్యాంక్ ప్రారంభ దశలోనే ప్రజల అవసరాలను గుర్తించి, అనేక వినూత్న ఆర్థిక సేవలను అందించడం ప్రారంభించింది. 1980లో జాతీయీకరణకు ముందే, ఈ బ్యాంక్ చిన్న వ్యాపారాలను ప్రోత్సహిస్తూ ముఖ్యమైన పాత్ర పోషించింది. 1981లో క్రెడిట్ కార్డులను పరిచయం చేయడం ద్వారా భారతీయ బ్యాంకింగ్ రంగంలో నూతన ఒరవడిని సృష్టించింది. 2003 నాటికి పూర్తి స్థాయిలో కంప్యూటరీకరణను సాధించి, భారతదేశం లోని ఆధునిక బ్యాంకులలో ఒకటిగా నిలిచింది. 2007లో బయోమెట్రిక్ ఏటీఎంలను ప్రారంభించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతికత ఆధారిత బ్యాంకింగ్ సేవలను అందించింది.

**సేవలు, విశిష్టతలు...** ఆంధ్రా బ్యాంక్ అనేక విభాగాలలో తన సేవలను అందించింది. వ్యక్తిగత బ్యాంకింగ్ ద్వారా సేవింగ్స్ అకౌంట్లు, ఫిక్స్ డిపాజిట్లు, మరియు వ్యక్తిగత రుణాల సౌకర్యాలు, వ్యాపార బ్యాంకింగ్ ద్వారా చిన్న, మధ్య తరగతి వ్యాపారాల కోసం ప్రత్యేక రుణ పథకాల వర్తింపు, గ్రామీణ అభివృద్ధి ద్వారా వ్యవసాయ రుణాలు, స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక సహాయం, చిన్న రైతులకు మద్దతు. డిజిటల్ బ్యాంకింగ్ ద్వారా ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, మరియు నూతన సాంకేతిక సేవలు అందించారు.


**విలీన ప్రక్రియ...** 2019లో, ఆర్థిక వ్యవస్థలో సంస్కరణల భాగంగా, ఆంధ్రా బ్యాంక్‌ను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో విలీనం చేయాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది.

2020, ఏప్రిల్ 1న ఈ విలీనం అమలులోకి వచ్చింది. ఈ విలీనం ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థ మరింత బలపడగా, ఆంధ్రా బ్యాంక్ పేరు కనుమరుగయ్యింది.

**ఆంధ్రా బ్యాంక్ ముఖ్యమైన కృషి...** గ్రామీణ అభివృద్ధి: ఆంధ్రా బ్యాంక్ ప్రత్యేకంగా గ్రామీణ ప్రజలకు అనుకూలంగా అనేక కార్యక్రమాలు చేపట్టింది. చిన్న రైతులకు తక్కువ వడ్డీ రేటుతో రుణాలు అందించడం, స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక మద్దతు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసింది... వినూత్న సాంకేతికత: దేశంలోనే తొలిసారిగా బయోమెట్రిక్ ఏటీఎంలను ప్రవేశ పెట్టిన ఆంధ్రా బ్యాంక్, గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతికతను అందుబాటు లోకి తీసుకు రావడంలో ముందంజలో ఉంది... సామాజిక బాధ్యత: విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాలలో అనేక సామాజిక కార్యక్రమాలను నిర్వహించి, సమాజానికి తనవంతు సేవలను అందించింది.

**విలీనం అనంతర ప్రభావం...** ఆంధ్రా బ్యాంక్ యూనియన్ బ్యాంక్‌లో విలీనమైనప్పటికీ, అది అందించిన సేవలు, విశ్వసనీయత, ప్రజలపై దాని ప్రభావం మరచి పోలేనివి. ఈ విలీనం ద్వారా పెద్ద బ్యాంకింగ్ సంస్థల పోటీకి తోడ్పాటుగా నిలిచింది. ఆంధ్రా బ్యాంక్ కేవలం ఒక ఆర్థిక సంస్థ మాత్రమే కాకుండా, తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ఒక చిహ్నం. దాని స్థాపన నుండి సేవల వరకు, గ్రామీణ అభివృద్ధి నుండి ఆర్థిక రంగం సమర్థవంతత వరకు, ఆంధ్రా బ్యాంక్ ఒక చారిత్రక మైలురాయి. ఇది ప్రస్తుతం యూనియన్ బ్యాంక్‌లో విలీనమయినా, ఆంధ్రా బ్యాంక్ తన కృషి, సేవలు మరియు సాంకేతికత ప్రాతిపదికగా భారత బ్యాంకింగ్ రంగంలో చిరస్మరణీయంగా నిలిచి పోతుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల... సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్ 9440595494**

# దాన ధర్మాలకు ఉద్దిష్టమైనది కార్తీక అమావాస్య



కార్తీక మాసం అమావాస్యను అఘన అమావాస్య, భౌమవతి అమావాస్య అంటారు. హిందూ పంచాంగం ప్రకారం కార్తీక బహుళ అమావాస్యతో కార్తీక మాసం పూర్తవుతుంది. హిందూ సంప్రదాయంలో ఇది అత్యంత పవిత్రమైనదిగా భావించ బడుతుంది. ఈ రోజు పూర్వీకులను స్మరించు కోవడం, దేవతలకు పూజలు చేయడం ముఖ్యమైన ఆచారం. కార్తీక అమావాస్య విశ్వాసాల ప్రకారం, ఈ రోజు నిర్వహించే పూజలు, దానధర్మాలు భక్తులకు ఆధ్యాత్మిక శ్రేయస్సును అందిస్తాయి. ఈ రోజున పితృదేవతలకు తర్పణం చేయడం అత్యంత ముఖ్యమైన పూజగా భావిస్తారు. పూర్వీకులకు తర్పణం అందించడం ద్వారా వారి ఆశీర్వాదం లభిస్తుందని నమ్మకం. ఈ పూజ ద్వారా పితృ ఋణం నుంచి విముక్తి పొందవచ్చని శాస్త్రాలు పేర్కొంటాయి. కార్తీక అమావాస్య రోజున శివుడు, విష్ణువు, లక్ష్మీదేవి వంటి దేవతలను పూజించడం ప్రత్యేకమైనదిగా భావిస్తారు. శివలింగానికి కార్తీక దీపం వెలిగించడం, విష్ణుమూర్తిని పూజించడం ద్వారా ఆధ్యాత్మిక క్షేమం లభిస్తుందని విశ్వాసం. ఈ రోజున పేదలకు ఆహారం, బట్టలు, ఇతర వస్తువులు దానం చేయడం పుణ్య కార్యంగా భావించ బడుతుంది. దానం వల్ల కర్మ ఫలితాలు మంచిగా ఉంటాయని హిందూ ధర్మంలో పేర్కొన్నారు. కొంతమంది భక్తులు ఉపవాసం ఉండి, ఆధ్యాత్మిక శ్రద్ధతో పూజలు నిర్వహిస్తారు. ఉపవాసం ద్వారా శరీర శుద్ధి, మనస్సు ప్రశాంతత లభిస్తాయని విశ్వాసం. భక్తులు కార్తీక అమావాస్య ఉదయం లేవగానే గంగ, గోదావరి, కృష్ణ వంటి పవిత్ర నదుల్లో స్నానం చేయడం మంచి ఫలితాలను అందిస్తుందని నమ్ముతారు. పవిత్ర స్నానం వల్ల శారీరక, ఆధ్యాత్మిక శుద్ధి కలుగుతుందని విశ్వాసం. భక్తులు ఇంట్లోనే లేదా దేవాలయాలకు వెళ్లి శివుడు, విష్ణువు, లక్ష్మీదేవి వంటి దేవతలను పూజిస్తారు. పూజలో దీపారాధన, నైవేద్యం సమర్పించడం విశేష ఫలితాలను అందిస్తుందని నమ్మకం. పితృదేవతలకు తర్పణం చేయడం ద్వారా వారి ఆశీర్వాదం పొందవచ్చని భావించబడుతుంది. ఈ తర్పణం నదీ తీరాల వద్ద లేదా ఇంట్లోనే చేయవచ్చు. భక్తులు పేదలకు అన్నదానం, వస్త్రదానం చేయడం ద్వారా పుణ్యం సంపాదిస్తారు. దీనివల్ల కర్మఫలాలు శ్రేయస్సు కదిలిస్తాయని నమ్మకం. సాయంత్రం సమయంలో ఇంటి వద్ద లేదా దేవాలయాలలో దీపాలు వెలిగించడం ఎంతో విశేషం. దీపాలు వెలిగించడం ద్వారా చీకటి తొలగిపోవడం, ఆధ్యాత్మిక జ్ఞానం ప్రసాదించడం అనగా భావిస్తారు. కార్తీక అమావాస్య రోజున భక్తులు ఉపవాసం ఉంటారు. ఉపవాసంతో పాటు సాంప్రదాయ పూజలు చేస్తారు. శివుని పూజలో బిల్వ దళాలు సమర్పించడం, దీపం వెలిగించడం ముఖ్యమైన ఆచారం. ఉపవాసం శారీరక ఆరోగ్యానికి మేలు చేయడమే కాకుండా, మానసిక ప్రశాంతతను కలిగిస్తుందని నమ్మకం. పురాణాల ప్రకారం, కార్తీక మాసం శివుడికి అత్యంత ప్రీతికరమైనది. కార్తీక అమావాస్య రోజున శివుడు భక్తులకు అనుగ్రహం చేస్తాడని విశ్వాసం. అంతేగాక, కార్తీక మాసంలో దీపాలు వెలిగించడం వల్ల బ్రహ్మాండ శక్తుల అనుగ్రహం లభిస్తుందని చెబుతారు. కార్తీక అమావాస్య రోజున పూజలు, తర్పణం, దానాలు చేయడం వల్ల పాప విముక్తి లభిస్తుందని, పితృదేవతల కృపతో కుటుంబానికి శ్రేయస్సు కలుగుతుందని నమ్మకం. దీపారాధన ద్వారా ఆధ్యాత్మిక శక్తి పెరిగి, జ్ఞానం వెలుగుతుంది. ఆధ్యాత్మికమైన దీపారాధన, పితృ తర్పణం ద్వారా జీవితంలో సకల శుభాలు కలుగుతాయని విశ్వాసం. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## ఊతం కాదని.. పాశుపతం

ఖమ్మం : కూసుమంచి మండలానికి చెందిన వృద్ధ దంపతులకు ఏకైక సంతానం. 20 కుంటల భూమిని సాగుచేస్తూ.. కూలికి వెళ్లి కష్టపడి కుమారుడిని చదివించారు. ప్రభుత్వ ఉపాధ్యాయ కొలువు సాధించిన కొడుకు వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల పోషణను విస్మరించారు. వారు ఖమ్మం ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. మొదటి విచారణకు రాని ఉపాధ్యాయునికి అరెస్టుకు వారెంటు జారీ చేయటంతో దిగివచ్చాడు. తల్లిదండ్రులకు నెలకు రూ.5 వేల భరణం ఇవ్వాలని తీర్పు చెప్పారు. ముదిగొండ మండల మాజీ ప్రజాప్రతినిధికి నలుగురు కుమారులు. భార్య మరణించగా.. ఆమె పేరిట కూసుమంచిలో ఉన్న ఎకరం భూమిని తన పేరు మీదకు మార్చుకోవడానికి ముగ్గురిలో ఒకరు సంతకం చేయలేదు. విచారించిన ఆర్డీవో నలుగురు పిల్లలు ప్రతినెలా రూ.2500 చొప్పున నెలకు రూ.పదివేలు ఇవ్వాలని తీర్పుచెప్పారు. భూమిని తండ్రి పేరిటకు మార్చాలని ఆదేశించారు. రక్తమాంసాలు పంచి జన్మనిచ్చి, విద్యాబుద్ధులు చెప్పించి.. ప్రయోజకుల్ని చేశాక చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లల ఆదరణకు



నోచుకోవటం లేదు. ఆస్తులు పంచిన తర్వాత అవసాన దశలో వారిని కాదు పొమ్మంటున్నారు.. ఆదరించాల్సిన సంతానం కనికరం చూపకుండా దౌర్జన్యాలకు పాల్పడుతున్న ఉదంతాలు కోకొల్లలు. ముదిమి దశలో కుమారులు, కోడళ్లు, కూతుళ్ల ఈసడింపులతో పెద్దలు కన్నీళు పెట్టుకుంటున్నారు. జిల్లాలో ఈ తరహా బాధితులు పెరుగుతున్నారని గణాంకాలే చెబుతున్నాయి.

దారి తప్పిన పిల్లలను గాడినపెట్టేందుకు 'తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం' వార్ధక్యంలో ఉన్న తల్లిదండ్రుల చేతిలో పాశుపతంగా మారింది.

**తెల్లకాగితం చాలు..**

తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం ప్రకారం తల్లిదండ్రులు సంతానం నుంచి భరణం కోరవచ్చు. చేయాల్సిందల్లా ఆర్డీవో ట్రైబ్యునల్‌లో ఫిర్యాదు చేయడమే. ఆన్‌లైన్ లేదా తెల్లకాగితంపై ఫిర్యాదు చేసినా.. ఆర్డీవో ట్రైబ్యునల్ విచారిస్తుంది. ఫిర్యాదు ఆధారంగా పిల్లలకు నోటీసులు అందజేసి ఇయరింగ్‌కు పిలుస్తారు. వాదనలు విని, సమస్యలు తెలుకొని.. సంతానం ఆర్థిక పరిస్థితులను అంచనా వేసి తీర్పు చెబుతారు. తన స్థాయిలో గరిష్ఠంగా రూ.10వేల భరణం ఇచ్చే తీర్పు ఇస్తారు. దీనిపై అప్పీలుకు, ఆస్తుల పంపకాల విషయమై అప్పిలేట్ ట్రైబ్యునల్(కలెక్టర్)ను ఆశ్రయించాల్సి ఉంటుంది. జిల్లాలో 2024–25లో 145 ఫిర్యాదులు ఆర్డీవో ట్రైబ్యునల్‌కు చేరగా.. 73 పరిష్కరించారు. గతేడాది 53 ఫిర్యాదులు కలెక్టర్ వరకు చేరగా.. అన్నింటినీ పరిష్కరించడం విశేషం.

## కలలు కనండి.. ఎల్లలు దాటి చదవండి..!

నిజామాబాద్ : విస్తృత అవకాశాల నేపథ్యంలో చాలామంది విద్యార్థులు విదేశాల్లో, తమకు నచ్చిన సబ్జెక్టులో ఉన్నత విద్యను అభ్యసించాలని లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. వీరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలు, కార్యక్రమాల కింద చేయూత ఇస్తున్నాయి. ఫలితంగా ప్రతిభావంతులైన పేద విద్యార్థులు అవరోధాలను అధిగమించి అంతర్జాతీయ స్థాయిలో విద్యా నైపుణ్యాలు అలవర్చుకోవడం విశేషం. ఈ క్రమంలో పలువురు ఎంచుకుంటున్న మార్గాలు, అవకాశాలపై నేడు 'అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవ' ప్రత్యేక కథనం.

**ప్రభుత్వాల చేయూత ఇలా..**

డా.అంబేడ్కర్ సెంట్రల్ సెక్టార్ స్కీం: ఈ పథకానికి ఎంపికైతే ఓబీసీ, ఈబీసీ విద్యార్థుల విదేశీ విద్యకు కేంద్ర ప్రభుత్వం వడ్డీ రాయితీపై రుణాలను అందిస్తోంది.

సెంట్రల్ సెక్టార్ ఇంటరెస్ట్ సబ్సిడీ (సీఎస్ఐఎస్), నేషనల్ ఓవర్సీస్, 'ఫుల్ బ్రైట్' ఉపకార వేతనాలు, ఆర్థిక సాయాన్ని విద్యార్థులకు మంజూరు చేస్తున్నారు.

తెలంగాణ ప్రభుత్వం విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తోంది. 'అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి' పథకంతో ఎస్సీ, ఎస్టీ ప్రతిభావంతులకు రూ.20 లక్షల వరకు ఉపకార వేతనాలు అందిస్తోంది. 'ఈ–పాస్' వెబ్‌సైట్‌లో ఈ నెల 19లోగా దరఖాస్తు చేసుకోవచ్చని ఎస్సీడీవో రజిత తెలిపారు.




అర్హతలు.. నైపుణ్యాలే కీలకం

55–60 శాతం మార్కులతో పాఠశాల డిప్లొమా/గ్రాడ్యుయేషన్/పోస్టు గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులైన వారు పథకాలు పొందేందుకు, విదేశీ వర్సిటీల్లో ప్రవేశాలకు అర్హులు.

టోఫెల్, ఐఈఎల్‌టీఎస్ వంటి ఆంగ్ల ప్రావీణ్య పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలి. వెళ్లనున్న దేశం భాషపై పట్టుపెంచుకోవాలి. పాస్‌పోర్టు, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్(ఎస్‌వోపీ), లెటర్స్ ఆఫ్ రికమెండేషన్(ఎల్ఓఆర్ఎస్)తో పాటు.. ఫీజులు, ప్రయాణం, వసతి, రోజువారీ ఖర్చులకు సరిపడా నిధులు సిద్ధంగా ఉంచుకోవాలి.

చదివే కోర్సు, ఎంచుకున్న వర్సిటీపైనా పూర్తి అవగాహన అవసరం. అక్కడి వసతులు, సంస్కృతి, సంప్రదాయలను తెలుసుకోవడం అవసరమని సీనియర్లు చెబుతున్నారు.నా పేరు సూరజ్‌రెడ్డి, మాది నిజామాబాద్. ప్రస్తుతం యూఎస్ఏలోని క్యాలిఫోర్నియా వర్సిటీలో ఎం.ఎస్. చేస్తున్నా. మద్రాస్ ఐఐటీలో పీజీ చదివే రోజుల్లో గ్రీన్ ఎనర్జీపై రీసెర్చ్ చేయడం నా జీవితాన్నే మలుపు తిప్పింది. ఈ సబ్జెక్టు అంటే చిన్నప్పటి నుంచే ఆసక్తి. ఒక్కోరోజు ఒక అంశంపై లోతుగా చదివేవాణ్ని. ఎంతో పట్టు రావడం, విద్యా రుణం మంజూరు కావడంతో ఎంఎస్ సులభంగా చదువుతున్నా.సూరజ్‌రెడ్డి

# పల్లె తల్లి వన్నెలద్దుకుంటోంది!



మేడిపల్లి : చిత్రంలో కనిపిస్తున్న ఇల్లు జగిత్యాల మండలం మోరపల్లిలోనిది. పునుగోటి పవన్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ సంస్థ ఏర్పాటు చేశారు. దేశ విదేశాల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్నా పల్లె జ్ఞాపకాలనూ, అనుబంధాలనూ మరచిపోలేదు. గ్రామంలోనే అందమైన భవంతి నిర్మించుకొన్నారు. ఆ ఇంటిని చూసేందుకు పలువురు ప్రముఖులు వస్తుంటారు.

గుడిసె, పూరిల్లు, మట్టి ఇల్లు, పెంకుటిల్లు, కొట్టం, మిద్దె వంటి పదాలు పల్లె నుంచి దూరమవుతున్నాయి. పెరుగుతున్న ఆదాయ వనరులు, మారుతున్న జీవన విధానాలతో గ్రామాలు ఆధునికీకరణ బాట పడుతున్నాయి. సాంకేతికత ఆలంబనగా పట్టణాలతో పోటీ పడుతున్నాయి. పల్లెల్లో డూప్లెక్స్ భవనాలు సాధారణమయ్యాయి. ఇళ్ల నిర్మాణానికి రూ.లక్షల నుంచి రూ.కోట్లు వెచ్చించడానికి కూడా వెనుకాడటం లేదు. భూగర్భ జలాల మాదిరిగానే సాగు భూముల ధరలు పైపైకి ఎదుగుతున్నాయి.

**మారుతున్న జీవన శైలి**

జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల నుంచి ఎక్కువగా గల్ఫ్ దేశాలకు వెళ్తుంటారు. సుమారు 3 లక్షల మంది వివిధ దేశాల నుంచి డబ్బులు పంపుతుంటారు.

గడిచిన పదేళ్లలో విదేశీ మారకద్రవ్యం రెట్టింపు కాగా ఉమ్మడి జిల్లాకు నెలకు రూ.200 కోట్ల మేర వస్తోంది. వీరిలో 90 శాతం గ్రామీణ ప్రాంత వాసులే కావడంతో ఇళ్ల నిర్మాణాలు, వ్యవసాయ భూముల ధరలు, ఇతర వ్యాపారాలు పెరుగుతున్నాయి.

2014 నుంచి వ్యవసాయ భూముల విలువ పెరుగుతూ వస్తోంది. 2020 నుంచి ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువ 3 సార్లు పెరిగింది. గతంలో ఎకరానికి రూ.1.50 లక్షలుండగా ప్రస్తుతం రూ.4.50 లక్షల–రూ.20 లక్షలకు చేరింది. బహిరంగ విలువ ఇంతకు రెండు, మూడింతలు. గ్రామాల్లోనూ ఇళ్ల స్థలాల విలువ రూ.లక్షల్లో ఉంటోంది.

20 ఏళ్ల కిందట పల్లెల్లో ఎకరం ధర రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు ఉండగా ప్రస్తుతం రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షలకు చేరింది. దీంతో జీవనశైలిలోనూ మార్పు కనిపిస్తోంది.

తెలంగాణ తలసరి ఆదాయం రూ.3.56 లక్షలకు పెరగడానికి పల్లెల జీవన విధానం, పెరుగుతున్న ఆదాయం, వ్యవసాయ ఉత్పత్తుల ధరలు కూడా కారణమని నిపుణులు చెబుతున్నారు.

గంగాధర మండలం మల్లాపూర్‌కు చెందిన వ్యక్తి హైదరాబాద్‌లో హోటల్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. గ్రామంలోని పాత బంగ్లా శిథిలావస్థకు చేరుకోకుండా ఆధునికీకరించారు. కుటుంబ సభ్యులంతా హైదరాబాద్ నుంచి వచ్చినపుడు గడిపేలా అందమైన పొదరిల్లులా మార్చుకున్నారు.

**సాంకేతికత తోడుగా..**

ఒకప్పుడు టెలిఫోన్ ఎలా ఉంటుందో తెలియని గ్రామాలు వందల్లో ఉంటే నేడు నెట్‌వర్క్ లేని పల్లె లేదు. ఆధునిక సాంకేతికత వినియోగంతో గ్రామీణ ప్రజలు కూడా సామాజికంగా ఎదుగుతున్నారు. వ్యవసాయం, ఇంటి నిర్మాణం, సామగ్రి కొనుగోలు, సమాచారం, ఇతర అంశాల్లో నైపుణ్యాన్ని సాధిస్తున్నారు. సామాజిక మాధ్యమాల ప్రభావంతో మంచీ చెడూ పెరుగుతుండగా.. మహిళలు, యువకులు అందివచ్చిన అవకాశాలతో ఎదుగుతున్నారు. ఈ క్రమంలో పల్లెల్లో కూరగాయల సాగు, పశు సంపద పెరగాలని, రైతులు రసాయన పురుగు మందుల వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయం చేయాలన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

# సోయా.. మద్దతు లే'దయ'!



ఇబ్రహీంపట్నం: సోయా పంట ఉత్పత్తిని జిల్లాలో ప్రభుత్వం కొనుగోలు చేయకపోవటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. తక్కువ విస్తీర్ణంలో సాగు ఉందని సోయా సేకరణకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు పంటను తక్కువ ధరకు దళారులకు అమ్ముకుంటున్నారు. దీంతో మద్దతు ధర పొందక ఆర్థికంగా నష్టపోతున్నారు.

**జిల్లాలో 760 ఎకరాల్లో సాగు**

జిల్లాలో సోయా పంట 760 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. ఎక్కువగా ఇబ్రహీంపట్నం మండలంలో సుమారు 600 ఎకరాల్లో సాగు చేయగా.. మల్లాపూర్, మెట్‌పల్లి మండలాల్లో 160 ఎకరాల్లో పంట వేశారు. గత నెలలోనే పంట రైతుల చేతికి రావడంతో యంత్రాలతో కోతలు చేపట్టారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఎప్పుడు ఏర్పాటు చేస్తుందోనని ఎదురుచూసి.. చివరికి నిరాశతో దళారులకే పంటను విక్రయిస్తున్నారు. సోయా పంటకు ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.5399 కాగా.. దళారులు రూ.4000 నుంచి రూ.4,300 వరకు చెల్లిస్తున్నారు. దీంతో అన్నదాతలు క్వింటాకు సుమారుగా రూ.1000 వరకు నష్టపోతున్నారు. ఎకరం పది క్వింటాళ్ల దిగుబడి రాగా.. ఈ లెక్కన రూ.10వేలు కోల్పోతున్నారు.

**పక్క జిల్లాల్లో ఏర్పాటు**

సోయా కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో ప్రభుత్వం జిల్లాకో విధంగా వ్యవహరిస్తోంది. పక్కన నిర్మల్ జిల్లాలో సోయా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి.. అన్నదాతల నుంచి పంట సేకరించారు. కానీ జిల్లాలో మాత్రం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. దీంతో కర్షకులు ఆర్థికంగా నష్ట పోక తప్పటం లేదు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ప్రభుత్వం సేకరించక పోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్క జిల్లాలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లే.. జగిత్యాల జిల్లాలో కూడా సేకరిస్తే బాగుంటుందని రైతులు కోరుతున్నారు.

**రూ.34 వేల నష్టం**

2.5 ఎకరాల్లో సోయా పంటను సాగు చేశాను. ఎకరానికి 10 క్వింటాళ్ల చొప్పున మొత్తం సుమారు 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. క్వింటాకు ప్రభుత్వ మద్దతు ధర రూ.5,399 ఉండగా.. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో దళారులకు రూ.4,000 చొప్పున విక్రయించాను. దీంతో రూ.1,399 చొప్పున మొత్తం రూ.34 వేల వరకు నష్ట పోయాను. శ్రీనివాస్‌రెడ్డి, రైతు, ఇబ్రహీంపట్నం

# దారిపొడవునా ప్రమాదాలే



గోదావరిఖని: రాజీవ్ రహదారి ప్రమాదాలకు కేంద్రంగా మారుతోంది. ఎక్కువ శాతం రామగుండం ప్రాంతంలో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారు. రామగుండం నగర ప్రాంతంలో 15 కి.మీలు విస్తరించి ఉన్న రాజీవ్ రహదారిపై వాహనదారుల అతివేగం.. భారీ వాహనాల రద్దీ.. నిబంధనలు పాటించకపోవడం ప్రమాదాలకు కారణంగా మారుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 15 మంది ప్రాణాలు కోల్పోయారు. 32 మంది గాయపడ్డారు.

1. కుందనపల్లి ఇంధన నిల్వ కేంద్రం ట్యాంకర్లతో రద్దీగా ఉంటుంది. ప్రధాన రహదారి కావడంతో వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. ఇక్కడే పెట్రోలు బంకులు ఉండటంతో ఇంధనం కోసం వాహనాలు వెళ్లే సమయంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కుందనపల్లి వద్ద రాజీవ్ రహదారిపై ఇప్పటి వరకు జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందగా చాలా మంది క్షతగాత్రులయ్యారు.

2. రామగుండం బి–పవర్‌హౌస్ మలుపు వద్ద ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు ఇద్దరు మృతి చెందారు. వాహనాలు ఢీకొని పలువురు గాయపడ్డారు. ఇక్కడ కరీంనగర్, రామగుండం పట్టణంలోకి వెళ్లేందుకు దారి ఉంటుంది. ఇరువైపుల నుంచి వచ్చే వాహనాలతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

3. ఎన్టీపీసీ మేడిపల్లి చౌరస్తా ప్రమాదాలకు కేంద్రంగా మారింది. ఈ ప్రాంతంలో జరిగిన ప్రమాదాల్లో ఒకరు మృతిచెందగా 12 మంది క్షతగాత్రులయ్యారు.

4. ఎన్టీపీసీ బి–టైపు గేటుతోపాటు రామగుండం కమిషనరేట్ ప్రాంతంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వాహనాలతో డివైడర్లను ఢీకొని ప్రాణాలు కోల్పోయారు. అతి వేగంతో అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. ఇటీవల ఓ కారు డివైడర్‌ను ఢీకొని అగ్నికి ఆహుతైంది.

5. గోదావరిఖనిలోని సింగరేణి బి–గెస్టుహౌస్ మూలమలుపు ప్రమాదకరంగా మారింది. ఇటీవల ఓ ద్విచక్ర వాహనదారుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందారు. ఇక్కడ భారీ వాహనాలు ప్రమాదానికి గురికాగా చాలా మంది క్షతగాత్రులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ రహదారి విస్తరణ పనులు చేపట్టారు.

6. గోదావరిఖని గంగానగర్ పై వంతెన సమీపంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ ఆటో ఢీకొని ఇద్దరు, ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. వాహనదారులు అదుపు తప్పి కింద పడి క్షతగాత్రులుగా మారారు.

## పొదుపు బాట.. ఆర్థిక సాధికారత

పెద్దపల్లి : స్వయం సహాయక సంఘాల మహిళలకు స్త్రీనిధి రుణాల పంపిణీలో జిల్లా అగ్రపథంలో దూసుకెళ్లింది. కలెక్టర్ శ్రీహర్ష పర్యవేక్షణలో అధికారులు క్రమం తప్పకుండా సమీక్షించడం, ఆపదలో రుణాలు అందించడంతో ఈ ఘనత సాధ్యమైంది. ఈ వార్షిక ఏడాదికి సంబంధించి రాష్ట్రంలో జిల్లా ముందు వరసలో నిలిచింది. రుణాలు కోరిన 48 గంటల్లోపు పంపిణీ చేయడంలో లక్ష్యాలకు చేరుతోంది.

**రూ.5 లక్షలలోపు..**

2011లో స్త్రీనిధి రుణాల పథకానికి శ్రీకారం చుట్టగా స్వశక్తి సంఘాల్లోని మహిళలకు సువిధ, ప్రగతి, అక్షయ, సౌభాగ్య, ఐశ్వర్య పేరిట రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు పంపిణీ చేస్తున్నారు. చిన్నతరహా, కుటీర పరిశ్రమలు, వ్యవసాయం, కిరాణ, వస్త్ర వ్యాపారం చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రోత్సహిస్తున్నారు. పావలా వడ్డీ వెసులుబాటు కల్పించడంతో క్రమం తప్పకుండా రుణ కిస్తీలు చెల్లించడంతో ముందుంటున్నారు.

**ఫలించిన సమష్టి శ్రమ**

ఈ ఏడాది స్త్రీనిధిలో రూ.51.56 కోట్ల రుణ లక్ష్యం విధించగా ఇప్పటి



వరకు రూ.37.24 కోట్లు పంపిణీ చేశారు. 72.23 శాతం నమోదైంది.

జిల్లా వివరాలు

రుణ లక్ష్యం : 51.56 కోట్లు

పంపిణీ : రూ.37.24 "

స్వశక్తి సంఘాలు : 1,229

సభ్యులు : 3,896

అందరి సహకారంతో..

జిల్లాలో రుణ లక్ష్యాలపై మొదటి నుంచి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. మండలాల్లో గ్రామైఖ్య సంఘాల పరిధిలోని మహిళల అవసరాలకు తీర్చేందుకు సకాలంలో రుణాలు పంపిణీ చేస్తున్నారు. అందరి సహకారంతో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఇదే స్ఫూర్తితో గడువులోపు లక్ష్యాలు చేరుకునేందుకు శ్రమిస్తాం.


దుర్గాప్రసాద్, స్త్రీనిధి రీజినల్ సమన్వయకర్త

## దేవాదాయ భూమి.. పట్టించుకోరేమి?

కామారెడ్డి : నాగిరెడ్డిపేట మండలం తాండూరులోని పురాతన త్రిలింగేశ్వర, దాని పక్కనే ఉన్న గోపాలస్వామి, అక్కంపల్లి గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ భూములు అన్యాక్రాంతమయ్యాయి. దేవాలయాలకు ఏళ్ల క్రితం పలువురు భక్తులు వివిధ సర్వే నంబర్లలో 10 ఎకరాల భూమిని విరాళంగా ఇచ్చారు. అనంతరం కొందరు ఆక్రమణదారులు వాటిని కబ్జా చేసి అందులో సాగు చేస్తున్నారు. కౌలు చెల్లించకపోగా.. కనీసం తామే సాగు చేస్తున్నామనే విషయాన్ని కూడా ఎవరూ చెప్పడం లేదు. ఏళ్లు గడుస్తున్నా ఆ భూములు ఎక్కడ, ఎవరి అధీనంలో ఉన్నాయి. ఎవరు సాగు చేసుకుంటున్నారో దేవాదాయ, రెవెన్యూ అధికారులకు సమాచారమే లేదు.

అక్రమంగా పట్టా చేసుకునే ప్రయత్నం

మండలంలోని తాండూరు, వెంకంపల్లి, ధర్మారెడ్డి, అక్కంపల్లి గ్రామాల



పరిధిలో 14 సర్వే నంబర్లలో ఈ దేవాలయాల భూమి ఉంది. ఆయా శాఖల నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకున్న పలువురు భూముల్లో వాలిపోయారు. ఆ దేవాలయంలో గతంలో పనిచేసిన ఓ ఉద్యోగి, ఆయన కుటుంబసభ్యులు వారి పేరు మీద పట్టా చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఆ గ్రామాల్లో ఎకరా రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ధర పలుకుతోంది. మిగతా భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.

**అధికారులు ఏమన్నారంటే..**

'ఆ భూముల్ని నిషేధిత జాబితాలో పెట్టాం. అవి దేవాదాయశాఖ పరిధిలో లేవు. గ్రామస్థులు లేఖ రాస్తే మేం చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉండేది' అని తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు.

'దేవాలయ భూములు నిషేధిత జాబితాలోనే ఉన్నాయి. ఇతరుల ఆధీనంలో ఉన్నాయని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లాం. వాటిని స్వాధీనం చేసుకోవాలని లేఖ రాశాం' అని దేవాదాయశాఖ కార్యనిర్వహణ

## మద్యం దాహం.. కుటుంబాలు ఆగం

మద్యం తాగితే మనిషి విచక్షణ కోల్పోతాడు. కానీ జిల్లాలో ఏకంగా ప్రాణాలనే కోల్పోతున్నారు. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వడం లేదని, దొరకడం లేదని యువత అప్పులు చేస్తున్నారు. వీటిని తీర్చలేక ప్రాణాలు విడుస్తూ వారినే నమ్ముకున్న కుటుంబాలను కష్టాల సుడిగుండంలోకి నెట్టేస్తున్నారు.

డీ అడిక్షన్ కేంద్రాలేవి? మద్యానికి బానిసైన వారిలో మార్పు తేవాలంటే డీ అడిక్షన్ కేంద్రాలతోనే సాధ్యం. వీటిని ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించి ఆరునెలలు దాటుతున్నా అమలుకు నోచుకోలేదు. పోలీసులు–ఆబ్కారీ శాఖ అధికారులు కౌన్సెలింగ్‌లు నిర్వహిస్తున్నా అనుకున్న రీతిలో ఫలితాలు రాబట్టలేకపోతున్నారు. 'మద్యం మూలాలను అరికట్టేందుకు నిరంతర నిఘా కొనసాగిస్తున్నాం. జూదం, గంజాయి, అల్ప్రాజోలం వంటి మత్తు పదార్థాల కట్టడికి వ్యవస్థను రూపొందించాం. మత్తు పదార్థాలు, మద్యం, కల్తీ కల్లుకు బానిస కాకుండా ప్రజల్లో చైతన్యం తెస్తున్నాం.' అని జిల్లా ఎస్పీ రాజేష్‌చంద్ర అన్నారు.భార్య, పిల్లలకు బతుకు భారం: 'గాంధారికి చెందిన యువకుడు ఓడుసుల చిరంజీవి (30) వ్యవసాయంతోనే కుటుంబ పోషణ చేస్తుండేవాడు. మద్యానికి బానిసైన అతడు గత నెల 31వ తేదీన పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆయనే ఆధారంగా బతుకుతున్న భార్య, ఇద్దరు పిల్లలకు ఇప్పుడు జీవితం భారమైంది.'ఈ తండ్రికి శోకం: 'నాగిరెడ్డిపేట మండలం తాండూర్‌కు చెందిన కుమార్ (18) తాగుడుకు బానిసై ఇంట్లోవారితో తరచూ గొడవపడేవాడు. మద్యం మత్తులో కన్నతండ్రిని అనరాని మాటలనడంతో చుట్టుపక్కలవారు మందలించారు. మనస్తాపం చెందిన కుమార్ గత నెల 22వ తేదీన ఇంట్లో ఉరేసుకొని చనిపోయాడు. చేతికందిన కొడుకును మద్యం రక్కసి కబలించిన తీరును తలచుకొని తండ్రి సంగయ్య ఇప్పటికీ రోధిస్తున్నారు.'వీరికి దిక్కేది?: శేరిబీబీపేటకు చెందిన బోడ సునీల్ (30) మద్యానికి బానిసై భార్యతో తరచూ గొడవపడేవాడు. ఈ నెల 10న గొడవపడి ఇంటి నుంచి వెళ్లి గడ్డి మందు తాగి చనిపోయాడు. దీంతో అతడి భార్య, కూతురు దిక్కులేని వారయ్యారు.దుష్పరిణామాలు ఇవే.. మత్తులో జూదం ఆడడం, దొంగతనాలు–దోపిడీలు, అసాంఘిక కార్యకలాపాలు, నేరాలకు పాల్పడి కటకటాలపాలవుతున్నారు.

## మత్తు తలకెక్కి.. వేగం రోడ్డెక్కి

హైదరాబాద్ : "ఇంజినీరింగ్ పూర్తయింది.. ఉద్యోగ వేటలో ఉన్నాడు. అమీర్‌పేట్‌లోని ఒక శిక్షణ సంస్థలో ఐటీ కోర్సు చేస్తున్నాడు. వారాంతం దోస్తులతో కలిసి శివారు ఫామ్‌హౌస్‌లో పార్టీ చేసుకున్నాడు. నగరంలోని రూమ్‌కు బైక్‌పై వేగంగా వెళ్తూ ప్రమాదానికి గురయ్యాడు. కొడుకును బతికించుకునేందుకు తల్లిదండ్రులు ఊళ్లోని పొలం అమ్మారు. వారి ఆవేదనను నగర ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ ఇటీవల పంచుకున్నారు. 6 శాతం పెరిగాయి.. నగరంలో ఏటా 3వేల రోడ్డు ప్రమాదాలు నమోదవుతున్నాయి. వాటిలో 300 మంది మృత్యువాత పడుతున్నారు. అధికశాతం ప్రమాదాలకు అతివేగం, మద్యం మత్తులో వాహనం నడపటమే కారణమంటున్నారు పోలీసులు. పోలీసుల తనిఖీలు, చలానాలు, న్యాయస్థానాల శిక్షలు విధిస్తున్నా నిబంధనలు పాటించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. కొందరు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకుంటున్నారు. గతేడాదితో పోల్చితే 10 నెలల వ్యవధిలో 6 శాతం ప్రమాదాలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. దీనికి అడ్డుకట్ట వేయాలని ఉద్దేశంతో సీపీ సజ్జనార్ ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. పగలు,



రాత్రి వేళల్లో డ్రంకెన్‌డ్రైవ్ చేపట్టనున్నారు. కేసు తీవ్రతను బట్టి వాహనాలను సీజ్ చేస్తామని సీపీ స్పష్టంచేశారు.

**మాకేం కాదు.. బండి మస్త్ నడుపుతం**

మద్యం కొద్దిగానే తాగాం.. బండి నడపటంలో ప్రావీణ్యం ఉంది. మేం వెళ్లేదారిలో పోలీసులు తనిఖీలు ఉండవనే ధీమాతో మత్తులో వాహనం నడిపే వారే అధికం. తనిఖీ సమయంలో పోలీసులతో కొందరు మందుబాబులు వాదనకు దిగుతారు. రోజూ 140-150 మంది డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడతారు. వీరిలో 90శాతం మంది ద్విచక్రవాహనదారులే ఉంటున్నారు. జైలు శిక్ష పడ్డ ఉద్యోగులను కొన్ని సంస్థలు తొలగిస్తున్నాయి. ఈ ఏడాది సుమారు 30 మంది కొలువులు కోల్పోయినట్టు పోలీసు అధికారి తెలిపారు. ఈ ఏడాది 10 నెలల వ్యవధిలో 42,628 కేసుల్లో రూ. 8,79,45,100 న్యాయస్థానం జరిమానా విధించింది.

## ఏటీ'ఎస్' అనేదెప్పుడో..?

హైదరాబాద్ : ఆధునిక యుగంలోనూ సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో రవాణాశాఖ నిర్లక్ష్యం చూపుతోంది. వాహన సామర్థ్య ధ్రువీకరణ పరీక్షలు చేయడానికి అనేక రాష్ట్రాల్లో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు (ఏటీఎస్) ఏర్పాటు చేసి మానవ ప్రమేయం లేకుండా చేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 4 స్టేషన్లతో సహా రాష్ట్రవ్యాప్తంగా 37 ఏటీఎస్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినా వాటి అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తోంది. ప్రతిపాదనలు



దాటి వాటి ఏర్పాటు ప్రక్రియ ముందుకు సాగడం లేదు. అత్యాధునిక సాంకేతికత అందుబాటులో ఉన్నా ఇంకా మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ)ల ద్వారానే పరీక్షలు చేస్తున్నారు. మ్యాన్యువల్‌గా చేయడం వల్ల కొందరు అధికారులు అమ్యామ్యాలు పుచ్చుకుని తనిఖీలు సరిగ్గా చేయడం చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా ప్రమాదాలు జరిగి ప్రయాణికులు మరణిస్తున్నారు.

**ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం..**

ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదాల్లో రవాణా శాఖ నిర్లక్ష్యం బయటపడింది. ఏటీఎస్‌ల ద్వారా తనిఖీలు నిర్వహిస్తే ఫిట్‌నెస్ విషయంలో పొరపాట్లకు ఆస్కారం ఉండదు. వాహనంలో చిన్న లోపం ఉన్నా వెంటనే తెలిసిపోతుంది. ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా మొత్తం రూ. 300 కోట్లతో ఏటీఎస్‌ల ఏర్పాటుకు పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. అనుమతులు వచ్చిన వెంటనే మొదటి దశలో 15 కేంద్రాలను ఏర్పాటు చేయడానికి పనులు మొదలుపెట్టినట్లు అధికారులు చెబుతున్నా ఎక్కడా కార్యరూపం దాల్చలేదు. వాటి ఏర్పాటులో అధికార యంత్రాంగం ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చేస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. "ఏటీఎస్‌ల ఏర్పాటుకు ఒక్కో కేంద్రానికి సుమారు ఎకరా స్థలం అవసరం. ప్రస్తుతం భూమి ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. అనువైన స్థలం దొరకగానే పనులు మొదలుపెడతాం" అని ఓ ఆర్టీఏ అధికారి వెల్లడించారు.

## కొండెక్కిన కోడిగుడ్డు!

సూర్యాపేట : కోడి గుడ్డు ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. గత నెలలో రూ. 5 నుంచి రూ. 6 విక్రయించగా.. ప్రస్తుతం రూ. 7 నుంచి రూ. 8 వరకు అమ్ముతున్నారు. వినియోగదారులు కొనేందుకు ఆలోచి స్తున్నారు. ఓ వైపు కూరగాయల ధరలు మండుతుండగా.. ఇప్పుడు కోడిగుడ్డు ధరతో సామాన్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిమాండ్‌కు తగ్గట్టు సరఫరా లేకపోవడమే ధర పెరుగుదలకు కారణ మని వ్యాపారులు చెబుతున్నారు. అదేవిధంగా అక్టోబరులో కిలో చికెన్ రూ. 240 నుంచి రూ. 260 పలకగా, ప్రస్తుతం రూ. 20 నుంచి రూ. 4 వరకు తగ్గింది. మాంసం ధరలు తగ్గినా గుడ్డురేటు పెరగడం గమనార్హం.

## లేనిది ఉన్నట్టు.. అంతస్తుకో రేటు




హైదరాబాద్ : అడిగినంత ఇస్తే.. ఎలాంటి భవనానికైనా ఇంటి నంబర్లు ఇస్తామంటూ పలువురు జీహెచ్ఎంసీ అధికారులు వసూళ్లకు తెగబడుతున్నారు. బహుళ అంతస్తులకైతే.. అంతస్తుకింత చొప్పున వసూళ్లు చేస్తున్నారు. లేని ఇళ్లకు ఇంటి నంబర్లు జారీ చేసిన అల్వాల్ సర్కిల్ అవినీతి బాగోతాన్ని మరవక ముందే.. చందానగర్ సర్కిల్ అధికారుల లీలలు వెలుగులోకి వచ్చాయి. ఖానామెట్, ఇజ్జత్‌నగర్, అయ్యప్పసొసైటీ భూముల్లో కట్టే వివాదాస్పద, అనుమతిలేని భవనాలకు ఇంటి నంబర్లు జారీ చేస్తున్నారు.

**ఇళ్లు లేకున్నా నంబర్లు ఇస్తారు..**

చందానగర్ సర్కిల్ పరిధిలో వివాదాస్పద భూములు వెయ్యి ఎకరాలకుపైగా ఉన్నాయి. వాటిలో ఇళ్ల స్థలాలు కొని, ఇల్లు కట్టుకోలేని స్థితిలో ఉన్న వారిని పలువురు బిల్డర్లు, నేతలు,అధికారులు లక్ష్యంగా చేసుకుంటున్నారు. తక్కువ ధరకు భూములు కొనేసి.. అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. వాటికి ఇంటి నంబర్లు తీసుకోవడం, మరొకరికి రిజిస్ట్రేషన్ చేయడం ఆనవాయితీగా మారింది. ఈ దందాకు జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు, రెవెన్యూ విభాగం అండగా నిలుస్తున్నాయి. అక్రమ నిర్మాణాలకు టౌన్‌ప్లానింగ్ అధికారులు కొమ్ముకాస్తుంటే.. రెవెన్యూ విభాగంలోని ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, డీసీలు ఇంటి నంబర్లు ఇస్తున్నారు.

పార్కు స్థలాలు, లేఅవుట్ ఖాళీ స్థలాలను ఆక్రమించే వారితోనూ అవినీతి అధికారులు చేతులు కలుపుతున్నారు. గతేడాది చందానగర్ సర్కిల్‌లోని మదీనాగూడ శాంతినగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలోని రెండు ఖాళీ స్థలాలకు అప్పటి ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి ఇంటి నంబర్లు జారీ చేయడమే అందుకు నిదర్శనం.

అక్రమ సంపాదన ఈ స్థాయిలో ఉన్నందునే.. శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిళ్ల రెవెన్యూ విభాగంలో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్‌కలెక్టర్లుగా పనిచేసేందుకు పోటీపడుతుంటారు. ప్రభుత్వ వివాదాస్పద భూముల సమస్యను పరిష్కరిస్తే.. ప్రజలకు ఈ సమస్యలుండవని స్థానికులు సర్కారును కోరుతున్నారు.

**రూ. 60 లక్షలకు..**

ఖానామెట్ లోని 11బై27 సర్వే నంబరులోని వెయ్యి గజాల్లో ఐదంతస్తుల భవనం కట్టారు. సదరు సర్వే నంబరుపై న్యాయస్థానంలో వాజ్యం నడుస్తోంది. అయినా సరే ఆ భవనానికి ఏప్రిల్ 1, 2024న 1219997816, 1219997817, 1219997818, 1219997819, 1219997820 పీటీఐఎన్ నంబర్లతో పది ఇంటి నంబర్లు ఇచ్చారు. అందుకు రూ. 60లక్షలు ముట్టినట్లు చెబుతున్నారు. పై స్థాయిలో ఒత్తిడి వల్లే ఇచ్చామని ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ దేవేందర్ తెలిపారు.

## మీరు జీవించే ఉన్నారు..



హైదరాబాద్: విశ్రాంత ఆచార్యులకు నెలనెలా సులువుగా పింఛన్ సొమ్ము వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేందుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం అధికారులు 'డిజిటల్ ఎగ్జిస్టెన్సీ' ధ్రువపత్రాన్ని ఇస్తున్నారు. డిజిటల్ పత్రం ఇవ్వకముందు పదవీ విరమణ చేసిన ఆచార్యులు, బోధనేతర సిబ్బందికి పింఛన్ డబ్బు ఇవ్వాలంటే 'లైఫ్ సర్టిఫికెట్'ను బ్యాంకు అధికారులకు సమర్పించాలి. వైద్యులు, రెవెన్యూ అధికారులు లైఫ్ సర్టిఫికెట్‌ను జారీచేస్తే.. ఓయూ ధ్రువీకరించేది. ఇంత ప్రయాస అవసరం లేకుండా 3 వేల మంది పింఛన్‌దారులకు అధికారులు డిజిటల్ ధ్రువపత్రాలు ఇస్తున్నారు. 'జీవన్ ప్రమాణ్ పోర్టల్'కు అనుసంధానమవ్వడం వల్ల ఇదంతా సాధ్యమయ్యిందని ఓయూ ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ మొలుగరం వివరించారు. **డౌన్‌లోడ్ చేసుకోండిలా..**దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో పదవీవిరమణ చేసిన ఉద్యోగులకు జీవన్ ప్రమాణ్ పోర్టల్‌ను కేంద్రం ఇటీవలే అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈనెల 1 నుంచి డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లను ఈ పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపింది. జీవన్ ప్రమాణ్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి పింఛన్‌దారులు వారి వ్యక్తిగత వివరాలు, పింఛన్ నంబరు, ఆధార్, చిరునామా, సెల్ఫీ అప్‌లోడ్ చేస్తే చాలు. గంటల వ్యవధిలో డిజిటల్ ధ్రువపత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. **తపాలా సిబ్బంది సాయంతోనూ..**

జీవన్ ప్రమాణ్ పోర్టల్ గురించి తెలిసినా.. వివరాలు నమోదు చేసుకోలేని పింఛన్‌దారులు సమీపంలోని మీ-సేవాకేంద్రాలకు వెళ్లి తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు. అక్కడికి వెళ్లలేని వారు తమ ఇంటికి వచ్చే తపాలాశాఖ సిబ్బందిని కూడా కోరవచ్చు. వివరాలు నమోదు చేసుకున్నాక పింఛన్‌దారుడి ఫొటో అప్‌లోడ్ చేస్తే సరిపోతుంది. నవంబరు 30వరకూ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ పొందేదుకు గడువు ఉంది.

## సాధికారత.. భద్రత

సిరిసిల్ల : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని నింపి సమయం వచ్చినప్పుడు సమస్యను ఎదుర్కొనే దిశగా తోడ్పాటును అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. బాలికలు పాఠశాలకు వచ్చే సమయంలో లేదా ఇతర సమయాల్లో ఈవ్‌టీజింగ్, అవమానం, లైంగిక వేధింపులు వంటివాటిని ఎదుర్కొనేలా బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించే దిశగా ప్రభుత్వ పాఠశాలలతో పాటు కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో బాలికా సాధికారత కౌమార భద్రతా క్లబ్‌లు ఏర్పాటు చేశారు.

**ఉమ్మడి జిల్లాలో 928 పాఠశాలల్లో..** ఉమ్మడి జిల్లాలోని పాఠశాలల్లో 928 బాలికా సాధికారత కౌమార భద్రతా క్లబ్‌లను ఏర్పాటు చేశారు. ప్రతి పాఠశాలలో 14 నుంచి 16 మందితో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. 6 నుంచి 'పది' వరకు ఒక్కో తరగతి నుంచి ఇద్దరు క్రియాశీలక బాలికలను లీడర్లుగా ఎంపిక చేశారు. కమిటీకి ఛైర్మన్‌గా ప్రధానోపాధ్యాయుడు, సభ్యులుగా బాలికలతో స్నేహపూర్వకంగా ఉండే మహిళా టీచర్ లేదా ఒక సీనియర్ ఉపాధ్యాయుడు ఉన్నారు.

బాలికలు వారి సమస్యలను సంబంధిత క్లబ్ సభ్యుల ద్వారా ప్రధానోపాధ్యాయుడికి తెలిపితే సంబంధిత శాఖల ద్వారా విద్యార్థుల సమస్యను పరిష్కరించనున్నారు.

సంబంధించిన పుస్తకాలను కూడా పాఠశాలలకు అందజేశారు. వివిధ శాఖల సమన్వయంతో విద్యార్థులకు షెడ్యూల్ ప్రకారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వీటిపై టీశాట్‌లో ప్రసారం కానున్న తరగతులను విద్యార్థులకు చూపెట్టనున్నారు. క్లబ్ ఏర్పాటు చేసిన పాఠశాలలో గ్రీవెన్స్ బాక్స్ ఏర్పాటు చేశారు. నేరుగా సమస్యను తెలియజేయని విద్యార్థుల కోసం ఈ బాక్స్‌ను ఏర్పాటు చేశారు. తను ఎదుర్కొన్న సమస్యను కాగితంపై రాసి బాక్స్‌లో వేస్తే పరిష్కారానికి కృషి జరుగుతుంది.

అవగాహన కల్పించే విషయాలు
కౌమార దశలో వచ్చే మార్పులు
బాలికల సంరక్షణ
బాలికలపై వేధింపులు



ఆరోగ్య సంరక్షణ
న్యాయ సంరక్షణ విధానాలు
బాల్య వివాహాలు
మాదక ద్రవ్యాలు
సైబర్ నేరాలు
పొదుపుజి
బాలికల ఆత్మరక్షణ
జీవన నైపుణ్యాలు
మానసిక పరమైన కౌన్సెలింగ్
కెరీర్ గైడెన్స్.

ఆత్మస్థైర్యం పెంపు: పద్మజ, లింగ సమానత్వ సమన్వయకర్త

బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని నింపడానికి, వారిపై ఆకృత్యాలను అరికట్టడానికి బాలిక సాధికారత క్లబ్బులు ఉపయోగపడతాయి. పాఠశాలల్లో గ్రీవెన్స్ బాక్సులు ఉంటాయి. వాటిని ప్రతి శుక్రవారం క్లబ్‌ల ఆధ్వర్యంలో తెరిచి సమస్యలను పరిష్కరించనున్నాం.

## కాల్వ చివరలు కబ్జా

గుర్రంపోడు : ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కాల్వల అంచులు ఆక్రమణలతో కుచించుకుపోతున్నాయి. ఎగువన ఉన్న రైతులు కాల్వలను పూడ్చి తమ పంట భూముల్లో కలుపుకొంటున్నారు. పట్టించుకునేవారు లేక రెండు మూడు కిలోమీటర్ల పొడవునా ఉనికి కోల్పోయాయి. రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. దీంతో పోరాడిన రైతులూ రాజీ పడిపోతున్నారు. ఏఎమ్మార్పీలోని ప్రైతి మైనరు కాల్వలోనూ ఇదే పరిస్థితి నెలకొనటం అధికారులను సైతం విస్తుగొలుపుతున్నాయి.

**నీరు రాకపోవటం వల్లే..**

ఏఎమ్మార్ ప్రాజెక్టు ప్రధాన కాల్వకు 55 ప్రధాన డిస్ట్రిబ్యూటర్లు ఉండగా ప్రతి డిస్ట్రిబ్యూటరీకి రెండు వైపులా పది నుంచి 20పైగా మైనరు కాల్వలున్నాయి. ప్రాజెక్టు మొత్తం మీద 450 పైగా మైనర్లు ఉన్నట్లు అంచనా. కేవలం కాల్వలు తవ్వి రైతులకు అప్పగించారు. ఎప్పుడు నీళ్లు వదిలినా ఈ మైనరు కాల్వలకు చివరి వరకూ నీరు రాకపోవటంతో అవి క్రమంగా నేలమట్టం అయ్యాయి. దీంతో వాటిని సమీప రైతులు తమ పంట భూముల్లో కలుపుకొంటున్నారు. రెండు మూడేళ్ల పాటు అధికారుల చుట్టూ తిరిగి ఫిర్యాదు చేసినా ప్రయోజనం



కనిపించక వదిలేస్తున్నారు. ముక్కాముల నుంచి కొత్తలూరు మధ్యన డి-22 మేజరు కాల్వ ముగుస్తుంది. చివరన ఒక కిలో మీటరు వరకు కాల్వలను పక్క రైతులు ఆక్రమించటంతో దిగువ రైతులు అధికారులకు ఫిర్యాదు చేసినా రాజకీయ నాయకుల ప్రమేయంతో ఆక్రమణలను వదిలించలేకపోయారు. డి-20లో 4ఆర్ కూడా చివరి కాల్వలు ఆక్రమించిన విషయంపై ఫిర్యాదు అందుకున్న అధికారులు కాల్వలు పరిశీలించి విస్తుపోయారు.

**చర్యలు తీసుకుంటాం-పరమేశ్, డీఈఈ, నీటిపారుదలశాఖ**

ప్రభుత్వం డిజైన్ చేసి తవ్విన ప్రతి కాల్వను పరిశీలిస్తాం. ఎక్కడైనా ఆక్రమించినట్లు తేలితే సదరు రైతులపైనా క్రిమినల్ చర్యలు తీసుకుంటాం. కాల్వల కబ్జాతో తోటి రైతులే ఇబ్బంది పడతారని గుర్తించాలి.

## ఆకర్షణీయ ప్రకటనలు.. 'సైబర్' మోసాలు

ఖమ్మం :తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయంటూ ఆకర్షించి మోసం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ప్రజలకు సూచించారు. సైబర్ మోసగాళ్లు నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్ యాప్‌లు, వెబ్‌సైట్లు రూపొందించి మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. కొత్త సంస్థ, ప్రసిద్ధ సంస్థ పేరుతో ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్) వస్తుందని తక్కువ ధరకే షేర్లు వస్తున్నాయని సామాజిక మాధ్యమాల్లో లింకులు పంపుతూ మోసం చేశారని పలు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.


మోసాలు ఇలా..

మోసగాళ్లు పెద్ద కంపెనీ ఐపీఓ వచ్చిందని నమ్మదగిన ప్రకటనలు, నకిలీ వెబ్‌సైట్‌లు సృష్టిస్తున్నారని అన్నారు. ఆ లింక్ లేదా ఫారమ్ ద్వారా బ్యాంక్ ఖాతా వివరాలు, ఆధార్, పాన్, యూపీఐ ద్వారా చెల్లింపులు చేయమని చెప్పి మోసం చేస్తున్నారని అన్నారు. డబ్బు బదిలీ చేసిన తదుపరి మోసగాళ్లు వెబ్‌సైట్ మూసేసి మాయం అవుతారు. నకిలీ షేర్ సర్టిఫికెట్లు, రసీదులు కూడా పంపి మోసం చేస్తారని పేర్కొన్నారు.

జాగ్రత్తలుజి

ఐపీఓ పెట్టుబడి పెట్టే ముందు సెబీ, ఎన్ఎస్ఈ, బీఎస్ఈ అధికారిక వెబ్‌సైట్‌లో సదరు కంపెనీ నిజంగా ఐపీఓ నమోదు అయిందో లేదో ధ్రువీకరించుకోవాలి. సోషల్ మీడియా, వ్యక్తిగత సందేశాల ద్వారా వచ్చే ఐపీఓ ఆఫర్లను నమ్మి మోసపోవద్దన్నారు. ఎవరైనా ముందుగా 'అడ్వాన్స్ పేమెంట్', రిజిస్ట్రేషన్ ఫీజు అడిగితే డబ్బు బదిలీ చేయొద్దన్నారు.

ట్రేడింగ్ యాప్, వెబ్‌సైట్ సెబీ,ఆర్‌బీఐ వద్ద రిజిస్టర్ అయిందా లేదా అని తప్పని సరిగా చెక్ చేయాలి. గ్యారెంటీడ్ రిటన్స్, డబుల్ మనీ అని చెప్పే వారిని నమ్మకండి. సోషల్ మీడియా ద్వారా వచ్చే నకిలీ యాప్, వెబ్‌సైట్‌లను ఉపయోగించవద్దు. ఎవరైనా వీడియో కాల్, వాట్సప్ ద్వారా పెట్టుబడి పెట్టమని ఒత్తిడి చేస్తే వెంటనే కాల్ కట్



చేసి ఫిర్యాదు చేయాలని సీపీ సూచించారు.

నకిలీ ట్రేడింగ్‌తో..

తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని సామాజిక మాధ్యమాలు, యూట్యూబ్ వీడియోలు, వాట్సప్ గ్రూపులు, టెలిగ్రామ్ ఛానళ్ల ద్వారా ప్రకటనలు చేస్తారన్నారు. 'రోజుకు వేలల్లో లాభం', 100% రిటర్న్ అంటూ ప్రకటనలు చేసి మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. మొదట యాప్, వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేయమని చెబుతారు. చిన్న మొత్తంలో పెట్టుబడి పెట్టగానే కొంత లాభం చూపించి నమ్మకం కలిగించి తరువాత మోసాలకు పాల్పడుతారు. ఆ తదుపరి పెద్ద పెట్టుబడి పెట్టమని ప్రోత్సహిస్తారు. తరువాత విత్‌డ్రా చేయాలంటే ట్యాక్స్, సర్వీస్ ఛార్జి పేరుతో డబ్బు అడిగి మోసం చేస్తారన్నారు. చివరకు వెబ్‌సైట్, యాప్ యాక్సెస్ నిలిపివేసి, డబ్బుతో మాయమవుతారని పేర్కొన్నారు.

# సేవ సమ్మేళనాలు

జమ్మికుంట : ప్రస్తుతం పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు ట్రెండ్‌గా మారాయి. చదువు పూర్తిచేసుకుని జీవితంలో స్థిరపడిన వారు ఒక చోట చేరి గురువులను సన్మానిస్తున్నారు. కానీ వీరు మాత్రం ఒక అడుగు ముందుకేసి పాఠాలు నేర్పిన బడులు, కళాశాలల్లో సేవ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఓ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తుండగా.. ఓ పూర్వ విద్యార్థి పాఠశాలకు నేనున్నానని అండగా నిలుస్తున్నారు.

**ఆర్థిక సాయం అందజేస్తూ..**

మూడేళ్లుగా పాఠశాల అభివృద్ధి, విద్యార్థులు ఆటల్లో రాణించేలా సుమారు రూ.లక్షకు పైగా వ్యయంతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి కచ్చుకాయల మహేశ్. రెండేళ్ల క్రితం విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల మాదిరి ఏకరూప దుస్తులకు రూ.35 వేల ఆర్థికసాయం చేశారు. స్వాతంత్ర్య, గణతంత్ర్య దినోత్సవాల సమయాల్లో ఆటలు, సాంస్కృతిక పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్నారు. ఇటీవల రూ.20 వేల విలువ చేసే క్రీడా దుస్తులు అందజేశారు. పదో తరగతి విద్యార్థులకు అల్పాహారానికి రెండు పర్యాయాలు రూ.7 వేలతో పాటు.. బడికి వాలీబాల్ సామగ్రి ఇచ్చారు. తరగతి గదులలో విద్యుత్తు సరఫరా వైరింగ్ చేయించారు. ముమ్మందు విద్యార్థులు, పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తాననే హామీ ఇసున్నారు.



**మధ్యాహ్న భోజనం అమలు చేస్తూ..**

జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల పూర్వ విద్యార్థి బచ్చు భాస్కర్ దాతృత్వాన్ని చాటుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి చదువుకునేందుకు వచ్చేవారికి చేయూత ఇచ్చేందుకు రోజూ మధ్యాహ్న భోజనం పెట్టేందుకు ముందుకొచ్చారు. గత విద్యా సంవత్సరంలో అమలు చేసిన ఈ కార్యక్రమం నేటికి కొనసాగుతోంది. కళాశాలకు చెందిన మరో పూర్వ విద్యార్థి ముక్కా శివకుమార్ చేయూతతో ఏర్పాటుచేసిన నీటి ప్లాంట్, శీతలీకరణ యంత్రంతో తాగునీటి సౌకర్యం ఏర్పడింది. మధ్యాహ్న భోజనం పథకంలో రోజూ విభిన్న రకాల ఆహార పదార్థాలను విద్యార్థులకు వడ్డించడం విశేషం. నెలకు రూ.60వేలు ఖర్చు అవుతుందని దాత చెప్పారు.

# అప్రమత్తతే రక్ష

తిమ్మాపూర్ : గ్రామీణ ప్రాంతాలలో నిర్లక్ష్యం, అజాగ్రత్తలతో చాలా మంది పాము కాటుకు బలవుతున్నారు. పొలం పనుల్లో ఎందరో అన్నదాతలు అర్థంతరంగా తనువు చాలిస్తున్నారు. ఇంటి ఆవరణల్లో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం, పాత సామాన్లను అస్తవ్యస్తంగా పడేసి, పట్టించుకోకపోతే పాములు, కీటకాలు, విష పురుగులు చేరి వాటిని ఆవాసంగా మార్చుకుంటాయి. మనం అజాగ్రత్తగా ఉన్న సమయంలో దాడి చేస్తాయి. చిన్నచిన్న పురుగులు కూడా ఇంట్లోకి ప్రవేశించకుండా జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం ప్రమాదాలకు ఓ కారణమే. వీటిని అరికట్టాలంటే అప్రమత్తత, జాగ్రత్త చర్యలే కీలకం.

**కాటు వేసిన వెంటనే చేయాల్సింది..**

కరిచిన భాగాన్ని కదిలించకూడదు

కాటు పైభాగాన మెత్తటి వస్త్రంతో కొంచెం బిగువుగా, నెమ్మదిగా కట్టాలి బాధితుడి ఒంటిపై బిగువుగా ఉండే ఆభరణాలు తేసేయాలి

కరిచిన చోట నోటితో రక్తాన్ని పీల్చకూడదు. పీల్చిన వారికి హాని కలిగే అవకాశం ఉంది

బాధితుడితోపాటు పక్కనున్న వారు కూడా ఆందోళన చెందకూడదు. అలా చేస్తే రక్తపోటు పెరిగి విషం త్వరగా శరీరమంతా వ్యాపిస్తుంది.

కుట్టిన వెంటనే 20 నిమిషాల్లోపు సమీప ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్సనందించాలి విష పురుగులు ఇంట్లోకి రావడానికి కారణాలు..

ఇంటి పరిసరాల్లో పిచ్చిమొక్కలు, పనికి రాని సామాన్లు, రాళ్లూరప్పలు, చెత్తాచెదారాలు ఉండటం

ఇంట్లో ఎలుకలు, కప్పలు, క్రిమికీటకాలు లేకుండా చర్యలు తీసుకోకపోవడం (వాటి కోసం పాములు వస్తాయి)

ఇంటి తలుపులకు రక్షణ జాలీలు ఏర్పాటు చేసుకోకపోవడం

చెరువులు, జలాశయాలకు సమీపంలో జాగ్రత్త చర్యలు తీసుకోకుండా జీవించడం (పాములు, కీటకాల ఆవాసాలు)

ఇళ్ల సమీపంలో పుట్టలు, తదితరాలు ఉండటం

పొలాల్లో, గట్లపై, ఇంటి ఆవరణలో, పెరట్లో ఎక్కువగా ఉండే గడ్డి

# కట్టు కాలువ.. మాయమవుతోంది గుట్టుగా!

వేములవాడ : ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడలో ఇళ్ల స్థలాల ధరలు రోజురోజుకు పెరిగిపోవడంతో కొందరు కాలువను కబ్జా చేస్తూ అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు. దీంతో విశాలమైన కాలువ కుంచించుకుపోతోంది. భారీ వర్షాల సందర్భంలో వరదనీరు ముందుకు సాఫీగా వెళ్లలేని దుస్థితి ఏర్పడి సమీప ఇళ్లను, ఖాళీ స్థలాలను ముంచెత్తుతున్నాయి. ఇంత జరుగుతున్నా మున్సిపల్, నీటి పారుదల శాఖల అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

**ఇదీ సంగతి**వేములవాడ పట్టణ శివారులోని మల్లారం రోడ్డులోని కట్టుకాలువ కోనాయిపల్లి శివారు నుంచి మల్లారం రోడ్డు దాటుతూ వంకలు తిరుగుతూ మాజీ ఎమ్మెల్యే గెస్ట్‌హౌస్ సమీపం వరకు వెళ్లి మూలవాగులో కలుస్తుంది. ఈ కాలువ పట్టణానికి సమీపంలో ఉండటంతో కాలువ వెంబడి ప్లాట్ల యజమానులు కాలువను కబ్జా చేస్తూ ఇంటి నిర్మాణాలు చేస్తున్నారు. పట్టణ శివారు ప్రాంతాల్లో గుంట స్థలానికి రూ.15 నుంచి రూ.20 లక్షల వరకు ధర పలుకుతోంది. దీంతో కాలువ స్థలాన్ని ఆక్రమిస్తూ రాయితో, సిమెంటు మిక్సర్‌తో గోడలు నిర్మించి కబ్జా చేస్తున్నారు. ఫలితంగా దాదాపు పది గజాలకు పైగా వెడల్పున్న కాలువ ఇరువైపులా ఆక్రమణలతో సగానికిపైగా తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తోంది.

**గతంలో తొలగించినప్పటికీ..**మల్లారం రోడ్డులోని కాలువ వద్ద గతంలో అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు కొరడా ఝులిపించి నిర్మాణాలకు తొలగించారు. కట్టుకాలువ వద్ద సిమెంట్ పిల్లర్లు వేసి నిర్మాణాలు చేపడితే ఆ పిల్లర్లతోపాటు ఇతర నిర్మాణాలను సైతం తొలగించారు. కానీ రాత్రికి రాత్రే అక్రమ నిర్మాణాలు పూర్తి చేసి విలువైన స్థలాన్ని కబ్జా చేస్తున్నారు. దాదాపు ఐదారు ప్రాంతాల్లో కాలువను ఇళ్ల యజమానులు ఆక్రమించి భారీ గోడలు నిర్మించినా పట్టించుకునే నాథుడే లేడని పట్టణ ప్రజలు వాపోతున్నారు. మున్సిపల్, నీటిపారుదల శాఖ అధికారులు కాలువ వెంబడి ఆక్రమణలను తొలగించి విలువైన స్థలాన్ని రక్షించాలని కోరుతున్నారు.

**పరిశీలించి చర్యలు– అన్వేష్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ**

కాలువ కబ్జా చేసి చేపట్టిన అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తాం. విచారణ అనంతరం అక్రమ నిర్మాణాలుగా తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం. గతంలోనే అక్రమ నిర్మాణాలు చేపడితే తొలగించాం.

# కట్టెల పొయ్యి.. బోరు నీరు!




కరీంనగర్ : జిల్లాలోని సర్కారు బడుల్లోని మధ్యాహ్న భోజనం చాలా చోట్ల మెరుగైనా.. వసతుల లేమితో కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వంట గదులున్నా చోట అవి ఇరుకుగా ఉండటం, మరికొన్ని చోట్ల లేకపోవడంతో ఆరుబయట వండుతున్నారు. విద్యాశాఖ సూచించిన మెనూ కొన్ని చోట్ల మాత్రం అమలు కావడం లేదు. ట్యాంకుల్లో నిల్వ చేసిన నీటిని, బోరు నీటిని వంటలకు ఉపయోగిస్తున్నారు. కట్టెల పొయ్యిలపై వంట చేస్తుండటంతో నిర్వాహకులు, విద్యార్థులు పొగతో ఇబ్బందిపడుతున్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ కనెక్షన్లు అందించాలనే విషయం ప్రతిపాదన దశలోనే ఉండిపోయింది. మెస్ బిల్లులు పెంచని కారణంగా నాణ్యత కొరవడుతోంది.

**కూరగాయలతో సాంబారు**

1. పేరు : చొప్పదండి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల
2. బియ్యం ఎలా ఉన్నాయి: బాగున్నాయి
3. వంటకు ఏ నీటిని ఉపయోగించారు: బోరు నీటిని వాడుతున్నారు.
4. వంట గది ఉందా. పరిసరాలు ఎలా ఉన్నాయి: వంట గది ఇరుకుగా ఉండటంతో ఆరు బయట చెట్ల కింద వంట చేశారు.
5. మెనూ పాటించారా : కూరగాయలతో సాంబారు చేశారు. కోడి గుడ్డు వడ్డించారు.
6. గ్యాస్ ఉపయోగించారా? : కట్టెల పొయ్యి మీద వండారు. వంట గ్యాస్ కనెక్షన్ లేదు.

**రేకుల షెడ్డులో వంటలు**

1. వెల్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
2. నాణ్యమైన బియ్యం
3. చేతిపంపు నీరు ఉపయోగించారు.
4. వంటగది లేదు. పరిసరాలు అపరిశుభ్రంగా కనిపించాయి.
5. బెండకాయ కూర, గుడ్డు పెట్టారు.
6. కట్టెల పొయ్యి మీద వండారు.


**పొట్టు తీయకుండా గుడ్ల పంపిణీ**

1. హుజూరాబాద్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల
2. బియ్యం బాగానే ఉన్నాయి.
3. బోరు, ట్యాంకు నీటిని ఉపయోగించారు.
4. వంట గది శుభ్రంగా ఉంది.
5. సాంబారు, కూరగాయలతో కూర వడ్డించారు. గుడ్డు పొట్టు తీయకపోవడంతో విద్యార్థులు కొంత ఇబ్బంది పడ్డారు.
6. గ్యాస్, కట్టెల పొయ్యి రెండింటిని ఉపయోగించారు.

**ఎప్పటికప్పుడు పర్యవేక్షణ–** శ్రీరాం మొండయ్య, డీఈవో, కరీంనగర్

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేలా చర్యలు చేపడుతున్నాం. కలెక్టర్, తాము ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మెనూ పాటించాల్సిందే. భోజనం విషయంలో ఏమైనా సమస్యలుంటే తనకు, స్థానిక ఎంఈవోల దృష్టికి తీసుకెళితే చర్యలు తీసుకుంటాం.

# సాగు పేరిట.. అక్రమాల బాట



కోరుట్ల ఆర్టీయే పరిధిలో ఇలా..

| అవసరం | ట్రాక్టర్లు | ట్రాలీలు |
|---|---|---|
| వ్యవసాయం | 10,116 | 5,477 |
| వాణిజ్య | 3,336 | 3,086 |

మెట్‌పల్లి : వ్యవసాయ అవసరాల కోసం కొనుగోలు చేసిన ట్రాక్టర్లను కొందరు వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారు. జిల్లాలో ఇసుక, మట్టి తరలించే 90 శాతం ఇలాంటివే. సాగు కోసం కొనుగోలు చేసే ట్రాక్టర్లు, ట్రాలీలకు ప్రభుత్వం రహదారి పన్ను(రోడ్ ట్యాక్స్) మినహాయింపునిస్తోంది. వీటిని వ్యవసాయేతర పనులకు వాడటం నిబంధనలకు విరుద్ధం. కొందరు అక్రమ వ్యాపారాలకు వినియోగిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

**పన్ను తప్పించుకునేందుకే..**

వ్యవసాయ అవసరాలకు కొనుగోలు చేసే ట్రాక్టర్లను దున్నడంతో పాటు విత్తనాలు, ఎరువులు, పంట ఉత్పత్తుల తరలింపునకు వినియోగించవచ్చు. ఇతర పనులకు వాడటం నిబంధనలకు విరుద్ధం. వాణిజ్య అవసరాలకు వాడే ట్రాక్టర్, ట్రాలీలకు కలిపి మూడు నెలలకు రూ.950 చొప్పున రహదారి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. వ్యవసాయ ట్రాక్టర్లకు తెలుపు, ఇతర వాహనాలకు పసుపు రంగు నంబర్ల ప్లేట్లు జారీ చేస్తారు. అలాగే ఫిట్‌నెస్, బీమా రుసుం కూడా వేర్వేరుగా ఉంటాయి. ఈ పన్నులు తప్పించుకొనేందుకు ఇసుక, మట్టి వ్యాపారులు వ్యవసాయం పేరిట ట్రాక్టర్లు కొనుగోలు చేసి వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారు.

**పట్టుబడుతున్నా.. చర్యలేవీ?**

ఇసుక, మట్టి అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టుకొని జరిమానా విధిస్తున్నారు. అలా పట్టుబడుతున్న వాటిలో కొన్ని తెలుపు రంగు నంబరు ప్లేట్లవి ఉంటున్నాయి.

ఇలాంటి వాహనాలను రవాణా శాఖ అధికారులకు అప్పగించాల్సి ఉండగా కొన్ని సందర్భాల్లో తప్ప సమాచారం ఇవ్వడం లేదు. ఆయా శాఖలు జరిమానా వేసి వదిలేస్తున్నాయి.

రవాణా శాఖ అధికారులకు అప్పగిస్తే డ్రైవింగ్ లైసెన్సు, ఫిట్‌నెస్, బీమా, రహదారి పన్ను, రిజిస్ట్రేషన్ తదితర పత్రాలను తనిఖీ చేసి నిబంధనలకు విరుద్ధంగా ఉంటే చర్యలు తీసుకునే అవకాశముంటుంది. రవాణా శాఖ తనిఖీలూ నామమాత్రంగానే ఉంటున్నాయన్న ఆరోపణలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న ట్రాక్టర్లపై ఇప్పటికైనా దృష్టి సారిస్తే ప్రభుత్వానికి ఆదాయం పెరగనుంది.

వ్యవసాయం పేరిట కొనుగోలు చేసిన ట్రాక్టర్, ట్రాలీలను సాగు అవసరాలకు మాత్రమే వినియోగించుకోవాలని కోరుట్ల ఎంవీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. అక్రమ ఇసుక, మట్టి రవాణాకు వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# పరిధుల వ్యత్యాసం.. ప్రమాదాలకు కారణం


ధర్మపురి : 2024 సెప్టెంబరు 15న జగిత్యాల–ధర్మపురి జాతీయ రహదారిపై పొలాస వద్ద ఓ ప్రైవేట్ బస్సు రెండు ద్విచక్రవాహనాలను ఢీకొనగా ఓ వ్యక్తి, బాలిక మృతి చెందారు. అదే ఏడాది అక్టోబరులో తుమ్మెనాల స్టేజీ వద్ద కారు, టాటాఏస్ వాహనం ఢీకొట్టడంతో పలువురికి గాయాలయ్యాయి. వారానికి రెండు మూడు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

తమ పరిధి కాదంటే తమది కాదని రోడ్డు, భవనాలశాఖ వారు కాలయాపన చేస్తుండగా ధర్మపురి– జగిత్యాల–రాయపట్నం రహదారి ప్రమాదకరంగా మారింది. ఈ మార్గం 29 కి.మీలు అయినా ఆర్అండ్‌బీ నుంచి నేషనల్ హైవేకి మారడం, తమ పరిధిలో లేదని ఆర్అండ్‌బీ వారు, మరోవైపు తాము కొత్తగా గ్రీన్‌ఫీల్డు దారి వేస్తున్నామని తమకు దీంతో సంబంధం లేదని జాతీయ రహదారి అభివృద్ధి సంస్థ వారు చెబుతుండటంతో నిర్లక్ష్యానికి గురవుతోంది.

**ప్రస్తుత పరిస్థితి**

మూలమలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరికల సిగ్నల్ పూర్తి స్థాయిలో లేవు. అనంతారం, నేరెళ్లగుట్టల వద్ద గత వానాకాలంలో పూర్తి స్థాయిలో లోలెవల్ వంతెనలకు మరమ్మతులు చేపట్టలేదు. నేరెళ్లగుట్ట వద్ద పరిస్థితి అధ్వానంగా మారింది. ఈ రెండింటినీ ఎత్తైన వంతెనలుగా మార్చడానికి నిధులు విడుదల చేస్తే ప్రమాదాలు తప్పే వీలుంటుందని స్థానికులు భావిస్తున్నారు.

**నిధులు వచ్చి.. వెనక్కి వెళ్లి**



2010లో గ్రీన్‌ఫీల్డు రహదారి ప్రతిపాదనలకు ముందు నిజామాబాద్–జగ్దల్‌పూర్ జాతీయ రహదారి 63(అప్పుడు ఉండే)ని జగిత్యాల నుంచి మంచిర్యాల వరకు విస్తరించడానికి నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇదే సమయంలో జాతీయ రహదారి అభివృద్ధి సంస్థ వారు తాము ఈ రహదారిని స్వాధీనపరుచుకుని ప్రత్యేక రహదారిగా ప్రతిపాదిస్తామని సమ్మతి వ్యక్తం చేయడంతో జాతీయ రహదారి–63 అధికారులు ఆ నిధులను మళ్లించారు. దీంతో వచ్చిన నిధులు వెళ్లిపోయాయి. 2010 నుంచి 2025 మధ్య పలు సర్వేల ద్వారా జాతీయ రహదారి నుంచి గ్రీన్‌ఫీల్డు అలైన్‌మెంట్ మార్చడంతో ఈ రహదారి నిర్లక్ష్యానికి గురవుతూ వస్తోంది. ఆర్అండ్‌బీశాఖ వారి పరిధిలో ఈ రహదారి లేకపోవడం, జాతీయ రహదారి సంస్థ కొత్త దారిని నిర్మిస్తున్నందున ఇది తమ పరిధిలోనిది కాదని పట్టించుకోవడం లేదు.

# అయిదు తరగతులకు ఒకే పాఠం!

పెద్దశంకరంపేట: పెద్దశంకరంపేట మండలం రాఘవానితండా ప్రాథమిక పాఠశాలలో 17 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి ఒక్కరే ఉపాధ్యాయురాలు. అయిదు తరగతులకు బోధన చేయాల్సి వస్తోంది. అత్యవసర పరిస్థితిలో ఆమె సెలవు కూడా పెట్టలేని పరిస్థితి. ఇక ఒకే పాఠం అయిదు తరగతుల వారు వినాల్సి వస్తోంది. జిల్లా వ్యాప్తంగా 234 పాఠశాలల్లో ఇలాంటి దుస్థితే నెలకొంది. జిల్లా వ్యాప్తంగా: మెదక్ జిల్లా వ్యాప్తంగా 902 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 623. వీటిలోనే అధికంగా 234 పాఠశాలలు ఏకోపాధ్యాయులతో కొనసాగుతున్నాయి. వీటిల్లో విద్యార్థుల సంఖ్య 20 లోపే ఉండడంతో బోధనకు ఒక్కరినే కేటాయించారు. వీటిలో 51 పాఠశాలల్లో పదిలోపే విద్యార్థులు ఉండటం గమనార్హం. మారుమూల ప్రాంతాల్లో ఈబడులు కొనసాగుతుండటం వల్ల విద్యార్థుల సంఖ్య లేకపోవడం వల్ల ఉపాధ్యాయ పోస్టులు లేకుండా పోయాయి. అయితే ఉన్న విద్యార్థులకు



మాత్రం సరిగా బోధన అందడం లేదు. ఉన్న ఒక్క ఉపాధ్యాయులపై పాఠశాల నిర్వహణ బాధ్యత పడటంతో బోధనకు పూర్తి స్థాయి సమయం దొరకడం లేదు.

**తప్పని ఇబ్బందులు**

ఉపాధ్యాయులకు యూడైస్ ఆన్‌లైన్ పని, మధ్యాహ్న భోజన పర్యవేక్షణ, హాజరు, ప్రధానోపాధ్యాయుల సమావేశాలు వంటి పనులతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ పాఠశాలలతో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవస్థలు తప్పడం లేదు. బోధన సరిగా సాగక విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయి. ఉన్న ఒక్క ఉపాధ్యాయులు అన్ని తామై నడిపించడం భారంగా మారుతోంది. ఉపాధ్యాయులకు అత్యవసర పరిస్థితిలో సెలవుపై వెళ్లాలంటే ప్రత్నామ్నాయంగా ఒక ఉపాధ్యాయులైనా, సీఆర్పీ అయినా పాఠశాలకు రావాల్సిందే. పాఠశాల మూసేయకుండా ఉండేలా ఆదేశాలు ఉండడంతో సెలవు తీసుకోవడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యావాలంటీర్లు ఉన్న సమయంలో వెసులుబాటు ఉండేది. ఈ పాఠశాలల ఉపాధ్యాయులు పాఠశాల సముదాయ సమావేశాలు, దృశ్యసమీక్షలు వంటి ఇతర సమావేశాలకు వెళ్లాలంటే ప్రత్యామ్నాయం వెతుక్కోవాల్సి వస్తోంది. ఇలా ఇబ్బందులు నడుమ ఏకోపాధ్యాయ పాఠశాలలు కొనసాగక తప్పడం లేదు.

**మూతపడకుండా చర్యలు**

ఏకోపాధ్యాయ పాఠశాలలు ఇబ్బందులు నడుమ కొనసాగుతున్నా విద్యార్థులకు నష్టం జరగకుండా చూస్తున్నాం. వాటిని మూసివేయకుండా ప్రత్యామ్నాయంగా అక్కడ ఏర్పాటు చేస్తున్నాం. విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలల్లోనే ఈ పరిస్థితి ఏర్పడుతోంది. సంఖ్య పెరిగితే ఉపాధ్యాయుల సర్దుబాటు, పోస్టుల మంజూరు చేసే అవకాశం ఉంటుంది. రాధాకిషన్ జిల్లా విద్యాధికారి

# తెలుసుకో.. జాగ్రత్తగా మసలుకో!


సిద్దిపేట : మారిన పరిస్థితుల్లో చరవాణి తోడుగా.. ఆన్‌లైన్ వేదికగా లావాదేవీలకు ప్రాధాన్యం పెరిగింది. ఇదే అదనుగా సైబర్ నేరగాళ్లు వివిధ రూపాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. కేవైసీ నమోదు.. నవీకరణ పేరిట.. గాలం వేసి బురిడీ కొట్టిస్తున్నారు. ఈ నేపథ్యంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని బ్యాంకు అధికారులు సూచిస్తున్నారు. ఎలాంటి సందర్భాల్లో ఈ కేవైసీ(నో యువర్ కస్టమర్) అవసరం.. ప్రక్రియను ఎక్కడ.. ఎలా చేపట్టాలనే సమాచారం మీకోసం..

**పథకాల లబ్ధిదారులకు..**

ప్రభుత్వ రాయితీ, వివిధ పథకాల కింద లబ్ధి పొందాలంటే డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) కింద బ్యాంకులు ఆధార్, మొబైల్ నంబరు, ఇతర వివరాలు(కేవైసీ) జత చేయాలని సూచిస్తుంటాయి. ప్రధానంగా ఉపాధి హామీ కూలీలు, రైతులు, చేయూత పింఛనర్లు, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నగదు జమ క్రమంలో ప్రత్యేకంగా అడుగుతుంటాయి. ఖాతాకి ఆధార్, పాన్ కార్డును లింకు చేసుకోవాల్సిందిగా అధికారులు సూచిస్తుంటారు.

**మూడు విభాగాల్లో పరిశీలన**

బ్యాంకు వినియోగదారులను మూడు కేటగిరీలుగా విభజిస్తారు. లో రిస్క్ (చిరువ్యాపారులు, ఉద్యోగులు) పదేళ్లకోసారి, మీడియం రిస్క్(స్థిరాస్తి, ఉన్నత స్థాయి వ్యాపారులు, కంపెనీలు నిర్వహించే వారు) ఎనిమిదేళ్లకోసారి, హైరిస్క్(ఎగుమతి–దిగుమతి వ్యాపారులు, అధిక రిస్కు దేశాల్లో ఉండేవారు, నేర చరితులు) రెండేళ్లకోసారి రీ–కేవైసీ చేయాలి.



**వీరు బ్యాంకుకు వెళ్లాల్సిందే..**

సంతకాలు, ముఖ కదలికలు, వివిధ రకాల వివరాల మార్పు సహజంగా జరుగుతుంది. కొన్ని సందర్భాల్లో ఖాతాదారులను గుర్తించేందుకు ప్రత్యేకంగా బ్యాంకులు ఆహ్వానిస్తుంటాయి. లావాదేవీలు సక్రమంగా చేపట్టేందుకు, నవీకరణకు పునః ప్రక్రియ దోహదం చేస్తుంది.

ఖాతా ఏడాది నుంచి రెండేళ్ల పాటు వినియోగించకుంటే ఇన్‌యాక్టివ్ దశలోకి వెళ్తుంది. బ్యాంకు ద్వారా వడ్డీ లాంటివి జమ అయినా.. ఖాతాదారుల లావాదేవీలు మాత్రం స్తంభిస్తాయి. రీ–కేవైసీ, ఈ–కేవైసీ పత్రాల సమర్పణను బ్యాంకుల్లో నేరుగా ఖాతాదారు చేపట్టడం ఉత్తమం. **నేరుగా సంప్రదించాలి**హరిబాబు, ఎల్‌డీఎం, సిద్దిపేట

రెండేళ్లుగా ఖాతాను వినియోగించని వారు సంబంధిత బ్యాంకుల్లో అధికారులను నేరుగా సంప్రదించాలి. నిర్దేశిత ధ్రువపత్రాలతో కేవైసీ ఫారాన్ని పూరించి సమర్పించాలి. గుర్తుతెలియని, అనుమానిత నంబర్ల నుంచి వచ్చే లింకులు, ఫోన్లకు స్పందించవద్దు.

# అండగా ఉంటాం.. అడ్డంగా కట్టేయ్!

చిత్తూరు : భవన నిర్మాణాల క్రమబద్ధీకరణకు నిర్దేశించిన బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం (బీపీఎస్)కు మార్గదర్శకాలు వెలువడక మునుపే ప్రజాప్రతినిధుల అనుచరుల పైరవీలు, అధికారుల సహకారంతో పట్టణాల్లో అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారు. బీపీఎస్ అమలుకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ త్వరలో మార్గదర్శకాలను విడుదల చేయనుంది. 2025 ఆగస్టు 31కి మునుపు అనుమతులు తీసుకోకుండా చేపట్టిన నిర్మాణాలకు ఈ పథకం వర్తిస్తుంది. సెప్టెంబరు 19న బీపీఎస్‌కు మంత్రివర్గ ఆమోదం లభించాక పట్టణాల్లో అదనపు అంతస్తుల నిర్మాణం ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో 300పైగా భవనాలు అనుమతులకు విరుద్ధంగా, అసలు అనుమతులే లేకుండా నిర్మించినట్లు సమాచారం. పట్టణాల శివారు ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంటోంది.

**ఫోన్ చేస్తూ.. నిర్మిస్తూ..**

చిత్తూరు నగరపాలక సంస్థ కావడంతో.. ఇక్కడ భవన నిర్మాణ అనుమతులకు ప్రభుత్వం నిర్ణయించిన రుసుములు రూ.లక్షల్లో ఉండటంతో



యజమానులు రాజకీయ నేతలతో అధికారులకు ఫోన్లు చేయిస్తున్నారు. ప్రభుత్వానికి ఫీజులు ఎగ్గొట్టి యథేచ్ఛగా అదనపు అంతస్తుల్ని నిర్మిస్తున్నారు.

**నగరంలో ఎక్కడెక్కడంటే..**

నగరంలో ప్రభుత్వ ఐటీఐ ఎదురుగా, రెడ్డిపేటలో, లక్ష్మీనగర్‌కాలనీలో నిర్మిస్తున్న కొన్ని భవనాల్లో అదనపు అంతస్తులకు ఎలాంటి అనుమతి తీసుకోలేదు. మురకంబట్టులో రెండు భవనాలు, మిట్టూరులో రెండు షాపింగ్ కాంప్లెక్స్‌లకు అనుమతుల్లేవని సమాచారం. ఉడిపి హోటల్ సమీపంలోని ఓ భవనంలో ఓ అంతస్తును అక్రమంగా నిర్మిస్తున్నారు. కాసులు అందితే చాలు.. ఎలాంటి నిర్మాణాలైనా చేసుకోండంటూ నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగంలో ఇద్దరు ఇన్‌ఛార్జి భవన ఇన్‌స్పెక్టర్లు భవన యజమానులకు సూచిస్తున్నట్లు సమాచారం.

పట్టణ ప్రణాళిక విభాగం ఉన్నతాధికారులు హైరోడ్డు, గాంధీరోడ్డు విస్తరణ పనుల్లో తలమునకలై ఉండగా.. కిందిస్థాయి సిబ్బంది అందినకాడికి దోచుకుంటున్నారు. కార్యదర్శులకు ఆదేశాలిచ్చాం: శుభశ్రద, పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ-2, చిత్తూరు

బీపీఎస్ పథకానికి విరుద్ధంగా నిర్మించే అదనపు అంతస్తుల్ని నియంత్రించడానికి చర్యలు చేపడతాం. ఇదే అంశంపై వార్డు సచివాలయ ప్రణాళిక కార్యదర్శులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం.

# దారులు పూడ్చేసి.. నిధులు ఊడ్చేసి

నంద్యాల: హంద్రీ నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) కాలువ నుంచి ఎక్కువ నీటిని తరలించడంలో భాగంగా చేపట్టిన పూడికతీత పనులు రైతుల పాలిట శాపంగా మారింది. హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా నీటిని తరలించేందుకుగాను తొమ్మిది ప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాలు ఏర్పాటుచేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సుమారు 80 వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తున్నారు. ప్రధాన కాలువ ద్వారా ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాలతోపాటు వైఎస్సార్ కడప జిల్లా, చిత్తూరు జిల్లాకు సైతం నీటిని తరలించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 3,850 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయాలని ప్రతిపాదించి కాలువ విస్తరణకు చర్యలు చేపట్టింది. ఈ ఏడాది మొదట్లో గుత్తేదారుడికి పనులు అప్పగించారు. 1వ కి.మీ. నుంచి 9వ కి.మీ. వరకు పూడిక తొలగించారు. ఇక్కడే అసలు సమస్య ప్రారంభమైంది.

**తవ్వి.. ఇష్టానుసారంగా పడేసి..**

నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు-వడ్డెమాను మధ్య హెచ్ఎన్ఎస్ఎస్ కాల్వలో పూడికతీత పనులు ఈ ఏడాది మొదట్లో ప్రారంభించారు. 9 కి.మీ. పొడవునా తీసిన పూడిక మట్టిని కొంత కాల్వ గట్టుపైనే వేశారు. నిబంధనల ప్రకారం ఈ మట్టిని జలవనరుల శాఖకు చెందిన రిజర్వు స్థలంలో వేయాలి. అది దూరంగా ఉండటంతో



కాలువలో నుంచి తీసిన పూడికను ఎక్కడికక్కడ వేసుకుంటూ వెళ్లిపోయారు. రైతులు పొలాలకు వెళ్లే మార్గంలోనూ వేశారు. వాహనాలు, ఇంధనం ఖర్చు కలిసివస్తుందన్న ఉద్దేశంతో గుత్తేదారుడు ఇష్టానుసారంగా పడేశారు. పొలాలకు వెళ్లే మార్గంలో అడ్డుగా వేయడంతో వడ్డెమాను గ్రామానికి చెందిన 100 ఎకరాలకు దారి కరవైంది. ప్రస్తుతం దిగుబడులు తీసుకెళ్లే మార్గం లేక రైతులు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చాలా ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

**అదనపు వ్యయం**

పొలాలకు వెళ్లే దారులకు అడ్డుగా పూడిక మట్టి వేయడంతో దీనిని తొలగించేందుకు రైతులు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. దీనిపై జలవనరుల శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యమే. కాలువ వెంబడి పలు ప్రాంతాల్లో ఇష్టానుసారంగా పూడిక మట్టి వేయడంతో నిత్యం సమస్యలు ఎదురవుతున్నాయి.

# గుంతల దారి.. పడతారు జారి

నందికొట్కూరు : రహదారుల నిర్మాణాన్ని గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. కనీసం మరమ్మతులు చేయించలేదు. ఫలితంగా ఎక్కడ చూసినా రోడ్లు అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మరింతగా దెబ్బతిన్నాయి. రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పలు ప్రాంతాల్లో ఆర్అండ్‌బీ, పీఆర్ గ్రామీణ రహదారులు రూపు కోల్పోయాయి.మరమ్మతులు చేయక..నందికొట్కూరు-పగిడ్యాల బీటీ రహదారి గుంతలమయంగా మారింది. ఈ రోడ్డుపై ఒక్క వాహనం వెళ్లాలంటేనే ఇరుకుగా ఉంటుంది. ఎదురుగా వాహనాలు వస్తే ఇబ్బందులే. నందికొట్కూరు-బ్రాహ్మణకొట్కూరు కేజీ (కర్నూలు-గుంటూరు) మార్గం మీదుగా ఓర్వకల్లు పారిశ్రామికవాడకు పైపులైను ఏర్పాటుచేస్తున్నారు. పనులు పూర్తి చేసినా రోడ్డుకు మరమ్మతులు చేయకుండా అలానే వదిలేశారు. రూ.2 కోట్లు కేటాయించినా..నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లోని గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. మిడుతూరు నుంచి గార్గేయపురం వెళ్లే రహదారి 15 కి.మీ. ఉంది. ప్రారంభం నుంచి చివరి వరకు అడుగడుగునా గోతులే. ఈ రహదారి మరమ్మతులకు రూ.2 కోట్లు మంజూరయ్యాయి.

# చరవాణి ఆగమనం.. చూపు మందగమనం



తిరుపతి : రాష్ట్ర ప్రభు త్వం ఇటీవల కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించింది. అందులో 15 శాతం మంది పలు సమస్యలు ఎదుర్కొన్నట్లు నిర్ధారణైంది. మయోపియా కారణంగా పిల్లల్లో కంటిచూపు మందగిస్తున్నట్లు వైద్యులు ధ్రువీకరించారు. చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి సక్రమంగా చదవడం లేదని తండ్రి మందలించేవారు. విషయం ఆరా తీస్తే బోర్డుపై అక్షరాలు సరిగా కనిపించడం లేదని చెప్పడంతో నేత్ర వైద్యుడిని సంప్రదించారు. ఆ విద్యార్థికి మయోపియా ఉన్నట్లు తేల్చారు. బోర్డుపై అక్షరాలు కనిపించకపోవడానికి 80 శాతం మయోపియా.. మరో 20 శాతం హైపర్ మెట్రోపియా కారణమని అంటున్నారు.

నిత్యం 50 నుంచి 70 మంది కళ్ల మసక సమస్యతో వైద్యులను సంప్రదిస్తున్నారు.

**20 - 20 - 20 తెలుసా..!**

పిల్లలు డిజిటల్ పరికరాలు ఉపయోగించే సమయం తగ్గించాలి. మూడేళ్లు కన్నా తక్కువ వయస్సు ఉన్న వారి చేతికి డిజిటల్ పరికరాలు ఇవ్వకూడదు. కంటికి దగ్గరగా పెట్టి చదవడం.. రాయడం చేయరాదు. ప్రతి 20 నిమిషాలు కంప్యూటర్ చూసిన తర్వాత 20 సెకన్లు చూపు మరల్చాలి. 20 అడుగుల దూరంలో ఉన్న ఏదైనా వస్తువును చూడాలి. ఇది కంటి కండరాలను సడలిస్తుంది.

**అంటే ఏంటీ..?**

సాధారణంగా నేత్రాలకు వెయ్యి లక్స్ కంటే ఎక్కువ కాంతి అవసరం. అప్పుడే కళ్లు తేజోవంతంగా పనిచేస్తాయి. అంతకంటే తక్కువ కాంతిలో చదవడం, టీవీలు, కంప్యూటర్లకు అతుక్కుపోతే మయోపియాకు దారి తీస్తుంది. కొందరి పిల్లల్లో పుట్టుకతోనే ఈ సమస్య ఉంటుంది. కొందరికి యుక్త వయసులో వస్తుంది. ఈ సమస్యతో దూరంగా ఉన్న వస్తువులను చూడలేరు. అతి దగ్గర నుంచి తక్కువ కాంతిలో టీవీ, ఫోన్, ట్యాబ్ గంటల తరబడి చూస్తే దీని బారినపడతారు. కొవిడ్ సమయంలో ఎక్కువగా పిల్లలు కంటి సమస్యలకు గురైనట్లు గుర్తించారు.

**ఏం చేయాలి** ఏటా పిల్లలకు నేత్ర పరీక్షలు చేయించాలి. విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లోనూ పాలు పంచుకోవాలి. సహజ సూర్య కాంతి వల్ల మానవ నేత్రం మయోపియాకు గురికాకుండా రక్షిస్తుంది. చరవాణి చూడటం ఆపేయాలి. ఒకరు మయోపియాకు గురైతే వారితో పుట్టిన వారికి పరీక్షలు చేయించాలి. వెంటనే అద్దాలు వాడితే సమస్య తీవ్రత పెరగదు.

**జాగ్రత్తలు తీసుకోవాలి: డాక్టర్ పీఏఎస్ చలపతిరెడ్డి, కంటి వైద్య విభాగాధిపతి, ఎస్వీ వైద్య కళాశాల**

పిల్లల్లో మయోపియా సంకేతాలను గుర్తించడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. బ్లాక్ బోర్డుకు దగ్గరగా వెళ్లి చదువుతున్నారా.. ఇంట్లో దూరపు వస్తువులు చూడలేకపోతున్నారా.. తదితర లక్షణాలు గుర్తించి వెంటనే చికిత్స అందించాలి. ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలు, మాంసం, గుడ్లు, పాలు అన్నీ ఉండేలా చూసుకోవాలి.

# అక్రమాలు పట్టేస్తుంది.. అక్రమార్కులను పట్టిస్తుంది!




చిత్తూరు : ఉపాధి హామీ పనుల కొలతల్లో తేడా చూపి చేసిన పనులనే మళ్లీ చేసినట్లు బిల్లులు పెట్టేందుకు వీల్లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. యుక్తధార జియో స్పేషియల్ ప్లానింగ్ పోర్టల్ ద్వారా సర్వే చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ సిబ్బందికి దీనిపై శిక్షణనిచ్చారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనుల ప్రణాళికను ఇందుకు అనుగుణంగానే సిద్ధం చేస్తున్నారు. సాంకేతిక సిబ్బందికి శిక్షణ పూర్తయింది.

**ముందు కొలతలేసి.. ఆపై పనులు..:** ప్రతి పనిని ప్రత్యేక యాప్‌తో సర్వే చేసి, 50 మీటర్లకు ఒక ఫొటో తీసి, పొడవు, వెడల్పు, లోతు కొలతలను ఆటోమేటిక్ గూగుల్ ఎర్త్ మ్యాప్‌లతో గుర్తిస్తారు. వాటిని కంప్యూటర్‌లో నమోదు చేసి నిబంధనల ప్రకారం నిధులు మంజూరు చేస్తారు. ముందుగా గుర్తించిన ప్రదేశంలో నిర్ణీత కొలతల మేరకే పనులు చేయాలి. అంతకు మించి చేసినా, చేసినట్లు చూపినా బిల్లులు మంజూరు కావు. ఏ రోజుకారోజు చేసిన పనుల కొలతలను అప్‌లోడ్ చేయాలి. చిత్తూరు జిల్లాలో మొత్తం వైకాపా పాలనలో గత ఐదేళ్లలో రూ.3,85,93,652 అక్రమాలు జరిగినట్లు సామాజిక తనిఖీల్లో తేలగా, అందులో రూ.2,53,66,774 రికవరీ చేశారు. ఇంకా రూ.1,32,26,878 రికవరీ చేయాల్సి ఉంది.

**వెలుగు చూసిన అక్రమాల్లో కొన్ని..**

శాంతిపురం మండలం చెంగుబళ్ల పంచాయతీ క్షేత్ర సహాయకుడు అక్రమాలకు పాల్పడినట్లు 16వ విడత సామాజిక తనిఖీలో తేలడంతో అతన్ని సస్పెండ్ చేశారు. జీడీనెల్లూరు మండలంలో 17 విడతల సామాజిక తనిఖీల్లో రూ.8.52 లక్షలు అవినీతి జరిగినట్లు గుర్తించి, రూ.6.12 లక్షలు రికవరీ చేశారు. కుప్పం మండలంలో రూ.11.29 లక్షలు అక్రమాలు గుర్తించి రూ.7.59 లక్షలు రికవరీ చేశారు. గంగవరం మండలంలో రూ.18.67 లక్షలు పక్కదారి పట్టగా రూ.15.07 లక్షలు రికవరీ చేశారు. నగరి మండలంలో అత్యధికంగా రూ.34.99 లక్షలు అక్రమాలు జరిగినట్లు గుర్తించి రూ.25.05 లక్షలు రికవరీ చేశారు. **ఒకసారి చేస్తే మరోసారి చూపడం కష్టం: రవికుమార్, డ్వామా పీడీ** ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు అవకాశం లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. యుక్తధార టూల్‌తో పని ప్రదేశంలో ముందుగానే కొలతలు తీసి అప్‌లోడ్ చేస్తారు. ఏ రోజుకారోజు చేసిన పనిని కొలతలు తీస్తారు. ఒకసారి చేసిన పనిని మరోసారి చేసినట్లు చూపే అవకాశం ఉండదు.

# పట్టణ అవినీతి ప్రణాళిక



తిరుపతి : తిరుపతి నగరపాలక సంస్థ ప్రతిష్ఠను పట్టణ ప్రణాళిక విభాగపు అధికారులు దిగజార్చుతున్నారు. తిరుపతిలో జరుగుతున్న వందల అక్రమ నిర్మాణాలు, వేలాది అనధికారిక కట్టడాలకు కర్త, కర్మ, క్రియ పట్టణ ప్రణాళిక విభాగపు అధికారులనేది బహిరంగ రహస్యమే. అక్రమ కట్టడాలకు సంబంధించి అంతస్తుకో ధర నిర్ణయించి విచ్చలవిడిగా వసూళ్లకు పాల్పడుతున్నా.. అడిగే నాథుడు కరవయ్యాడు.

నగరంలో ఏటా 1,500 వరకు భవన నిర్మాణాలు జరుగుతుంటాయి. అందులో 500 వరకు నగరపాలిక అనుమతి కోసం దరఖాస్తు చేసినా అందులో 90 శాతం అనుమతి పొందిన ప్లాన్ ఉల్లంఘించి నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేస్తున్నారు. నగరంలో ప్రభుత్వ స్థలాలు, కాలువ పోరంబోకు, తితిదే స్థలాలు, నిషేధిత జాబితాలో ఉన్న భూములు ఎక్కువగా ఉండటంతో వాటికి నిబంధనల ప్రకారం అనుమతులు రావు. వీటికి అనుమతుల కోసం పెద్ద మొత్తంలో ప్రభుత్వానికి రుసుములు చెల్లించాల్సి రావడంతో భవన యజమానులు దరఖాస్తు చేయడం లేదు. పట్టణ ప్రణాళిక విభాగపు అధికారులతో గుట్టుగా ఒప్పందం కుదుర్చుకుని వారు అడిగినంత ఇస్తే భవన నిర్మాణం పూర్తయ్యే వరకు వారే బాధ్యత వహించి అక్రమ నిర్మాణానికి అండగా ఉంటారు.

బీపీఎస్-2019 దరఖాస్తులు: 1,408

ఆమోదించినవి: 1,227

తిరస్కరించినవి: 17

దరఖాస్తులో సవరణలు: 159

పెండింగ్: 5

బీపీఎస్‌పై ఆశలు నీరుగార్చుతూ...

వైకాపా పాలనలో తిరుపతి నగరంలోని 4,500 వరకు అక్రమ కట్టడాలకు తాఖీదులు ఇచ్చే ప్రక్రియ ప్రారంభించి వదిలేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఓ మోస్తరు భవనాలకు తాఖీదులు ఇచ్చే ప్రక్రియ ప్రారంభించి అర్ధాంతరంగా ఆపేశారు. ఈ లెక్కన నగరంలో 90 శాతం అక్రమ కట్టడాలే ఉన్నట్లు తెలుస్తోంది. అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం కల్పించిన బీపీఎస్ సౌకర్యాన్ని వినియోగించుకునేందుకు భవన యజమానులు ముందుకు రావడం లేదు. బీపీఎస్ విషయంలో కూడా నగరపాలిక అధికారులు తమ స్వార్థ ఆలోచనలు అమలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. 'మేం రక్షగా ఉంటాం.. భవనం కూల్చివేత జరగనే.. జరగదని.. అనవసరంగా ఎందుకు ప్రభుత్వానికి రుసుములు చెల్లిస్తారు' అంటూ భవన నిర్మాణ యజమానుల్ని బీపీఎస్‌పై నిరుత్సాహానికి గురిచేస్తున్నారు. ఈ క్రమంలో దరఖాస్తులు తక్కువ వస్తున్నట్లు చెబుతున్నారు.

# లాభాలు 'పట్టు'కో

కర్నూలు : మల్బరీ సాగు, పట్టు పురుగుల పెంపకంతో చిన్న, సన్నకారు రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. తక్కువ పెట్టుబడి కావడంతో ఎకరాలో ఏడాదికి నాలుగు పంటల చొప్పున.. రెండెకరాల్లో 8-10 పంటలు సాగు చేయడం ద్వారా నెలనెలా ఆదాయం అందుకుంటున్నారు. ఒకసారి మల్బరీ నాటితే పది నుంచి పదిహేను ఏళ్లపాటు పంట వస్తుంది. ప్రస్తుతం కర్నూలు జిల్లాలో 1,800, నంద్యాల జిల్లాలో 2,098 ఎకరాల్లో పట్టు సాగు చేస్తున్నారు. 2025-26 సంవత్సరానికిగాను కర్నూలు జిల్లాలో 150, నంద్యాల జిల్లా పరిధిలో 250 ఎకరాల్లో కొత్తగా పంట సాగు చేయించాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇందులో భాగంగా ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 75 శాతం రాయితీ అవకాశాన్ని కూటమి ప్రభుత్వం కల్పిస్తోంది. పెరిగిన ధరలకు అనుగుణంగా 50 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పు, 15 అడుగుల ఎత్తు కలిగిన ఒక షెడ్డు నిర్మాణానికి రూ.9 లక్షల నుంచి రూ.10 లక్షలు ఖర్చవుతుంది. దశాబ్దాల కిందట కేంద్రీయ పట్టు మండలి నిర్ణయించిన మేరకు.. ఒక యూనిట్ ధర రూ.4.50 లక్షలుగా నిర్ణయించారు. ఇందులో భాగంగా ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు రూ.4.05 లక్షలు, ఇతరులకు రూ.3,37,500 రాయితీ ఇస్తారు.

పరికరాలు : స్టాండ్లు, నేత్రికలకు కలిపి ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.63 వేలు, ఇతరులకు రూ.56,750 రాయితీ ఇస్తారు. మల్బరీ రైతులకు వ్యవసాయ పరికరాల యూనిట్ ధర రూ.లక్ష కాగా.. ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.90 వేలు, ఇతరులకు రూ.50 వేలచొప్పున రాయితీ ఉంటుంది.

**చేయూతనిస్తూ..**

మల్బరీ తోటల పెంపకానికి రాయితీ ఇస్తున్నారు. ఎకరాకు 5 వేల



మొక్కలు అవసరం కాగా ఒక మొక్క ధర రూ.2 ఉంది. మల్బరీ మొక్కలు, పంట సాగుకు ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి కాగా.. ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.27 వేలు, ఇతరులకు రూ.22,500 రాయితీ అందుతుంది.

**మంచి ఆదాయం లభిస్తుంది**

- డి.ఆంజనేయులు, జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారి, కర్నూలు

ఇతర పంటలతో పోల్చుకొంటే పట్టు సాగు మంచి ఆదాయం ఇస్తుంది. ఏడాదికి ఎకరాకు నాలుగు పంటలు సాగు చేసుకోవచ్చు. పెట్టుబడులు పోను ఎకరాకు రూ.80-90 వేల వరకు ఆదాయం లభిస్తుంది. రైతు మొదట మల్బరీ సాగుతో పాటు షెడ్డు నిర్మించుకోవాల్సి ఉంటుంది. మల్బరీ సాగు నుంచి పట్టుగూళ్ల విక్రయం వరకు పట్టు పరిశ్రమ శాఖ ద్వారా సూచనలు ఇస్తాం.

# టమాటాకు ఆ'ధర'ణ

పత్తికొండ : పత్తికొండ మార్కెట్‌లో టమాటా ధరలు ఆశాజనకంగా ఉంటున్నాయి. మొదట్లో ధర లేకపోవడంతో చాలామంది తీవ్రంగా నష్టపోయారు. పలువురు పంట పొలాల్లోనే వదిలేశారు. మరోవైపు వర్షాల కారణంగా పంట దెబ్బతింది. ఫలితంగా విపణికి సరకు రావడం తగ్గుతోంది. ఈ నేపథ్యంలో ధర ఒకింత బాగుండటంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

**మూడు రోజుల వ్యవధిలో..**

మార్కెట్‌లో మూడు రోజుల వ్యవధిలోనే క్వింటాకు రూ.వెయ్యి అదనంగా ధర పెరిగింది. గత గురువారం వరకు క్వింటా గరిష్ఠ ధర



రూ.2 ఉండగా.. శుక్ర, శని, ఆదివారాల్లో క్వింటా రూ.3 వేలు దాటడం విశేషం. గత మూడు రోజులుగా కనిష్ఠ ధరలు రూ,1,800, రూ.2 వేలు, రూ.2 వేలు పలకగా.. మధ్యస్థ ధర రూ.2,200, రూ.2,400, రూ.2,500గా ఉంది. మూడు రోజుల్లో 473 క్వింటాళ్ల సరకు వచ్చినట్లు యార్డు అధికారులు తెలిపారు. హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్ తదితర ప్రాంతాల్లో టమాటా ధరలు పెరగటంతో వ్యాపారులు సైతం పోటీ పడి సరకు కొనుగోలు చేస్తున్నారు. ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ధరలు అంతకంతకు పెరుగుతున్నాయని అధికారులు తెలిపారు. రానున్న రోజుల్లో ధరలు మరింత ఆశాజనకంగా ఉంటాయని పలువురు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు తమ దిగుబడులను పత్తికొండ మార్కెట్‌కు తీసుకొస్తున్నారు.

# ఆచితూచి.. పొగాకు నాట్లు

పొదిలి: పశ్చిమ ప్రాంతంలోని రైతులు ఆచితూచీ పొగాకు నాట్లు వేస్తున్నారు. ఈ ఏడాది మార్కెట్‌లో ఒడిదుడుకుల నేపథ్యంలో రైతులు నాట్లు వేయడంలో జాగ్రత్త వహిస్తున్నారు.

ఈ ఏడాది 10 ఎకరాలకే పరిమితం

గతంలో బ్యారన్‌కు పది నుంచి 12 ఎకరాలు సాగుచేసిన రైతులు ఈఏడాది పది ఎకరాలకే పరిమితమవుతున్నారు. తుపాను ప్రభావంతో పడిన వర్షాలకు నీరు నిలిచిన పొలాలు ప్రస్తుతం ఆరాయి. దీంతో నాట్లకు అనుకూల వాతావరణం ఏర్పడింది. పొగాకు నారు మూట ధర రూ.6,000 వరకూ పలుకుతోంది. రాజమహేంద్రవరం నుంచి నారు తెచ్చి పశ్చిమ ప్రకాశంలో కొంతమంది రైతులు రాజమహేంద్రవరం ప్రాంతం నుంచి పొగాకు నారు తెప్పించుకుంటున్నారు. స్థానికంగా దొరికే నారు కంటే అక్కడి నారు నాణ్యత బాగుంటుందన్న ఉద్దేశంతో ధర ఎక్కువైనా వెనుకాడటంలేదు. ఎస్ఎల్ఎస్ పరిధిలోని వేలం కేంద్రాల్లో గత ఏడాది బ్యారన్‌కు 42.75 మి.కిలోలు పంటకు అనుమతించగా ఈ ఏడాది 36.65 మి.కిలోలకు తగ్గించారు. పొదిలి వేలం కేంద్రంలో 4332 మంది రైతులు ఉండగా, 2400 బ్యారన్లు ఉన్నాయి. సాగునీటి వనరులు లేక వర్షాలే ఆధారం జిల్లా పశ్చిమ ప్రాంతంలో సాగునీటి వనరులు లేనందున వర్షాధారంపై పండే పొగాకు సాగు వైపే ఈ ప్రాంత రైతులు మొగ్గుచూపుతున్నారు. కాలం కలిసొచ్చి రెక్కల కష్టానికి ఫలితం దక్కుతుండటంతో పొగాకు వైపే ఆసక్తి చూపుతున్నారు. పొదిలి, కనిగిరి, మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాల్లోని రైతులు లాభనష్టాలతో సంబంధం లేకుండా వర్జీనియా పొగాకు సాగుకే అలవాటుపడ్డారు.

# పరిహారం ఇవ్వక.. లీజు సొమ్ము అందక

పుట్టపర్తి: తమ ప్రాంతంలో పెద్ద జలాశయం వస్తుందని సంబరపడిపోయారు. తాము కొంత త్యాగంచేస్తే ఇతర రైతులకూ మేలు జరుగుతుందని తలంచారు. తమకున్నది కొంతే అయినా ప్రజాప్రయోజనం ఆశించి భూమిని ఇచ్చేశారు. లీజుపేరుతో తీసుకొన్న పొలంలో అధికారులు కట్ట నిర్మించేశారు. అయినా నేటికీ ప్రాజెక్టు పూర్తవలేదు. దీంతో జిల్లేడుబండ జలాశయ నిర్వాసితులు అయోమయ పరిస్థితిలో ఉన్నారు. జిల్లేడుబండ జలాశయ నిర్మాణ పనులు రూ.680 కోట్లతో 2021, డిసెంబరులో ప్రారంభమయ్యాయి. తెలంగాణకు చెందిన గుత్తేదారు సంస్థ పనులను దక్కించుకుంది. ముదిగుబ్బ మండలంలోని గుడ్డంపల్లితండా, బుక్కపట్నం మండలంలోని గోపాలపురం గ్రామాలకు చెందిన 30ఎకరాల భూములు కట్ట నిర్మించే ప్రాంతంలో ఉన్నాయి. అందులో వేరుసెనగ, చీనీ, మామిడి ఇతరత్రా పంటలు సాగులో ఉన్నాయి. భూములు లీజుకిస్తే ఎకరాకు ఏడాదికి రూ.30వేల చొప్పున చెల్లిస్తామని, ముంపు భూములన్నింటికీ పరిహారం వచ్చినప్పుడు మీకు కూడా ఇస్తామని గుత్తేదారు చెప్పారు. ఈమేరకు రైతులతో అగ్రిమెంటు తీసుకుని భూములను తీసుకున్నారు. పంటపొలాలన్నీ తొలగించి ఆ ప్రాంతమంతా మట్టితో కప్పి 7.92 కిలోమీటర్ల మేర కట్ట నిర్మించారు.



**కొందరికే...**

అగ్రిమెంటు ప్రకారం మూడేళ్లు రైతుల ఖాతాల్లో లీజు నగదు జమ చేశారు. తర్వాత కొందరికి జమ కాలేదు. జలాశయ ముందు భాగంలో కట్ట నిర్మాణానికి ఖర్చయిన సుమారు రూ.వందకోట్ల వరకు బిల్లులను గుత్తేదారు పూర్తి చేసుకున్నారు. పరిహారంపై వైకాపా ప్రభుత్వం నుంచి స్పష్టత ఇవ్వకపోవడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. తర్వాత ప్రభుత్వం మారడంతో గుత్తేదారు వెనక్కివెళ్లిపోయారు. ఇప్పుడు రైతులకు లీజు డబ్బులు, పరిహారం చెల్లించలేదు. తిరిగి సాగు చేసుకుందామంటే భూములన్నీ కట్టనిర్మాణంలో కలిసిపోయాయి.

ఇటీవల రైతులు.. మంత్రులు సత్యకుమార్ యాదవ్, నిమ్మల రామానాయుడు దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. త్వరలోనే క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించేలా అధికారులను పంపుతామని, ముంపు బాధితులకు న్యాయం చేస్తామని మంత్రులు హామీ ఇచ్చారు.

**అందరికీ న్యాయం జరిగేలా చూస్తాం** భూములు కోల్పోయినవారికి లీజు ప్రకారం గుత్తేదారు ఏటా నగదు చెల్లిస్తున్నారు. జలాశయం ముంపు భూములకు పరిహారం కోసం ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించాము. త్వరలోనే పరిహారం అందేలా తగిన చర్యలు తీసుకుంటాం ఖైలేష్, ఏఈ, నీటిపారుదల శాఖ

# మీ డబ్బు.. మీ హక్కు

విశాఖపట్నం: జిల్లాలో వినియోగించని బ్యాంకు ఖాతాల్లో రూ.195 కోట్ల డబ్బు పోగుబడి ఉందంటే నమ్ముతారా? అవును ఇది వాస్తవం. ఆయా బ్యాంకుల అధికారులు దీన్ని ధ్రువీకరించారు. పదేళ్లు, అంతకు మించి లావాదేవీలు జరగని ఖాతాల్లో ఉన్న నగదును బ్యాంకులు తిరిగిచ్చేస్తున్నాయి. ఈ మేరకు ఆర్‌బీఐ ఆదేశాలిచ్చింది. ఇలా ఏళ్ల తరబడి నిర్వహించని ఖాతాలను డీఈఏఎఫ్ (డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్) అని పిలుస్తారు. ఏయే బ్యాంకుల్లో ఎన్ని ఖాతాలు అలాంటివి ఉన్నాయి, వాటిల్లో ఎంత నగదు ఉందో వివరాలు తెప్పించుకుంది. ఇందులో భాగంగా డిసెంబరు నెలాఖరు వరకు జిల్లాలో అన్ని చోట్ల ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ఆ నగదును వెనక్కి ఇస్తారు.

**ఎవరిని సంప్రదించాలంటే..** ఖాతా ఉన్న బ్యాంకు మరోదాంట్లో విలీనమై ఉంటే ఆ బ్యాంకును సంప్రదించొచ్చు. ఆధార్, పాస్‌పోర్టు, ఓటరు ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాల్లో ఏదో ఒకదాన్ని సమర్పించాలి. పరిశీలన అనంతరం బ్యాంకు ప్రతినిధి ధ్రువీకరించిన తర్వాత ఆ మొత్తం అక్కడే పొందొచ్చు. ఖాతాదారు మృతి చెందితే సంబంధిత కుటుంబ సభ్యులు మరణ ధ్రువీకరణ పత్రం అందజేయాలి

**ఇలా తెలుసుకోవచ్చు..:**

జిల్లాలో డీఈఏఎఫ్ ఖాతాలు 6.22 లక్షలు ఉండగా, వాటిల్లో రూ.195 కోట్ల నగదు నిల్వలు ఉన్నాయని ఎల్‌డీఎం శ్రీనివాస్ తెలిపారు.. నిర్వహణలో లేని ఖాతాలను ఆ బ్యాంకు వెబ్‌సైట్ లింకులోనూ తెలుసుకోవచ్చు. అదేవిధంగా ఆర్‌బీఐ యూడీజీఏఎం పోర్టల్ %https://udgam.rbi.org.in% లోనూ చూడొచ్చు. ఆ డబ్బు తీసుకోండి..: వినియోగించని బ్యాంకు ఖాతాల్లో ఉన్న డబ్బును సంబంధిత వినియోగదారులు సులభంగా పొందొచ్చు. రిజర్వ్‌బ్యాంకు కల్పించిన ఈ అవకాశాన్ని అర్హులు ఉపయోగించుకోవాలి. జిల్లాలోని అన్ని బ్యాంకుల్లో ఆరు లక్షలకుపైగా ఖాతాల్లో డబ్బులు ఉండిపోయాయి. దీనికి సంబంధించి ఇటీవల సిరిపురం ఎస్బీఐ బ్యాంకులో ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించాం. శ్రీనివాస్, ఎల్‌డీఎం, విశాఖ

# బొమ్మల పరిశ్రమపై కదలిక

నక్కపల్లి: పారిశ్రామికంగా జిల్లాను పరుగులు పెట్టిస్తున్న కూటమి ప్రభుత్వం మరో పరిశ్రమ ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తోంది. మంత్రి వంగలపూడి అనిత చొరవతో నక్కపల్లి మండలంలో బొమ్మల తయారీ కంపెనీ స్థాపనకు అడుగులు పడుతున్నాయి.

పరిశ్రమల నిమిత్తం గతంలో సేకరించిన భూముల్లో బల్క్‌డ్రగ్ పార్కు, ఆర్సెలార్ మిత్తల్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటవుతున్నాయి. వీటికి అనుమతులు వచ్చాయి. బల్క్‌డ్రగ్‌కు ప్రధాని మోదీ ఈ ఏడాది జనవరిలో శంకుస్థాపన చేశారు. స్టీల్ ప్లాంట్‌కు తొలి విడతలో 2020 ఎకరాలు కేటాయించారు. రెండో విడతలో మరో మూడు వేల ఎకరాలు ఇవ్వనున్నారు. పరిశ్రమ ఏర్పాటులో భాగంగా క్యాప్టివ్ పోర్టు, టౌన్‌షిప్ నిర్మించనున్నారు.

'పాల్స్ ప్లష్' బొమ్మల పరిశ్రమ ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. దీనిపై కొద్ది నెలల కిందట సీఎం ఆదేశాలతో మంత్రి అనిత సంబంధిత కంపెనీ ప్రతినిధులు, ఉన్నతాధికారులతో మాట్లాడి సమన్వయం చేశారు. ఈ పరిశ్రమ ఏర్పాటుకు సుమారు వెయ్యి ఎకరాల భూమి అవసరమవుతుందని ప్రతిపాదించారు. ఉపమాక, ఎన్.నర్సాపురం, నల్లమట్టిపాలెం, బుచ్చిరాజుపేట తదిరత ప్రాంతాల్లో కేటాయించాలని నిర్ణయించడంతోపాటు ప్రాథమికంగా భూమిని గుర్తించారు. దీనిపై కలెక్టర్ తదితరులతో మంత్రి చర్చించారు.

బొమ్మల పరిశ్రమ ఏర్పాటైతే మహిళలకు వేలాదిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. సుమారు 25 వేల మందికి అవకాశం ఉంటుందని మంత్రి అనిత పలు సందర్భాల్లో ప్రకటించారు. విశాఖలో జరిగిన పెట్టుబడుల సదస్సులో బొమ్మల తయారీ పరిశ్రమ అధ్యక్షుడు అజయ్ సిన్హా ముఖ్యమంత్రితో భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# నెట్టికంటయ్యకు ప్రగతి కళ



గుంతకల్లు : రాష్ట్రంలో ప్రముఖ దేవాలయాల్లో ఒకటైన కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి సన్నిధిలో ప్రగతి పనులు వేగంగా జరుగుతున్నాయి. కొత్త ఈవో చొరవతో భక్తులకు సౌకర్యాలు కల్పించడానికి దాతలు రూ.కోట్లలో విరాళాలు ఇవ్వడంతో పనులు చకచకా సాగుతున్నాయి. ఆయా పనులతో స్వామివారి ఆలయ ప్రాంగణం కళకళలాడుతోంది.

**పట్టాలపై మరికొన్ని..**

దక్షిణ రాజగోపురం ముందర భక్తుల కూర్చోవడానికి సీసీఫ్లోరింగ్ పనులు జరుగుతున్నాయి. తూర్పున ఒక వైపు లడ్డూ తయారీ, ప్రసాదాల కౌంటర్ల గదుల నిర్మాణాలకు పిల్లర్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఆలయ ప్రాంగణంలోకి వాహనాలు రాకుండా దేవస్థానం చుట్టూ ప్రహరీ పనులు సాగుతున్నాయి. బయటే వాహనాల పార్కింగ్‌కు ప్రణాళిక రూపొందించారు. ఆలయానికి సమీపంలోని పార్కులో ఈవో కార్యాలయం, పరిపాలన విభాగం గదుల నిర్మాణాలు చేపట్టనున్నారు. చేపడుతున్నారు.

**తాజాగా పూర్తయివి..**

ఆలయ పశ్చిమన, ఉత్తరం వైపుల సీసీరోడ్ల నిర్మాణాలు చేపట్టారు. ఆలయ దక్షిణ రాజగోపురం ఎదురుగా సీసీరోడ్డులో సెంట్రల్ లైటింగ్స్ ఏర్పాటు చేశారు. రాజ గోపురాలకు పంచరంగులు వేశారు. ఆలయ పరిసరాల్లో వివిధ జాతుల మొక్కలు నాటించారు. రెండు వారాల కిందట రాజగోపురాలకు 18 కలశాలు ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు.

**గుట్టపై భక్తుల వసతి గదుల నిర్మాణం**

దాతల సహకారంతో గుట్టపై 91 వసతి గదుల నిర్మాణాలను చేపడుతున్నాం. పనులకు తొందరలో పరిపాలన విభాగం నుంచి అనుమతులు రానున్నాయి. త్వరలోనే విమాన గోపురం, గర్భాలయం, ముఖ మండపం పనులు మొదలవుతాయి. వెంకటేశ్వరుడు, ఏఈవో, కసాపురం ఆలయం

# కాలువ గట్టులో మట్టి దందా



బొమ్మనహాళ్ : ఆంధ్రా సరిహద్దు బొమ్మనహాళ్ సమీపంలో హెచ్చెల్సీ గట్టు పక్కన భారీ ఎత్తున మట్టి తవ్వకాలు కొనసాగుతుండటంతో ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజులుగా గట్టుచప్పుడు కాకుండా తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఆదివారం అధికారులు సెలవుల్లో ఉంటారని దళారులు మరింతగా రెచ్చిపోయి మట్టిని పెద్దమొత్తంలో తవ్వి కర్ణాటకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా.. అధికారులు మాత్రం ఎవరికి వారు తమ పరధిలోకి రాదని మిన్నకుండిపోతున్నారు. ఈ ప్రాంతం తమ పరిధిలో లేదని కర్ణాటక అధికారులు.. మా పరిధిలోకి రాదని స్థానిక అధికారులు.. ఇలా ఒకరిపై మరొకరు పేర్కొంటున్నారు. కనీసం తవ్వకాల ప్రాంతాన్ని పరిశీలించకపోవడం గమనార్హం.

**గిరాకీ ఉండటంతో..**

మట్టికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉండటంతో అక్రమార్కుల కన్ను హెచ్చెల్సీపై పడింది. గట్టు సమీపంలో మట్టి తీయగా ఏర్పడిన పెద్ద గుంతల్లో నీటి ఊట చేరుతుండటం ప్రమాదానికి సంకేతమని రైతులు వాపోతున్నారు. దీనివల్ల కాలువ గట్టు బలహీనపడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టిప్పర్లలో మట్టి కళ్లముందే తరలిపోతున్నా.. ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.

**అధికారులు ఏమంటున్నారంటే..**

హెచ్చెల్సీ కాలువ పక్కన మట్టి తవ్వకం సమాచారం తెలియడంతో ఆదివారం రాత్రి వెళ్లి పరిశీలించి.. నీటిపారుదల అధికారులకు సమాచారం ఇచ్చామని తహసీల్దారు మునివేలు, ఎస్సై నబిరసూల్ పేర్కొన్నారు. హెచ్చెల్సీ ఏఈఈ అల్తాఫ్ మాట్లాడుతూ కాలువ గట్టు తుంగభద్ర బోర్డు పరిధిలోకి వస్తుందని.. సోమవారం పరిశీలించి.. బోర్డు దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

# కృష్ణదేవరాయా.. సెర్చ్‌కే పరిమితమా?



పుట్టపర్తి : శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో 16 నెలలుగా ఇన్‌ఛార్జి ఉపకులపతి పాలన కొనసాగుతోంది. కొత్త వీసీ నియామకానికి సెర్చ్ కమిటీది కీలకపాత్ర. రెండుసార్లు కమిటీలు ఎంపికయ్యాయి. ఉపకులపతి నియామకం మాత్రం జరగలేదు. వివిధ కారణాలతో రెండు సార్లు సెర్చ్ కమిటీలు రద్దు అయ్యాయి. మూడోసారి నియమిస్తేనే ప్రక్రియ కొనసాగుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు ఇన్‌ఛార్జి వీసీలు నియమితులయ్యారు. అదే క్రమంలో గతేడాది జులై 18న ఎస్కేయూ ఎంబీఏ విభాగానికి చెందిన ఆచార్య అనిత ఇన్‌ఛార్జిగా నియమితులయ్యారు. ఆరు నెలల్లోనే ఇతర వర్సిటీలకు రెగ్యులర్ ఉపకులపతులు నియామకం జరగగా.. కేవలం రెండు విద్యాలయాలకు భర్తీ చేయలేదు. అందులో ఎస్కే ఒకటి కావడం గమనార్హం. మొదటి సారి 2024లో సెర్చ్ కమిటీ నియమించారు. అప్పట్లో పలువురు ఉపకులపతి పదవికి దరఖాస్తు చేశారు. వాటిని పరిశీలించిన తరువాత నియామక ప్రక్రియ ఆగిపోయింది. రెండోసారి జులై, 3న కొత్త సెర్చ్ కమిటీ నియమించారు. ఇందులో రాయ్‌పూర్ ఐఐఎంకి చెందిన రామకుమార్ కాకాని, గీతం విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్య శివప్రసాద్, లక్నో వర్సిటీ వీసీ అలోక్ కుమార్‌రాయ్ ఉన్నారు. అందులో ఓ సభ్యుడు కమిటీ నుంచి తప్పుకున్నారు. దీంతో మూడోసారి కమిటీ నియమించాల్సిన అవసరం ఏర్పడింది. సాధారణంగా కమిటీలో ముగ్గురు సభ్యులు ఉంటారు. ఒక సభ్యుడిని వర్సిటీ పాలకమండలి ఎంపిక చేస్తుంది. మరో సభ్యుడిని ప్రభుత్వం, మూడో సభ్యుడిని యూజీసీ నియమిస్తుంది. వారి దరఖాస్తులను పరిశీలించి ముగ్గురు అభ్యర్థులను ఉపకులపతి పదవికి సిఫారసు చేస్తారు. వారి పేర్లను ప్రభుత్వం గవర్నర్‌కు పంపుతుంది. గవర్నర్ ఆమోదంతో ఒకరు ఉపకులపతిగా నియమితులవుతారు.

**ఆశావహుల పోటీ** ఎస్కేయూ ఆచార్యులు, విశ్రాంత ఆచార్యులు మొత్తం 11 మంది పదవిని ఆశిస్తున్నారు. వీరే కాకుండా ఇతర వర్సిటీ ఆచార్యులు కూడా పదవి కోసం దరఖాస్తు చేసుకొన్నట్లు సమాచారం. వివిధ సామాజిక వర్గాలకు చెందిన వారు తమ వర్గానికే వీసీని నియమించాలని కోరుతున్నారు. అకడమిక్ అంశాలు, పరిశోధనలు, ప్రగతి పనులు.. వంటివి రెగ్యులర్ వీసీ నియామకంతో ముడిపడి ఉన్నాయి. పాలనలో కొత్త విధానాలు అమలులోకి వస్తాయి.

# గమ్య నగరం.. పెట్టుబడుల స్వర్గధామం!

విశాఖపట్నం: విశాఖలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సు పారిశ్రామికవేత్తలను విశేషంగా ఆకర్షించింది. రాష్ట్రానికి అంచనాలకు మించి పెట్టుబడులు రాగా అందులో విశాఖకు సింహభాగం వచ్చాయి. ప్రధానంగా ఐటీ, ఆతిథ్య, పర్యాటక రంగంతో పాటు ఆహార శుద్ధి రంగంలోనూ పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడిదారులు వరుస కట్టారు. ఫలితంగా ఈ సమ్మిట్‌కు ముందు.. తర్వాత అన్న తరహాలో విశాఖ నగరం ఎదగనుందని నిపుణులు భావిస్తున్నారు. రాష్ట్రానికి వస్తున్న మొత్తం పరిశ్రమల్లో 30 నుంచి 40 శాతం వరకు విశాఖ కేంద్రంగా ఏర్పాటు కానున్నాయి. వీటిల్లో దిగ్గజ సంస్థలతో పాటు స్థానికులవీ ఉన్నాయి.

**సాఫ్ట్‌వేర్, ఇతర కంపెనీలు..**

సెయిల్స్ సాఫ్ట్‌వేర్
ఐ స్పేస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్
టెక్ తమ్మిన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్
ఫినోమ్ పీపుల్స్ ప్రైవేట్ లిమిటెడ్
రహేజా ఐటీ స్పేస్, రెసిడెన్షియల్ ప్రాజెక్టు
రెన్యూ ఎనర్జీ సంస్థ
ఏర్పాటు కానున్న డేటా సెంటర్లు
రూ.1.33 లక్షల కోట్లతో వెయ్యి మెగావాట్ల గూగుల్..
రూ.1.10 లక్షల కోట్లతో వెయ్యి మెగావాట్ల రిలయన్స్..
రూ.1.10లక్షల కోట్లతో వెయ్యి మెగావాట్ల బ్రూక్‌ఫీల్డ్..
రూ.15వేల కోట్లతో టిల్‌మాన్ గ్లోబల్ హోల్డింగ్స్.

పర్యాటక రంగంలో రూ.10వేల కోట్లు..: ఆతిథ్య, పర్యాటక రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలు జిల్లాలో విభిన్న ప్రాజెక్టుల ఏర్పాటుకు



ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ముఖ్యంగా థీమ్‌పార్క్‌లు, జల విన్యాసాలు, హోటళ్లు, రిసార్టులు, వైద్య పర్యాటకం, వెల్‌నెస్ సెంటర్లు, డెస్టినేషన్ వెడ్డింగ్, హోంస్టే, సాహస క్రీడల రంగాల్లో పెట్టుబడులకు ఆసక్తి చూపారు. ఈ రంగంలో సుమారు రూ.10వేల కోట్ల ప్రాజెక్టులు ఒక్క విశాఖ కేంద్రంగానే ఏర్పాటు కానున్నాయి.

ఒప్పందాలు జరిగిన రంగాలు: 12
జిల్లాకు వచ్చే పెట్టుబడుల అంచనా : రూ.4 లక్షల కోట్లు
లభించే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు: 5 లక్షలు

ఏఐ సాంకేతికతపై పనిచేస్తాం..
ఎస్.కిరణ్, సీఈవో, సెయిల్స్ సాఫ్ట్‌వేర్

ఐటీ హిల్స్‌పై సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ఏఐ సాంకేతికతపై పనిచేసేలా కంపెనీని విస్తరిస్తున్నాం. ఇటీవల మంత్రి నారా లోకేశ్ భూమి పూజ చేశారు. సుమారు 600 మందికి ఉపాధి కల్పిస్తాం. సీఐఐ భాగస్వామ్య సదస్సుతో స్థానిక ఐటీ కంపెనీలకు మంచి గుర్తింపు లభించింది.

**త్వరలో మరిన్ని కంపెనీల ఒక..**

హరేంధిరప్రసాద్, కలెక్టర్, విశాఖ

సీఐఐ భాగస్వామ్య(సమ్మిట్) సదస్సుతో విశాఖకు అంతర్జాతీయ గుర్తింపు వచ్చింది. ఐటీ, పర్యాటకరంగాల్లో అధిక శాతం పెట్టుబడులు వచ్చాయి. ఈ రంగాల్లో ప్రస్తుతానికి జిల్లాలో 1.5 లక్షల నుంచి 2 లక్షల మందికి ఉపాధి లభించొచ్చు. త్వరలోనే మరికొన్ని కంపెనీలు కార్యకలాపాలు ప్రారంభించనున్నాయి. తద్వారా జిల్లాలో మొత్తం ఐదు లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

# తోతాపురి.. బకాయిలెప్పుడో మరి..?



పుత్తూరు : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మామిడి రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం తోతాపురి టన్నుకు రూ.4 వేలు అందజేస్తే.. గుజ్జు పరిశ్రమలు చెల్లించాల్సిన రూ.8 వేలు నేటికీ జమ చేయలేదు. కొన్ని పరిశ్రమలు టన్నుకు రూ.5 వేల కంటే ఎక్కువ ఇవ్వలేమని చెప్పినా ఆ మొత్తాన్ని ఎప్పుడిస్తాయో పేర్కొనడం లేదు. మరికొన్ని బకాయిల ఊసే ఎత్తడం లేదు.. రైతు సంఘాల ప్రతినిధులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నా యంత్రాంగానికి చీమకుట్టినట్లయినా లేదు. పుత్తూరు మండలం కేబీఆర్‌పురానికి చెందిన 50 మంది రైతులు కార్వేటినగరం, పుత్తూరు, నారాయణవనం మండలాల్లోని మామిడి గుజ్జు పరిశ్రమలకు తోతాపురి కాయలు తోలారు. కార్వేటినగరంలోని ఏబీసీ గుజ్జు పరిశ్రమ రైతులకు టన్నుకు రూ.5 వేలు ఖాతాల్లో జమ చేసింది. మిగిలిన పరిశ్రమలు ఇప్పటివరకు రూపాయి ఇవ్వకపోగా అసలు ఎప్పుడిస్తామనేది చెప్పడం లేదు. ఈ గ్రామ రైతులకు రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షలు బకాయిలు రావాలి.

వెదురుకుప్పం మండలానికి చెందిన రైతులు జీడీ నెల్లూరులోని గుజ్జు పరిశ్రమకు కాయలు తరలించారు. ఆ కర్మాగార యాజమాన్యం విడతల వారీగా బిల్లులు చెల్లిస్తోంది. ఈ పరిశ్రమ ఎదుట రైతు సంఘం నాయకులు ధర్నా చేసి బకాయిలు ఇవ్వాలని కోరినా స్పందించలేదు.

**పరిశ్రమలకే లాభాలు**

ఉమ్మడి జిల్లాలో మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులు రెండు విధాలా లాభపడ్డా.. అన్నదాతలకు బకాయిలు మాత్రం చెల్లించడం లేదు. తోతాపురి కాయలను ప్రభుత్వ ధరకు కొనకపోవడం, నాలుగు నెలలుగా బిల్లులు ఇవ్వకుండా వడ్డీ పరంగా యాజమాన్యాలు లాభపడుతున్నాయి. రైతులు మాత్రం రెండు విధాలా నష్టపోయారు. పరిశ్రమల యజమానులు తమవద్ద తయారైన గుజ్జు ఎగుమతి కాలేదని, రైతుల బకాయిలకు బ్యాంకుల్లో రుణం తీసుకుని చెల్లించాలని యోచిస్తున్నట్లు చెప్పి తప్పించుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో విస్తీర్ణం: 1.12 లక్షల హెక్టార్లు
తోతాపురి సాగు: 55 వేల హెక్టార్లు
ఈ ఏడాది దిగుబడి: 5.5 లక్షల టన్నులు
పరిశ్రమలు కొనుగోలు చేసినది: 5.5 లక్షల టన్నులు
బకాయిలు రావాల్సినది: 2.5 లక్షల టన్నులుబకాయిల మొత్తం: రూ. వంద కోట్లు (టన్నుకు కనీసం రూ.4 వేల చొప్పున చెల్లిస్తే)ఏదీ నాటి చొరవ గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో సీజన్ మొదలు నుంచి బకాయిల జమ వరకు కలెక్టర్లు చొరవ తీసుకుని సమన్వయ సమావేశాలు నిర్వహించి నగదు జమయ్యేలా చేసేవారు. నేడు ఆ పరిస్థితే లేదు. మొక్కుబడి సమావేశాలు మినహా రైతుల కన్నీరు తుడిచిన దాఖలాల్లేవు.

# ఇటు కొల్లేరు.. అటు ఉప్పుటేరు

ఆకివీడు: నాలుగు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తోన్న వర్షాలకు కొల్లేరు, ఉప్పుటేరుకు పెద్దఎత్తున వరద వచ్చి చేరుతోంది. తమ్మిలేరు, రామిలేరు, బుడమేరుతో పాటు మరో 24 డ్రెయిన్ల ద్వారా ఒకేసారి పెద్ద ఎత్తున నీరు కొల్లేరుకు చేరడంతో నిండు కుండలా తయారైంది. వరద ప్రవాహం అంతకంతకు పెరగడంతో పెనుమాకలంక – పెదఎడ్లగాడి రోడ్డుపై నుంచి రెండు చోట్ల 200 మీటర్ల వరకు నీరు ప్రవహిస్తోంది.


పెనుమాక లంకకు వెళ్లే దారిని మూసివేశారు. మరోపక్క పెద ఎడ్లగాడి వంతెన వద్ద భారీఎత్తున గుర్రపు డెక్క, తూడు వంతెనకు అడ్డంగా ఉండిపోవడంతో పెనుమాకలంక, నందిగామ లంక, ఇంగిలిపాక లంక, పులపర్రు, నుచ్చుమిల్లి, తక్కెళ్లపాడు వరకు వరద చేరింది. ఇప్పటికే



పెనుమాకలంకకు వెళ్లాలంటే గ్రామస్థులు ఏర్పాటు చేసుకున్న యంత్రం పడవే గతి. ఉదయం ఒకసారి, సాయంత్రం మరోసారి ఈ పడవ అందుబాటులో ఉంటుంది. గ్రామాల్లో వీఆర్వోలు అందుబాటులో ఉంటూ వరద తెలియజేయాలని ఇన్‌ఛార్జి తహసీల్దారు గోపాల్ ఆదేశించారు. కొల్లేరులో కలుస్తున్న వేల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి కలిసే ఏకైక మార్గం పశ్చిమ–ఏలూరు జిల్లాల సరిహద్దు ప్రాంతంలోని ఉప్పుటేరు మాత్రమే. అయితే ఇది ఆక్రమణలకు గురై, అనేక ఏళ్లుగా మట్టిపూడికతీత పనులు చేయక సామర్థ్యం తగ్గింది. దీంతో వేలాది ఎకరాల వరిచేలతో పాటు వందలాది ఎకరాల ఆక్వా చెరువులు ముంపు బారిన పడుతున్నాయి.

# వాగులు.. వంకలు ఏకమై

రాచర్ల : నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా గురువారం అర్ధరాత్రి నుంచి వరకు విస్తారంగా వర్షాలు కురిశాయి. పలు మండలాల్లో వాగులు, వంకలు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో గ్రామాల మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రాచర్ల, అర్ధవీడు మండలాల్లోని వాగులతోపాటు గిద్దలూరు మండలం కృష్ణంశెట్టిపల్లె వద్ద సగిలేరు, ఒంగోలు మండలం గుత్తి కొండవారిపాలెం వద్ద ముదిగొండ, సంతనూతలపాడు, కొండపి మండలాల్లోని వాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. ఒంగోలు–మంగమూరు మధ్య నల్ల కాలువ, మార్కాపురం మండలం పెద్ద నాగుల వరం సమీపంలోని గుండ్లకమ్మ, నాగులుప్పలపాడు మండలంలోని కొత్తకోట వాగు,



పామూరు మండలం బోడవాడ సమీపంలో దుప్పలమంద వాగులు పరవళ్లు తొక్కుతున్నాయి.

ఒంగోలు నగరంలోని శివారు కాలనీలతోపాటు సముద్ర తీర గ్రామాల్లోని లోతట్టు కాలనీల్లో వర్షపునీరు నిలిచిపోయింది. వాగులు, వంకల మీదుగా ప్రజలు రాకపోకలు సాగించకుండా పోలీసు, రెవెన్యూశాఖల అధికారులు, సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. పలుచోట్ల అత్యధిక వర్షపాతం నమోదవ్వడంతో లోతట్టు కాలనీల్లో సహాయక చర్యలు చేపట్టారు. సముద్రతీర మండలాల్లోని తహసీల్దారు కార్యాలయాల్లో కంట్రోల్ రూంలు కొన సాగుతున్నాయి. పునరావస కాలనీల్లో పంచాయతీ, పురపాలక, రెవెన్యూశాఖలు సహాయక చర్యలు చేపట్టగా, వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. భారీ వర్షాల దృష్ట్యా జిల్లాలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు కలెక్టర్ రాజాబాబు సెలవు ప్రకటించారు.

# భక్తుల కోరిక కార్యరూపం

మర్రిపూడి : జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పృథులగిరి లక్ష్మీనృసింహ స్వామి దేవాలయ ఘాట్‌రోడ్డు నిర్మాణానికి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి చొరవతో రూ.4 కోట్లు మంజూరయ్యాయి. నిధులతో ఘాట్‌రోడ్డు నిర్మాణానికి అధికారులు చర్యలు ప్రారంభించనున్నారు.

**2 కి.మీ. నడిచి కొండపైకి వస్తున్నారు**

దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ దేవాలయం ఎత్తయిన కొండలపైన ఉంటుంది. రహదారి సౌకర్యం లేకపోవటంతో భక్తులు నాటి పురాతనమైన మెట్లపై నుంచి సుమారు రెండు కిలోమీటర్లు నడిచి కొండపైకి చేరుకుని స్వామివారిని దర్శించుకునేవారు. దీంతో వృద్ధులు, వికలాం



గులు, భక్తులు ఇబ్బంది పడేవారు. కొనేళ్ల క్రితం కొండను తొలిచి చదును చేశారు. కొండపైకి ఘాట్‌రోడ్డును నిర్మించాలని భక్తులు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రిగా బాధ్యతలు చేపట్టిన స్వామి, రాష్ట్రమారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పృథులగిరి లక్ష్మీనృసింహ స్వామి దేవాలయం అభివృద్ధికి కృషి చేస్తామని, గతంలో ఎమ్మెల్యే, తితిదే దేవస్థాన సభ్యునిగా ఉన్న సమయంలోనే తితిదే నుంచి దేవస్థాన అభివృద్ధికి రూ.25 లక్షలు మంజూరు చేయించామని తెలిపారు. దాతల సహకారంతో దేవస్థాన అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. త్వరలోనే ఘాట్‌రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఘాట్‌రోడ్డు నిర్మాణా నికి నిధులు మంజూరు కావటంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

# స్కిట్ ఆశలపై నీళ్లు..!




శ్రీకాళహస్తి : స్కిట్ ఇంజినీరింగ్ కళాశాల జేఎన్‌టీయూ అనంతపురంలో విలీనమైందని, విద్యార్థులకు ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని ఆశలు పెంచుకున్నారు. స్కిట్ విలీన ప్రక్రియ పూర్తవడం, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు మళ్లీ స్కిట్‌కు పూర్వ వైభవం వస్తుందని ఆశపడ్డారు. తొలుత 68 మంది దరఖాస్తులు చేసుకోగా ఇక్కడి పరిస్థితులను అధ్యయనం చేసిన 25 మంది ప్రైవేటు కళాశాలల్లో చేరిపోయారు. తరగతులు నిర్వహిస్తారని ఇన్నాళ్లపాటు నిరీక్షించిన తల్లిదండ్రులు, విద్యార్థులకు యాజమాన్యం ఝలక్ ఇచ్చింది. ఇప్పట్లో తరగతులు నిర్వహించలేమని, కలికిరికి వెళ్లాల్సిందేనని జేఎన్‌టీయూఏ యాజమాన్యం స్పష్టం చేయడంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

**కాలయాపనపై అనుమానాలు..**

మూడు నెలల క్రితం అన్ని ప్రైవేటు కళాశాలల్లో తరగతులు ప్రారంభమయ్యాయి. జేఎన్‌టీయూఏ సొంత కళాశాలల్లోనూ రెండు నెలల క్రితమే ప్రారంభమైనా స్కిట్‌లో మాత్రం తరగతులు ప్రారంభించకుండా కాలయాపన చేస్తుడటంపై విద్యార్థులు, తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తూనే వచ్చారు. ఐఐటీ, ఐసర్ వంటి విద్యా సంస్థలు శాశ్వతమైన భవనాలు, మౌలిక వసతులు లేకున్నా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టి కళాశాలలను నడిపారని, స్కిట్ విషయంలోనూ అదే జరుగుతుందని ఆశపడ్డారు.

**తల్లిదండ్రులు అవాక్కు..**

స్కిట్‌ను జేఎన్‌టీయూఏలో విలీనం చేస్తూ ప్రభుత్వం నాలుగు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జేఎన్‌టీయూఏ తరఫున కలికిరి ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు ఇక్కడి ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టారు. కళాశాలకు మంచి రోజులు వచ్చాయని, విద్యార్థులు, తల్లిదండ్రులు శుక్రవారం యాజమాన్యాన్ని కలసి తరగతులు ఎప్పుడు ప్రారంభిస్తారని అడగడం, మరో ఆరు నెలలు పడుతుందని, అప్పటి వరకు విద్యార్థులను కలికిరి కళాశాలకు పంపాలని చెప్పడంతో తల్లిదండ్రులు అవాక్కయ్యారు. ఇన్నాళ్లపాటు వేచిచూసిన తర్వాత ఇప్పుడు ఇలా చేతులెత్తేయడంపై తీవ్ర ఆవేదనకు గురయ్యారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

'ప్రభుత్వ పరంగా స్పష్టమైన ఉత్తర్వులు రావాల్సి ఉంది. తరగతుల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశాం. తప్పనిసరిగా ఈ ఏడాది నుంచి తరగతులు ప్రారంభిస్తాం".

సుదర్శనరావు, ఉపకులపతి, జేఎన్‌టీయూఏ

'స్కిట్‌ను జేఎన్‌టీయూఏలో విలీనం చేయాలన్నది తమ అభిమతం. అందుకు ప్రభుత్వ పరంగా ఎంతో శ్రమించి ఆ తంతును పూర్తి చేశాం. ఇక నిర్ణయాలన్నీ జేఎన్‌టీయూఏ అధికారులవే. ప్రభుత్వం స్కిట్ కొనసాగింపునకు అన్ని చర్యలు చేపట్టింది. ఇక విద్యార్థులు ఆందోళన పడాల్సిన అవసరం లేదు. ఈ ఏడాది నుంచి తరగతులు తప్పనిసరిగా జరుగుతాయి'బొజ్జల సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్యే, శ్రీకాళహస్తి

# శాంతినగరం.. కొలువుల గ్రామం



ఆళ్లగడ్డ : ఉద్యోగం సాధించడం ప్రతి ఒక్కరి కల. కుటుంబంలో ఒక్కరికైనా ఉద్యోగం వస్తే బాగుంటుందని తలుస్తుంటారు. ఆ ఊహను నిజం చేస్తూ ఆ ఊరిలో ప్రతి ఇంటా ఉద్యోగులు ఉన్నారు. అళ్లగడ్డ మండలంలోని శాంతినగరం గ్రామానికి ప్రత్యేకత ఉంది. బత్తలూరు మజారా గ్రామంగా 1962లో ఇది ఏర్పాటైంది. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెం గ్రామం నుంచి కొన్ని కుటుంబాలు వలస వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. అప్పట్లో మౌలిక సదుపాయాలు లేకపోయినా పిల్లలకు చదువు ముఖ్యమని పెద్దలు బడిబాట పట్టించారు. పాఠశాల 6 కి.మీ. దూరం ఉన్నప్పటికీ పశు పోషణ, వ్యవసాయం చేసుకుంటూ పిల్లలకు చదువులు చెప్పించారు. ఫలితంగా ప్రతి ఇంటా ఉద్యోగులు తయారయ్యారు.

**120 కుటుంబాలు.. 150 మంది ఉద్యోగులు**

శాంతినగరంలో 120 కుటుంబాలు ఉన్నాయి. ప్రతి ఇంటికి ఒకరు, ఇద్దరు ఉద్యోగాలు సాధించడంతో 150 మంది ఉద్యోగులు ఉన్నారు. పోలీసుశాఖలో 4, సాఫ్ట్‌వేర్ రంగంలో 40 మంది, ఆడిటర్లు 18తో పాటు పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు సాధించారు. అమెరికా, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాలో 10 కుటుంబాలు ఉండగా, మిగిలిన వారు హైదరాబాద్, చెన్నై, బెంగళూరులో ఉద్యోగాలు చేస్తున్నారు. ఊళ్లో మొట్టమొదటి సారి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా చిట్టెమ్మ ఉద్యోగం సాధించారు. ఆ తర్వాత వరుసగా ఆర్టీసీలో ముగ్గురు మహిళలకు ఉద్యోగాలు రావడంతో గ్రామస్థులు వారిని ఆదర్శంగా తీసుకొని విద్యకు పెద్దపీట వేశారు. క్రమంగా పిల్లలు ఉన్నత చదువులు చదివి పలు ఉద్యోగాలు స్థిరపడటంతో శాంతినగరం కాస్తా ఉద్యోగుల గ్రామంగా పేరు వచ్చింది.

**విద్యతోనే మార్పు: శ్రీనివాసరావు, గ్రామస్థుడు**

విద్య ప్రాధాన్యాన్ని గుర్తించిన గ్రామస్థులు వ్యవసాయం, పశుపోషణ సాగిస్తూనే పిల్లలకు ఉన్నత చదువులు చదివించారు. ప్రతి ఇంట్లో ఒకరు లేదా ఇద్దరు ఉద్యోగాలు సాధించారు. ప్రైవేట్, ప్రభుత్వ రంగాల్లో ఉద్యోగాలు చేస్తూ కొందరు దూర ప్రాంతాల్లో స్థిర పడ్డారు. మౌలిక వసతులు లేకపోయినా పిల్లల అభ్యున్నతికి కృషి చేశారు.

# శ్రద్ధగా చదువుదాం.. ప్రోత్సాహం అందుకుందాం



నూజివీడు : ఎస్సీ విద్యార్థులు సీబీఎస్‌ఈ అనుబంధ ప్రైవేటు రెసిడెన్సియల్ పాఠశాలల్లో 9, 11 తరగతుల్లో ఉచిత ప్రవేశానికి కేంద్ర సామాజిక న్యాయ, సాధికార మంత్రిత్వ శాఖ 'శ్రేష్ఠ' పథకాన్ని అమలు చేస్తోంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పరీక్ష ద్వారా దేశవ్యాప్తంగా మూడు వేల మందికి అవకాశం కల్పిస్తారు. ఈ మేరకు నేషనల్ ఎంట్రన్స్ టెస్ట్ ఫర్ ఎక్స్‌లెన్స్–2025కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఎంపికైన వారికి పాఠశాల, హాస్టల్ ఫీజులను మెస్ ఛార్జీలతో సహా ప్రభుత్వం చెల్లిస్తుంది.

**అర్హతలు..**

విద్యార్థి భారత దేశ పౌరుడై ఉండాలి.
ప్రస్తుతం ఎనిమిది, పదో తరగతి చదువుతున్నవారు అర్హులు.
తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2.5 లక్షలు మించకూడదు.
ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
అక్టోబర్ 30 సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంది.

**పరీక్ష విధానం..**

డిసెంబర్‌లో ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు.
సమయం 3 గంటలు. మొత్తం 100 ప్రశ్నలు (ఆబ్జెక్టివ్) ఉంటాయి.
ఒక్కో ప్రశ్నకు 4 మార్కులు చొప్పున మొత్తం 400 మార్కులుగా నిర్ణయించారు.
పరీక్ష ఆంగ్లం, హిందీ భాషల్లో ఉంటుంది.
ఇదీ సిలబస్..
తొమ్మిదో తరగతి పరీక్ష కోసం 8వ తరగతి ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్, 11వ తరగతి పరీక్ష కోసం పదో తరగతి ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ ఉంటుంది. గణితం, సైన్స్, సోషల్ సైన్స్, జనరల్ అవేర్‌నెస్ నాలెడ్జ్ అంశాలు ఉంటాయి. దరఖాస్తుకు %https://exams.nta.nic.in/registrationforshreshta2026examination% వెబ్‌సైట్‌లో సంప్రదించాలి.

సద్వినియోగం చేసుకోవాలి.. అర్హులైన విద్యార్థులు శ్రేష్ఠ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. దీనిపై పాఠశాలల్లో ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలి.
ఎం.వెంకటలక్ష్మమ్మ, డీఈవో

# రక్షణ గోడ..గడువుల గాథ!

నెల్లూరు : రెండు సాగునీటి కాలువల పటిష్ఠతకు చేపట్టిన రక్షణ గోడల నిర్మాణాలు అసంపూర్తిగా ఉండిపోయాయి. మొదట్లో అంచనాలు, ఆ తరువాత బిల్లుల సమస్యతో పనులు ముందుకు సాగలేదు. గత ప్రభుత్వం పట్టించుకోక ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. నెల్లూరు నగరంలోని పెన్నా వారధి నుంచి సర్వేపల్లి, కృష్ణపట్నం ప్రాంతాలకు సాగునీటిని తీసుకెళ్లే సర్వేపల్లి కాలువకు 0.6 కి.మీ. నుంచి 3.3 కి.మీ. హరనాథపురం వరకు ఇరువైపులా రక్షణ గోడల నిర్మాణానికి రూ.110 కోట్లతో అంచనాలు తయారు చేయగా... రూ.87కోట్ల అగ్రిమెంట్‌తో పనులు ప్రారంభమయ్యాయి. ఏళ్లు గడుస్తున్నా.. పనులు పూర్తికానంటున్నాయి. పనులకు 2022లో టెండర్లు పూర్తై 24నెలల కాలపరిమితితో గుత్తేదారుకు పనులు అప్పగించారు. నిర్మాణాలు పూర్తి చేయాల్సిన గడువు గతేడాది మొదటికే ముగిసింది. అనంతరం ఈవోటీ పేరుతో అక్టోబర్ వరకు పొడిగించారు. మళ్లీ ఏడాది కాలం జరిగింది. అయినా పనులు ముందుకు కదలడం లేదు. ఇప్పటి వరకు రెండు వైపులా గోడలతో కలిపి రెండున్నర కిలోమీటర్లు పూర్తి అయ్యాయి. సుమారు రూ.40కోట్లకు పైగా బిల్లులు చెల్లించారు. తర్వాత జరిగిన పనులకు బిల్లులు ఇవ్వలేదు.

**జాఫర్ సాహెబ్ కాలువ**



అలాగే తోటపల్లిగూడూరు మండలం, మైపాడు పరిధిలో ఆయకట్టుకు సాగునీరు తీసుకెళ్లే జాఫర్ సాహెబ్ కాలువకు సంబంధించి పాత చెక్ పోస్టు నుంచి మైపాడు గేటు వరకు 1.15 కిలోమీటర్లు, అక్కడి నుంచి జాతీయ రహదారి వరకు మరో 1.05 కిలోమీటర్లు మేర సుమారు రూ.94కోట్లతో అంచనాలు వేయగా.. రూ.74కోట్ల అగ్రిమెంట్‌తో పనులు మొదలయ్యాయి. 15శాతం వరకు పనులు జరగగా.. రూ.7కోట్లకు బిల్లులు పెట్టారు. సర్వేపల్లి కాలువ రక్షణ గోడ పనులు మొదలు పెట్టిన కొద్ది నెలలకే జాఫర్‌సాహెబ్ కాలువ పనులు గుత్తేదారులకు అప్పగించారు. ఇవి కూడా ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

**పూడిక తీతకు తప్పని తిప్పలు**

ప్రస్తుతం సర్వేపల్లి కాలువలో పూడికతీత పనులు జరుగుతున్నాయి. భారీ పొక్లెయిన్లు తీసుకువచ్చి పనులు చేశారు. శెట్టిగుంట రోడ్డు నుంచి రైల్వేస్టేషన్ సమీపం వరకు పూడిక తీశారు. గోడ నిర్మాణాలు చేసిన చోట పూడిక తీత పనులకు కష్టాలు తప్పడం లేదు. అటు ఇటు గోడ నిర్మాణాలు.. గోడ వెంబడి ఆక్రమణల కారణంగా వాహనాలు వెళ్లలేని పరిస్థితి. దీంతో కొంతమేర మనుషులను పెట్టి పనులు చేస్తున్నారు. ప్రస్తుతం మొక్కుబడిగా జరుగుతున్నట్లు విమర్శలున్నాయి.

# మారనున్న పల్లె పాలనా రూపు

ఒంటిమిట్ట : పంచాయతీ పాలనలో మార్పులకు కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా, సంక్షేమ ఫలాలు లబ్ధిదారులకు నేరుగా చేరేలా అడుగులు వేస్తోంది. పథకాల అమలులో క్షేత్రస్థాయి యంత్రాంగం ముఖ్య భూమిక పోషించేలా చర్యలు చేపడుతోంది. జిల్లాలో 557 గ్రామ పంచాయతీలుండగా.. అనుబంధంగా 423 చోట్ల గ్రామ సచివాలయాలు సేవలందిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఎక్కువ, మరికొన్ని గ్రామాల్లో తక్కువ మంది సిబ్బంది ఉన్నారు. అవసరం లేని చోట తగ్గించి ఆయా ప్రాంతాల్లో ప్రజలకు ఉత్తమ సేవలు అందించడానికి అదనంగా సిబ్బందిని నియమించనుంది. ఈ మేరకు క్షేత్రస్థాయి నుంచి సమాచారాన్ని సేకరించిన అధికారులు.. సిబ్బంది సర్దుబాటుకు కసరత్తు చేస్తున్నారు.

ఇకపై ఇద్దరు డిప్యూటీ ఎంపీడీవోలు

ప్రస్తుతం మండలానికి ఒక డిప్యూటీ ఎంపీడీవో(ఈవోపీర్డీ) ఉన్నారు. ఇకపై ఇద్దరు రానున్నారు. ఒకరు తాగునీరు, పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులు పర్యవేక్షిస్తారు. మరొకరు గ్రామ సచివాలయాల నిర్వహణ వ్యవహారాలను చూస్తారు.

**మొత్తం నాలుగు గ్రేడ్లు:** పది వేల జనాభా/ ఏడాదికి రూ.కోటి లేదా అంతకంటే ఎక్కువ ఆదాయం ఉన్న ఆయా పంచాయతీలు ప్రత్యేక శ్రేణి(స్పెషల్ గ్రేడ్)గా పరిగణిస్తారు. కార్యదర్శి స్థానంలో డిప్యూటీ ఎంపీడీవోను పరిపాలనా అధికారిగా నియమిస్తారు. ఇటువంటివి జిల్లాలో 11 ఉన్నాయి. పురపాలక తరహాలో వీటిలో సేవలు అందిస్తారు. 4 వేలు– 10 వేల మంది జనం, సంవత్సరానికి రూ. 50 లక్షల రాబడి, అంతకంటే ఎక్కువగా ఉంటే గ్రేడ్–1గా ఎంపిక చేస్తారు. జిల్లాలో ఇలాంటివి 59 ఉన్నాయి. కార్యదర్శుల చేతికి పాలనా పగ్గాలు అప్పగిస్తారు. ఇక్కడ 20 మంది సిబ్బందిని నియమించే అవకాశం ఉంది.

2– 4 వేల మంది జనాభా ఉంటే గ్రేడ్–2గా చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇటువంటివి 154 ఉన్నాయి. శ్రేణి–2లో మెరుగైన సేవలు అందించడానికి 12 మంది ఉద్యోగులను కేటాయిస్తారు.

జనాభా రెండు వేల లోపు ఉంటే గ్రేడ్–3గా పరిగణిస్తారు. ఇలాంటివి 227 చోట్ల ఏర్పాటు చేశారు. ఇక్కడ తొమ్మిది మంది సిబ్బంది సేవలు అందిస్తారు. గ్రేడ్–4, 5 విభాగాల్లో పనిచేస్తున్న కార్యదర్శులకు ఉద్యోగోన్నతి కల్పించి గ్రేడ్–3, 2కు బదిలీ చేస్తారు.

# పనులు పంచుకో.. ముడుపులు నంజుకో

కడప: వైకాపా హయాం నుంచి తంబళ్లపల్లెలో అరాచక పాలన సాగుతూనే ఉంది. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సైతం తెదేపాలో చేరిన వైకాపా కోవర్టుల కారణంగా పరిస్థితులు దారికి రావడంలేదు. ఈ అనైక్యతను ఆసరాగా తీసుకుని అధికారులు సైతం ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారు. జలవనరులశాఖలో ఇంజినీరింగ్ అధికారులు నియోజకవర్గంలో గుత్తేదారుల అవతారం ఎత్తారు. వీరికి వైకాపా కోవర్టులు వత్తాసు పలకడంతో చెలరేగిపోతున్నారు. ఈ శాఖలో ఓ అధికారి తమ్ముడిని రంగంలోకి దింపి గుత్త పనులు చేపట్టారు. వీరికి నియోజకవర్గంలో ఇద్దరు తెదేపా నేతలు అండగా నిలిచి కమీషన్లు తీసుకుంటున్నారు.

రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా నియోజకవర్గంలో హోదాను ఓ తెదేపా నేత స్థానికంగా సృష్టించుకుని చెలామణి అవుతున్నారు. ఈయన వైకాపా కోవర్టులకు అండగా నిలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కురబలకోట మండల నేత వైకాపా వర్గీయులు చెప్పినట్లుగా వింటూ అరాచకాలు సాగిస్తున్నారు. వైకాపా కీలక నేతకు అత్యంత సన్నిహితంగా ఉంటూ పరోక్షంగా సహాయ సహకారాలు అందిస్తున్నారు. రెండు పార్టీల అండతో భూదందాలు సాగిస్తున్నారు. ఈ పరిణామాలను తెదేపా శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ ప్రభుత్వంలోనూ వైకాపా నేతల పనులన్నీ సవ్యంగా సాగుతున్నాయి. తెదేపా శ్రేణులు ఇప్పుడూ బాధితులుగానే ఉన్నారు.

ఇంజినీరింగ్ అధికారులదే హవా

జలవనరులశాఖలో ఇద్దరు ఇంజినీరింగ్ అధికారులు నియోజకవర్గాన్ని పంచుకున్నారు. కాంట్రాక్టు పనులన్నీ తమ అనుచరులకు కట్టబెట్టి పరోక్షంగా పనుల్లో భాగస్వామ్యులయ్యారు. ఓ అధికారి అయితే ఏకంగా తమ్మున్నే రంగంలోకి దింపారు. పనులు నాణ్యతా ప్రమాణాల మేరకు జరగడంలేదు. పర్యవేక్షించాల్సిన అధికారులే పనులు చేయడంతో నాణ్యత గురించి పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది. పెద్దమండ్యం మండలం గుడిసివారిపల్లె చెరువు కట్ట రూ.50 లక్షలతో చేపట్టగా నాణ్యత లేకుండా పోయింది. ఈ తరహాలోనే చిన్నపాటి మట్టి పనులు మరో 22 వరకు తూతూమంత్రంగా చేపట్టి రూ.కోటి వరకు బిల్లులు చేసుకున్నారు. 2021లో నియోజకవర్గానికి వచ్చిన ఇంజినీరింగ్ అధికారి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కంపెనీ నిర్మించిన ముదివేడు రిజర్వాయర్‌లో అక్రమాలకు వత్తాసు పలికారనే ఆరోపణలున్నాయి. వైకాపాతో అంటకాగిన అధికారి ఇప్పుడూ చలామణి అవుతూ అక్రమాలు సాగిస్తున్నారు.

**నీరు– చెట్టు పనుల్లోనూ అక్రమాలు**

నీరు– చెట్టు కింద పెండింగ్ బిల్లులను కూటమి ప్రభుత్వం నియోజకవర్గానికి రూ.12 కోట్లు వరకు విడుదల చేసింది. పెండింగ్ బిల్లులను తాజాగానూ అప్‌లోడ్ చేసే వెసులుబాటు కల్పించడంతో ఇందులోనే అక్రమాలకు తెరదీశారు.

# పనుల్లేక.. పస్తులుండలేక

నాగలాపురం : వలసల నివారణకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని అమలుచేస్తుండటంతో మన రాష్ట్రంలో వలసల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. కానీ పశ్చిమబంగ నుంచి వలసలు పెరుగుతూనే ఉన్నాయి. మూడు సంవత్సరాలుగా జిల్లాలో వరినాట్లకు ఇతర రాష్ట్ర కూలీలే స్థానిక రైతులకు ఆసరాగా నిలుస్తున్నారు.

**వరినాట్లలో వారిదే జోరు..**

పశ్చిమబెంగాల్ నుంచి వచ్చిన 10 మంది కూలీలు ఒక రోజులో రెండున్నర ఎకరాల మేరా నారు పీకి, నాటే పనిని పూర్తిచేస్తున్నారు. ఈ పనికిగానూ ఎకరాకు కాంట్రాక్ట్ పద్ధతిలో రూ.4,500, రూ.600 విలువచేసే బియ్యాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. ఇదే పనిని స్థానిక కూలీలతో చేయించాలంటే భోజనం ఖర్చులతో కలిపి రూ.7,450 అవుతోంది. దీంతో రూ.2,350 ఆదా అవుతుండటంతో బెంగాలీ కూలీల జోరు కొనసాగుతోంది.

**అక్కడ పనులు లేక..** – భీమోల్, వ్యవసాయ కూలీ, మహోపూర్ గ్రామం, పశ్చిమబంగ రాష్ట్రం

మా ప్రాంతంలో పనులు లేక ఏజెంట్ల సూచనలతో 80 మంది వరకు



నాగలాపురం మండలానికి వచ్చాం. బెంగాల్‌లోని మా జిల్లాలో తక్కువ విస్తీర్ణంలో వరి సాగవుతుండటంతో అక్కడ పనులు త్వరగా పూర్తైపోతాయి. ఖాళీగా ఉండలేక ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ తదితర రాష్ట్రాలకు వెళ్లి పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నాం.

**ఒకే రోజులో.. మూడు ఎకరాలు**– దామునాయుడు, రైతు, జంబుకేశవపురం గ్రామం, నాగలాపురం మండలం.

గతేడాది మా ప్రాంతానికి వచ్చిన బెంగాలీ కూలీలు తక్కువ మొత్తానికే పని చేయటంతో పాటు వేగంగా పనులు పూర్తవుతుండటంతో ఈ దఫా వారిని పిలిపించాను. మూడు ఎకరాల పొలంలో ఒకే రోజులో వరినాట్లు పూర్తిచేశారు

# హైవేగం

నంద్యాల : ఉమ్మడి కర్నూలు జిల్లా మీదుగా వెళ్లే 44వ నంబరు జాతీయ రహదారి (బెంగళూరు–హైదరాబాద్) నిర్వహణ అధ్వానంగా మారింది. ఉమ్మడి జిల్లాలో ఈ రహదారి 84 కి.మీ. పొడవునా ఉంది. సగటున రోజుకు 150కిపైగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు, 300కుపైగా ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. చాలా ప్రాంతాల్లో గుంతలు పడ్డాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం ప్రమాదం జరిగిన ప్రాంతానికి 10 కి.మీ. దూరంలో 2021 ఫిబ్రవరి 14న జరిగిన రోడ్డు ప్రమాదంలో 14 మంది మదనపల్లివాసులు మృతి చెందారు. ప్రమాదాలు జరిగిన సమయంలో అధికారులు హడావుడి చేయడం.. ఆ తర్వాత పట్టించుకోకపోవడం షరా మామూలైంది.

**డ్రైవరు నిర్లక్ష్యంతో..**

2019, మే 11న బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో జరిగిన రహదారి ప్రమాదంలో 16 మంది మృత్యువాత పడ్డారు. ఏడాది కిందట డోన్ రూరల్ పోలీసుస్టేషన్ సమీపంలో ఓ ప్రైవేటు బస్సు 140 కి.మీ. వేగంతో వెళుతూ డివైడర్‌ను ఢీకొని అవతలి వైపు ఉన్న లారీపైకి దూసుకెళ్లింది. లారీలో ఉన్నవారు గాయపడగా.. బస్సు డ్రైవరు అక్కడికక్కడే మృతి చెందారు.

**140 కి.మీ.కు పైగా..**

బెంగళూరు–హైదరాబాద్ జాతీయ రహదారిపై గంటకు 110 కి.మీ. వేగంతో మాత్రమే బస్సులు వెళ్లాలి. ప్రైవేట్ బస్సులు 140 కి.మీ.కు పైగా వేగంగా దూసుకెళ్తున్నాయి. రాత్రివేళలో ట్రాఫిక్ తక్కువగా ఉండడం.. త్వరగా గమ్యస్థానానికి చేరాలన్న ఆతృతతో మితిమీరిన వేగంతో వెళుతున్నాయి. మరోవైపు ప్రైవేటు బస్సులు పర్మిట్లు లేకున్నా రాకపోకలు సాగిస్తున్నాయి.

**బ్లాక్ స్పాట్లు ఇవే..**

బెంగళూరు–హైదరాబాద్ జాతీయ రహదారిపై దత్తాత్రేయస్వామి ఆలయం, డోన్ రూరల్ పోలీసుస్టేషన్, దొరపల్లి బ్రిడ్జి, యు.కొత్తపల్లి క్రాస్‌రోడ్డు, ఓబులాపురం మెట్ట, క్రాస్ రోడ్డు, దేవరబండ, వెల్దుర్తి సమీపంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద బ్లాక్ స్పాట్లు ఉన్నాయి.

**స్పీడ్‌గన్లు.. సూచికలు కరవు**

రెండేళ్ల కిందటివరకు ఈ మార్గంలో స్పీడ్‌గన్స్ ఉండేవి. ఆ తర్వాత దీనిపై అధికారులు దృష్టి సారించలేదు. ఆర్టీఏ, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదు. జాతీయ రహదారి నిర్వహణ అధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ప్రైవేటు వాహనాల వేగం మితిమీరింది. ప్రమాదకర మలుపులు, బ్లాక్‌స్పాట్ల వద్ద సూచికలు లేవు. రహదారిపై ఎక్కడా మొబైల్ పెట్రోలింగ్ కనిపించడం లేదు. హైవే అంబులెన్సులు అందుబాటులో లేకపోవడంతో క్షతగాత్రులను ఆసుపత్రులకు తీసుకెళ్లే పరిస్థితి లేకుండా పోయింది.

**గతంలో జరిగిన భారీ ప్రమాదాలు**

2019 మే 11న సైతం ఎస్‌ఆర్‌ఎస్ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బైక్‌ను తప్పించబోయి ఉన్నపళంగా ఓ వైపు తిప్పడంతో.. ఎదురుగా వస్తున్న క్రూజర్ వాహనాన్ని ఢీకొట్టింది. పెళ్లి నిశ్చయం చేసుకుని వెళ్తున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వడ్డేపల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన 15 మంది, వెల్దుర్తికి చెందిన ఒకరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

2021 ఫిబ్రవరి 14న తెల్లవారుజామున మదార్‌పురం గ్రామ సమీపంలోని ఉపరితల వంతెనపై క్రూజర్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో అక్కడికక్కడే సుమారు 12 మంది ప్రాణాలు కోల్పోయారు.

**నియంత్రణ లేని అతివేగం**

2019, 2021 సంవత్సరాల్లో వెల్దుర్తి, మదార్‌పురం గ్రామాల సమీపంలో జరిగిన ప్రమాదాలు సైతం అతివేగాన్ని నియంత్రించకపోవడంతో సంభవించాయి. ఎస్‌ఆర్‌ఎస్ ట్రావెల్స్ బస్సు వెల్దుర్తి కూడలి వద్ద అతివేగంగా వస్తూ ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి ఎదురుగా వస్తున్న క్రూజర్‌ను ఢీకొంది. మదార్‌పురం సమీపంలో సైతం వాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో 12 మంది ప్రాణాలు వదిలారు.

# బడి సంచి.. బరువు తగ్గిందోచ్!



రాయదుర్గం : విద్యార్థుల పుస్తకాల బరువు తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం రెండు సెమిస్టర్ల విధానాన్ని అమలులోకి తేవడంతో ఇబ్బందులు తప్పుతున్నాయి. 1 నుంచి పదో తరగతి వరకు ఈ ఏడాది జూన్‌లో మొదటి సెమిస్టర్ పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రస్తుతం రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలు ఈ నెలాఖరులోగా విద్యార్థులకు అందజేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు.

**ఒకే పుస్తకంలో..**

రెండో సెమిస్టర్ పుస్తకంలో మూడేసి సబ్జెక్టులు ముద్రించారు. 1, 2 తరగతులకు తెలుగు, ఆంగ్లం, గణితం కలిపి మరో వర్క్‌బుక్ అందిస్తున్నారు. 3, 4, 5 తరగతులకు తెలుగు, ఆంగ్లం కలిపి ఒకటి.. గణితం, పరిసరాల విజ్ఞానం కలిపి మరొక పుస్తకం ఇచ్చారు. 6, 7, 8, 9 తరగతుల వారికి తెలుగు, ఆంగ్లం, హిందీ కలిపి ఒక పుస్తకం... జీవ, భౌతిక, రసాయన శాస్త్రాలతో మరొకటి ఇచ్చారు. సాంఘిక శాస్త్రంలో చరిత్ర, భూగోళం, ఆర్థిక, పౌర శాస్త్రాలు కలిపి ఇంకో పుస్తకం ఇచ్చారు. పదో తరగతి విద్యార్థులకు ఇదే సెమిస్టర్ విధానాన్ని అమలు చేస్తున్నారు.

**ఇబ్బంది తప్పింది**

గతంలో ఒకటి నుంచి పదోతరగతి వరకు సబ్జెక్టుల వారీగా వేర్వేరు పుస్తకాలు ఉండటంతో వాటిని నిత్యం తీసుకెళ్లడానికి విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. బరువు వల్ల చాలామంది వెన్నునొప్పితో బాధపడేవారు. తల్లిదండ్రులు సైతం గతంలో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం విధానంతో మోత తగ్గిందని విద్యావేత్తలు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఎంతో ఉపయోగకరం**ప్రసాద్‌బాబు, డీఈవో, అనంతపురం

కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన సెమిస్టర్ విధానంతో విద్యార్థులకు మేలు జరుగుతోంది. ఈ విధానంతో సంచి బరువు తగ్గింది. విద్యార్థులకు సిలబస్ పరంగా ఇబ్బంది లేకుండా ఉంటుంది.

ఉమ్మడి అనంత జిల్లాలో..

పాఠశాలలు:3,840

విద్యార్థులు: 3.5 లక్షలు

# గాలి తుస్.. సదుపాయాలు తూచ్!




అనకాపల్లి: చోడవరానికి చెందిన రమేష్ అనకాపల్లి శివారులోని ఓ మాల్‌కు వస్తుండగా బంగారుమెట్ట సమీపంలోని ఓ బంకులో పెట్రోల్ కొట్టించుకున్నాడు. టైరులో గాలి కొట్టించుకోవాలని అడగగా సిబ్బంది లేరని చెప్పారు. బైక్ దిగి మూత్రశాలకు వెళ్లేసరికి తాళం వేసి ఉంది. ప్రతి పెట్రోల్ బంకులో వినియోగదారులకు తాగునీరు, మరుగుదొడ్లు, వాహనాలకు గాలి సౌకర్యం ఉండాలి. ప్రథమ చికిత్స కిట్లు, ధరల పట్టిక, ఇంధన నాణ్యత, కొలతల పరిశీలన చేసుకునే వెసులుబాటు కల్పించాలి. ఇవన్నీ కాగితాల్లోనే తప్ప.. క్షేత్రస్థాయిలో కనిపించట్లేదు. సౌకర్యాలు లేవని ప్రశ్నిస్తే సిబ్బంది బెదిరింపులకు దిగుతున్నారు. మండల స్థాయిలో తహసీల్దారు నుంచి జిల్లాస్థాయి అధికారులకు తనిఖీలు చేసే అధికారం ఉంది. ఆయిల్ కంపెనీలు తరచూ పరిశీలిస్తుండాలి. వినియోగదారులు సమస్యలు ఉన్నాయంటూ ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. సౌకర్యాలు కల్పించని బంకులకు జరిమానాలు విధించాల్సి ఉన్నా.. ఈ ఏడాది మొత్తంమీద ఎక్కడా ఒక్కచోటా చర్యలూ తీసుకోలేదు. జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం సుమారు 144 పెట్రోల్ బంకులున్నాయి. ఇందులో 80 శాతానికి పైగా బంకుల్లో కనీస సదుపాయాలు లేవు. గాలి యంత్రం పనిచేయకపోవడం.. అది ఉన్నా గాలి కొట్టేందుకు సిబ్బంది ఉండటంలేదు. కొన్ని బంకుల్లో ఫ్రీ–ఎయిర్ అని పెట్టినా గాలి కొట్టేందుకు సొమ్ము వసూలు చేస్తున్నారు. జిల్లాలో చాలా చోట్ల తాగునీరు ఉన్నా.. మరుగుదొడ్లు, గాలి యంత్రాలు పనిచేయడం లేదు. అనకాపల్లి నుంచి పాయకరావుపేట నడుమ జాతీయ రహదారిలో ఇదేంటని ప్రశ్నిస్తే గదమాయించి, బెదిరిస్తున్నారు.

జాతీయ రహదారిపై బంకుల్లో చాలాచోట్ల మరుగుదొడ్డి లేదు. ఒకటి, రెండుచోట్ల ఉన్నా.. తాళంవేసి ఉంది. ఎలమంచిలి, చోడవరం నియోజకవర్గాల పరిధిలోని 34 బంకుల్లో దాదాపు సగానికిపైగా మంచినీరు, గాలిపంపు లేవు.

**ఫిర్యాదులు వస్తే చర్యలు..:** వినియోగదారులకు కల్పించాల్సిన సౌకర్యాలు లేకుంటే సంబంధిత బంకు సంస్థల టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. తాజాగా జేసీ ఆధ్వర్యంలో జిల్లాలోని 32 బంకుల్లో తనిఖీలు నిర్వహించాం. నాణ్యత, సౌకర్యాలు పక్కాగా ఉండాలని సూచించాం. మాకు ఫిర్యాదు చేసినా.. పరిశీలించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

కె.వి.ఎన్.మూర్తి, డీఎస్ఓ, అనకాపల్లి

# అచేతన స్థితి.. ఆదుకుంటేనే ఆరోగ్యం



సోమందేపల్లి: సోమందేపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థి గౌతమ్ తలలో రక్తం(బ్లడ్ క్లాట్) గడ్డ కట్టడంతో బెంగళూరు ఆసుపత్రిలో అచేతనంగా ఉన్నాడు. తమ కుమారుడికి శస్త్ర చికిత్స కోసం డబ్బులు లేక తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో తల్లడిల్లిపోతున్నారు. హిందూపురం మున్సిపల్ పరిధిలోని సడ్లపల్లికి చెందిన చంద్రకళ, హరి దంపతుల కుమారుడు గౌతమ్. నిరుపేదలు కావడంతో ఉపాధి కోసం కొన్నేళ్ల కిందట సోమందేపల్లికి వచ్చారు. తల్లిదండ్రులు స్థానిక కియా అనుబంధ పరిశ్రమల్లో కార్మికులుగా పనులు చేస్తూ గీతానగర్‌లోని అద్దె ఇంట్లో ఉంటున్నారు. గౌతమ్‌ను స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలల్లో తొమ్మిదో తరగతి చదివిస్తున్నారు. 25 రోజుల కిందట గౌతమ్ అకస్మాత్తుగా తీవ్ర అస్వస్థతకు లోనయ్యాడు. మాటలు రాకుండా, కాళ్లు, చేతులు కదలలేని స్థితికి చేరుకోవడంతో కన్నవారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే బెంగళూరు ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించారు. గతంలో ఎప్పుడో ఆడుకొంటూ కిందపడి తలలో రక్తం గడ్డ కట్టడంతోనే ప్రస్తుతం తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడని, శస్త్ర చికిత్సల కోసం రూ.20 లక్షలు ఖర్చవుతుందని అక్కడి వైద్యులు చెప్పడంతో వారు నిశ్చేష్టులయ్యారు. కార్మికులుగా పనిచేస్తూ వచ్చే అరకొర వేతనాలతో జీవనం సాగిస్తున్న తాము ఇంత సొమ్ము ఎలా చెల్లించి, శస్త్ర చికిత్స చేయించాలని కన్నీటి పర్యంతమవుతున్నారు. తమ సొంతూరులో గృహం, బంగారు ఆభరణాలు విక్రయించడం ద్వారా రూ.10 లక్షల వరకు కుమారుడి వైద్య చికిత్సలకు ఇప్పటికే ఖర్చు చేశారు. అయినా ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో బాధిత దంపతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సోమందేపల్లి, హిందూపురం తదితర ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు తమకు తోచిన సాయం అందించారు. మానవతావాదులు స్పందించి ఆర్థిక సాయం చేసి తమ కుమారుడి ప్రాణాలను కాపాడాలని చంద్రకళ, హరి చేతులెత్తి వేడుకొంటున్నారు.

# టోల్‌ప్లాజా మరుగుదొడ్లు శుభ్రంగా లేవా.. ఫిర్యాదు చేస్తే ఖాతాలోకి రూ.వెయ్యి

చిత్తూరు : జాతీయ రహదారులపై ఉన్న టోల్‌ప్లాజాల వద్ద మరుగుదొడ్ల నిర్వహణను మెరుగుపరిచే లక్ష్యంతో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) వినూత్న ఆలోచన చేసింది. టోల్‌ప్లాజాలో శుభ్రంగా లేని టాయిలెట్లపై ఫిర్యాదు చేస్తే రూ.వెయ్యి ఫాస్టాగ్ ద్వారా రివార్డ్ పాయింట్లు ఇవ్వనుంది. ఫిర్యాదు చేయడానికి ఈ నెల 31 వరకు అవకాశాన్ని కల్పించింది. ఎలా చేయాలంటే..? టోల్ రహదారుల్లో వెళ్లే వాహనదారులు రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. టోల్‌ప్లాజా వద్ద టాయిలెట్ అపరిశుభ్రంగా కనిపిస్తే ఫొటో తీసి, దాన్ని అప్‌లోడ్ చేయాలి. ఫొటోతోపాటు పంపిన వారి పేరు, వాహనం రిజిస్ట్రేషన్ నంబరు, ఫోన్ నంబర్, లోకేషన్ తదితర వివరాల్ని నమోదు చేయాలి. రోజూ వచ్చిన ఫొటోలో అర్హత ఉన్న వాటిని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఎంపిక చేస్తారు. ఎంపికైన ఫిర్యాదుదారుడి వాహన రిజిస్ట్రేషన్ నంబరుకు అనుసంధానమై ఉన్న ఫాస్టాగ్ ఖాతాకు రూ.వెయ్యి రీఛార్జి రూపంలో జమచేస్తారు.




జిల్లాలో టోల్ ప్లాజాలు

చెన్నై–బెంగళూరు హైవేలో మహాసముద్రం.

చిత్తూరు–తిరుపతి ఆరు వరుసల హైవేలో గాదంకి.

చిత్తూరు–కడప హైవేలో తేనేపల్లి.

# త్రిలింగ క్షేత్రం... నత్తారామేశ్వరం

పెనుమంట్ర : ఒకే ప్రాంగణంలో దక్షిణాభిముఖ, పశ్చిమాభిముఖ శివలింగాలు ఉండటం అరుదు. కానీ అటువంటి ప్రత్యేకత పెనుమంట్ర మండలం నత్తారామేశ్వరంలోని శ్రీరామేశ్వరస్వామి దేవస్థానానికి ఉంది. రామేశ్వరస్వామి, రామలింగేశ్వరస్వామి, లక్ష్మణేశ్వరస్వామి వార్లతో త్రిలింగ క్షేత్రంగా గుర్తింపు పొందింది.

శ్రీరాముడు నత్తలతో కూడిన ఇసుకతో ప్రతిష్ఠించిన శివలింగం రామేశ్వరస్వామిగా పేరొందింది. నత్తలతో కూడిన రామేశ్వరుడు కావడంతో ఈ ప్రాంతాన్ని నత్తారామేశ్వరంగా పిలుస్తారు. పరుశురాముడు ప్రతిష్ఠించిన రామలింగేశ్వరస్వామి ఏడాదిలో 11నెలలు నీటిలో ఉండి వైశాఖ మాసంలో మాత్రమే భక్తులకు దర్శనమిస్తాడు. గోస్తనీ నది అవతల వైపు లక్ష్మణుడు ప్రతిష్ఠించిన లక్ష్మణేశ్వరస్వామి ఆలయం ఉంది. కార్తిక మాసంలో ఎక్కువ సంఖ్యలో భక్తుల ఈ దేవస్థానానికి వస్తారు.

**భక్తులకిదే ప్రత్యేకం..** శ్రీరాముడు సీతాసమేతంగా గోస్తనీ నదిలోని నత్తలతో కూడిన ఇసుక మట్టితో శివలింగం తయారు చేసి పూజించారు. మిగిలిన కొంత శేషాన్ని సైతం అక్కడే వదిలేయడంతో దానిని పదిలంగా



చూసుకుంటూ వచ్చారు. అర్చకులు ఈ శేషం భక్తులకు చూపి నాటి చరిత్రను వివరిస్తున్నారు. ప్రతిష్ఠించిన శివలింగాన్ని తాకడానికి భక్తులకు అవకాశం లేకపోవడంతో ఈ శేషాన్ని తాకి పరవశమవుతున్నారు. ఇటీవల ఈ శేషాన్ని ఆలయం వెలుపల అద్దాల పెట్టెలో ఉంచి ప్రదర్శిస్తున్నారు.

**ఆలయానికి చేరేదిలా...** ప్రైవేటు వాహనాలపైనే ఆధార పడాలి. తణుకు పట్టణం నుంచి సుమారు 13 కిలోమీటర్ల దూరం ఉంటుంది. భీమవరం నుంచి 23, తాడేపల్లిగూడెం నుంచి 28, అత్తిలి నుంచి 7, మార్టేరు నుంచి 14 కిలోమీటర్ల దూరంలో ఈ దేవస్థానం ఉంది.

# కర్షకులు కోలుకునేనా !

పెద్దదోర్నాల : పశ్చిమ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలతో రైతన్నలు కుదేలయ్యారు. పలు ప్రాంతాల్లో పంటలు దెబ్బతినడంతో తాము గట్టెక్కేదెలా అని వేదన చెందుతున్నారు. దోర్నాల మండలంలో చెరువులు నిండి అలుగు పారుతున్నాయి. కడపరాజుపల్లె చెరువు నిండి అలుగు పారి సమీపంలోని మిరప, పత్తి, కంది, అరటి పంటలను ముంచెత్తింది. రూ.లక్షల పెట్టుబడితో సాగుచేసిన పంటలు పాడవ్వడంతో కడపరాజుపల్లె, తిమ్మాపురం రైతులు ఆందోళన చెందుతున్నారు. పొదిలి పరిసర ప్రాంతాల్లో సాగుచేసిన పొగాకు పొలాల్లో నీరు చేరింది. ఇది ఎక్కువ రోజులు నిలబడితే మొక్కలన్నీ వడలిపోయే ప్రమాదం ఉంది. గత నెల రోజులుగా వాతావరణం అనుకూలంగా ఉండటంతో పశ్చిమ ప్రాంతంలో విస్తారంగా పొగనాట్లు వేస్తున్నారు. అయితే వారం రోజుల్లోనే పరిస్థితి తల్లకిందులైంది. పొలాలు నీట మునగడంతో వారికి



దిక్కుతోచడం లేదు.

తోకపల్లి సమీపంలో తీగలేరు వాగు పొంగిపొర్లుతోంది. చిన్నదోర్నాల, రామచంద్రకోట, వైడీపాడు మీదుగా వరద నీరు తోకపల్లికి చేరుతోంది.

భారీ వర్షంతో కంభం మండలంలోని పత్తి, మిరప, కంది, మొక్కజొన్న, అరటి, పసుపు తదితర పైర్లకు నష్టం వాటిల్లింది. పత్తి కాయలు నల్లగా మారి పాడైపోయాయి. మిరప మొక్కలు చనిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. సుమారు 50 ఎకరాల్లోని వరి పంటకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేశామని వ్యవసాయాధికారి మహమ్మద్ తెలిపారు. నిలిచిన నీటిని బయటకు పంపాలన్నారు.

# కళ్లలోనే దాగి ఉంది గ్రీకు దేవత

ఆరడుగులు పైగా ఎత్తు.. అందమైన కళ్లు.. ఫిట్ లుక్‌తో గ్రీకువీరుడిగా మగువల గుండెల్లో నిలిచి ఉన్నాడు హృతిక్ రోషన్. అమ్మాయిలు అతడిని కలల రాకుమారుడిగా భావిస్తారు. ఇప్పుడు అదే కుటుంబం నుంచి ఒక నటి చిత్రసీమలో వెలుగులు విరజిమ్మేందుకు బరిలో దిగింది. పేరు పష్మినా రోషన్. ఈ బ్యూటీ 'ఇష్క్ విష్క్ రీబౌండ్' అనే చిత్రంతో బాలీవుడ్ లో అడుగుపెట్టి, ఇప్పుడు దక్షిణాది చిత్రసీమపైనా మనసు పారేసుకుందని సమాచారం. అందమైన కళు టీనేజీ వైబ్స్ తో ఈ బ్యూటీ ఇప్పటికే కుర్రకారు మనసులపై పష్మినా రోషన్ బలమైన ముద్ర వేసింది. ఇటీవల కొన్ని నెలలుగా డ్రీమ్ బోయ్ కార్తీక్ ఆర్యన్ తో డేటింగ్ చేస్తోందంటూ పుకార్లు షికార్ చేసాయి. హృతిక్ రోషన్ కజిన్ పష్మినా రోషన్ తో కార్తీక్ బాగా చనువుగా ఉంటున్నాడని పుకార్లు వస్తున్నాయి. అయితే ఆ తర్వాత జాతీయ మీడియా కథనంలో ఈ జంట బ్రేకప్ అయిపోయిందని కూడా కథనాలు వచ్చాయి. పాపులర్ పోర్టల్ ప్రకారం.. కార్తీక్- పష్మినా గత 5-6 నెలలుగా కలిసి చాలా సమయం గడిపారు. కొంతకాలం డేటింగ్



కూడా చేశారు. అయితే ఇద్దరి మధ్యా సింక్ కుదరలేదు. అందువల్ల విడిపోయారు.. అంటూ ఈటైమ్స్ పేర్కొంది. పష్మినా రోషన్ తాజా ఫోటోషూట్ గుబులు రేపుతోంది. ఈ అందమైన సోగకళ్ల సుందరి బ్లాక్ ఔట్ ఫిట్ లో అగ్గి రాజేస్తోంది. పష్మినా బ్లాక్ ఫ్రాక్ లో స్ట్రైకింగ్ ఫోజులతో కట్టి పడేసింది. ఒక అద్దంలో తన యవ్వనాన్ని తనివితీరా చూసుకుంటున్న పష్మినా, కుర్రకారు మనసులపై ఘాడమైన ముద్ర వేస్తోంది. ప్రస్తుతం ఈ యూనిక్ ఫోటోషూట్ వైరల్ గా దూసుకెళుతోంది. గ్రీక్ గాడెస్! అంటూ ఈ భామకు కితాబిచ్చేస్తున్నారు.

**పష్మినా ఎవరు?....** పష్మీనా రోషన్ భారతీయ చలనచిత్ర పరిశ్రమలోని దిగ్గజ సినీ కుటుంబం నుండి వచ్చారు. ఒక రకంగా నేపో కిడ్ అని పిలవాలి. ప్రఖ్యాత సంగీత దర్శకుడు రాజేష్ రోషన్ -కాంచన్ రోషన్ ల కుమార్తె. 1970ల నుండి బాలీవుడ్ లో సంగీత దిగ్గజంగా పాపులరైన రాజేష్ రోషన్, ప్రముఖ సంగీత స్వరకర్త రోషన్ లాల్ నాగ్రత్ కుమారుడు. సినిమా సంగీతం, కళా రంగంతో సంబంధం ఉన్న రోషన్ కుటుంబంలో పష్మినా రోషన్ మూడవ తరం అమ్మాయి. ప్రముఖ బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్ తనకు కజిన్. హృతిక్ ప్రముఖ దర్శకనిర్మాత రాకేష్ రోషన్ కుమారుడు అన్న సంగతి తెలిసిందే. ఈ కుటుంబం నుంచి మరికొందరు సినీరంగంలో రాణిస్తున్నారు.

# అదితీరావ్ పేరుతో మోసగాడి వాట్సాప్ వల

తనదైన అందం ఛమత్కారమైన నటనతో యువతరం హృదయాలను గెలుచుకున్న అదితీరావ్ హైదరీ తాను వలచిన సిద్ధార్థ్ ని పెళ్లాడి సంసార ఆస్వాధనలో ఉన్న సంగతి తెలిసినదే. అదితీ ఇంతకముందు హీరామండిలో అద్భుత నటనతో కట్టి పడేసింది. వేశ్య పాత్రలో గజగామిని నడకలతో యూత్ గుండెల్ని కోతకు గురి చేసిన ఈ బ్యూటీని ఒక మోసగాడు స్వార్ధ పూరిత ప్రయోజనాల కోసం మిస్ యూజ్ చేస్తున్నాడని ఆరోపించింది. అతడు నాలాగా నటిస్తున్నాడు. నమ్మకండి..అది నా వాట్సాప్ కాదు! అని అదితీ ఆందోళన వ్యక్తం చేసారు. నాలాగా నటిస్తున్న వాట్సాప్ ఫేక్ బోయ్ ఎవరో తెలీదని అన్నారు. అతడి వివరాలతో పాటు ఒక నోట్‌ను షేర్ చేసింది. "కొందరు నా దృష్టికి తెచ్చారు.. ఎవరో వాట్సాప్‌లో నాలాగా నటిస్తూ, నా ఫోటోలను ఉపయోగించి 'ఫోటోషూట్'ల గురించి ఫోటోగ్రాఫర్‌లకు మెసేజ్‌లు పంపుతున్నాడు. అది నేను కాదు. నేను



ఇలా సంప్రదించను. పని కోసం ఏ వ్యక్తిగత నంబర్‌ను ఉపయోగించను. ప్రతిదీ నా టీమ్ చూసుకుంటుంది" అని అన్నారు. దయచేసి జాగ్రత్తగా ఉండాలని, ఆ నంబర్ ని నమ్మకండి! అని కూడా హెచ్చరించారు. మీకు ఏదైనా వింతగా అనిపిస్తే, నా టీమ్‌కి వెంటనే తెలియజేయండి. నాకు మద్దతుగా రక్షణాత్మకంగా ఉన్న వారందరికీ ధన్యవాదాలు! అని నోట్ లో రాసారు. అయితే ఈ పోస్ట్‌పై స్పందించిన సహచర నటి కుషా కపిల "అయినా మీ గజగామిని నడకను కాపీ చేయలేరు" అని రాసారు. మీ ఇన్‌స్టాగ్రామ్ డిపిని ఉపయోగించి వారు ఏమీ చేయలేరు! అని సరదాగా వ్యాఖ్యానించారు. దీనికి నవ్వుతున్న ఎమోజీని కూడా నటి కుషా కపిల జోడించారు. అదితీరావ్ హైదరీ హైదరాబాదీ అమ్మాయి. అందువల్ల ఈ నవాబుల అమ్మాయిని పెళ్లాడిన సిద్ధార్థ్ కూడా హైదరాబాద్ అల్లుడయ్యాడు. ప్రస్తుతం ఈ జంట అన్యోన్య దాంపత్యం, రొమాంటిక్ లైఫ్ అన్నివేళలా చర్చనీయాంశమైంది. అదితీ రావ్ తల్లిదండ్రులు హైదరాబాద్, ఢిల్లీతో అనుబంధం కలిగి ఉన్నారు. అదితీ తెలుగు, తమిళం, హిందీలో ప్రముఖ కథానాయికగా వెలిగిపోతోంది. లైనెస్, పరివారిక్ మనురాంజన్ అనే రెండు చిత్రాలతో అతిదీ బిజీగా ఉంది.




# శంకర వరప్రసాద్ గారు సెకండ్ సాంగ్.. నిరాశలో డార్లింగ్ ఫ్యాన్స్




టాలీవుడ్ మెగాస్టార్ హీరోగా తెరకెక్కుతున్న సినిమా మన శంకరవరప్రసాద్ గారు. కెరీర్ స్టార్టింగ్ నుంచి అపజయమే ఎరుగని అనిల్ రావిపూడి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. గత కొన్ని సినిమాలుగా వరుస ఫ్లాపుల్లో ఉన్న చిరంజీవి, అనిల్ తో సినిమాను అనౌన్స్ చేసినప్పుడే ఈ సినిమా మంచి హిట్ అవడంతో పాటూ మెగాస్టార్ ను తిరిగి సక్సెస్ ట్రాక్ ఎక్కిస్తుందని అందరూ భావించారు.

**గెస్ట్ రోల్ లో విక్టరీ వెంకటేష్...** చిరంజీవి- అనిల్ కాంబినేషన్ లో వస్తున్న మొదటి సినిమా కావడంతో పాటూ అనిల్ రైటింగ్ కు చిరూ కామెడీ టైమింగ్ తోడైతే ఎలా ఉంటుందో చూడ్డానికి మెగా ఫ్యాన్స్ తో పాటూ సినీ లవర్స్ కూడా ఎంతగానో ఎదురుచూస్తున్నారు. నయనతార హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాలో విక్టరీ వెంకటేష్ ఓ గెస్ట్ రోల్ చేసి ఆడియన్స్ ను అలరించనున్నారు.

**మీసాల పిల్ల సాంగ్ కు విపరీతమైన రెస్పాన్స్...** మొదటి నుంచి ఈ మూవీపై ఆడియన్స్ కు మంచి అంచనాలుండగా, ఈ సినిమా నుంచి ఇప్పటివరకు బయటికొచ్చిన ప్రతీ కంటెంట్ కు ఆడియన్స్ నుంచి విపరీతమైన రెస్పాన్స్ వచ్చింది. టైటిల్ గ్లింప్స్ నుంచి రీసెంట్ గా వచ్చిన ఫస్ట్ సింగిల్ వరకు ప్రతీదీ బ్లాక్‌బస్టరే. ఈ సినిమా నుంచి వచ్చిన ఫస్ట్ సింగిల్ ఆల్రెడీ 60 మిలియన్ల వ్యూస్ ను దాటేసి సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తుండగా ఇప్పుడు సినిమాలోని సెకండ్ సింగిల్ పై అప్డేట్ వినిపిస్తోంది. మన శంకరవరప్రసాద్ గారు సినిమా నుంచి సెకండ్ లిరికల్ నవంబర్ నెలాఖరున రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారని తెలుస్తోంది. ఈ సెకండ్ సాంగ్ డ్యూయెట్ సాంగ్ గా రానుందని, ఫస్ట్ సాంగ్ లానే ఈ సాంగ్ లో కూడా చిరూ మంచి గ్రేస్ తో స్టెప్పులేయనున్నారని సమాచారం. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న మన శంకరవరప్రసాద్ గారు సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానున్న సంగతి తెలిసిందే. కాగా 2026 సంక్రాంతికి పలు సినిమాలు రిలీజ్ కానుండగా అందులో ఎంతో ముందుగా ప్రమోషన్స్ ను మొదలుపెట్టింది ఈ సినిమానే. మిగిలిన సినిమాలు, మరీ ముఖ్యంగా రాజా సాబ్ నుంచి ఇప్పటివరకు కనీసం ఫస్ట్ సింగిల్ కూడా రాకపోవంతో ప్రభాస్ ఫ్యాన్స్ అసంతృప్తి వ్యక్తం చేస్తుండగా, ప్రమోషన్స్ విషయంలో మెగా ఫ్యాన్స్ మాత్రం ఫుల్ హ్యాపీగా ఉన్నారు. అనిల్ రావిపూడి సినిమా అంటే ప్రమోషన్స్ ఏ స్థాయిలో ఉంటాయో కొత్తగా చెప్పే పన్లేదు. అందులో భాగంగానే చిరూ సినిమాను కూడా అనిల్ చాలా డిఫరెంట్ గా ప్రమోట్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారట. కానీ రిలీజ్ దగ్గరపడుతున్నప్పటికీ రాజా సాబ్ నుంచి ఇంకా కనీసం ఫస్ట్ సాంగ్ ను కూడా రిలీజ్ చేయకపోవడంతో డార్లింగ్ ఫ్యాన్స్ నిరాశ పడుతున్నారు.

# అక్కడ రామాయణ.. ఇక్కడ వారణాసి.. ఏం జరుగుతుందో?





ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో ఎప్పటికప్పుడు మైథలాజికల్ జోనర్ లో సినిమాలు రూపొందుతుంటాయి. ఇప్పటికే వివిధ సినిమాలు ప్రేక్షకుల ముందుకు రాగా.. ఇప్పుడు మరిన్ని చిత్రాలు చిత్రీకరణ దశలో ఉన్నాయి. ఆయా మూవీల షూటింగ్స్ శరవేగంగా జరుగుతుండగా.. వచ్చే ఏడాది థియేటర్స్ లోకి వచ్చి సందడి చేయనున్నాయి. ఆ సినిమాల్లో రెండు రామాయణ, వారణాసి. ఇతిహాసం రామాయణం ఆధారంగా ప్రతిష్టాత్మకంగా రామాయణ మూవీ నార్త్ లో రూపొందుతోంది.

రెండు భాగాల్లో రిలీజ్ కానుంది. అదే సమయంలో సౌత్ లో వారణాసి సినిమా తెరకెక్కుతోంది. ఆ మూవీలో మైథాలజీతోపాటు టైమ్ ట్రావెల్, సైన్స్ ఫిక్స్ టచెస్ కూడా ఉన్నాయని వినికిడి. ఏదేమైనా రామాయణ, వారణాసి.. రెండు భారీ బడ్జెట్ తో రూపొందుతున్న చిత్రాలే.. పాన్ ఇండియా సినిమాలే.. ఇప్పుడు రెండూ షూటింగ్స్ ను జరుపుకుంటున్నాయి. అయితే రెండింటిపై కూడా ఆడియన్స్ లో ఓ రేంజ్ లో అంచనాలు ఉన్నాయి. రీసెంట్ గా రిలీజ్ అయిన గ్లింప్సెస్ తో సినీ ప్రియులు, అభిమానులు హోప్స్ పెట్టుకున్నారు. అదే సమయంలో ఇప్పుడు కొత్త చర్చ మొదలైంది. రెండు సినిమాలు రిలీజ్ అయ్యాక కంపేరిజన్లు ఉంటాయని అనేక మంది నెటిజన్లు అంచనా వేస్తున్నారు. ఎందుకంటే రామాయణంలోని కొంత అంశాన్ని మన రాజమౌళి వారణాసి మూవీకి గాను తీసుకున్నట్లు ఇప్పటికే గ్లింప్స్ అండ్ రాజమౌళి కామెంట్స్ ద్వారా క్లారిటీ వచ్చేసింది. దీంతో పోలికలు వస్తాయని, ఇది మేకర్స్ కు సవాల్ లాంటిదని అభిప్రాయపడుతున్నారు. అయితే రామాయణ, వారణాసి డైరెక్టర్లు నితీష్ తివారీ, రాజమౌళి.. ఇద్దరూ మంచి టాలెంట్ ఉన్న దర్శకులే. రామాయణ మూవీతో విజువల్ వండర్ ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ఇప్పటికే క్లారిటీ వచ్చేసింది. ఆడియన్స్ కు మంచి ఎక్సపీరియన్స్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో రాజమౌళి గురించి అందరికీ తెలిసిందే. ఒక్క పద్దతి.. ఒక ప్లానింగ్.. ఒక విజన్ అనే స్టేట్మెంట్ కరెక్ట్ గా సెట్ అవుతుంది. ఇప్పటికే బాహుబలి సిరీస్ చిత్రాలతోపాటు ఆర్ ఆర్ ఆర్ తో వరల్డ్ వైడ్ గా ఉన్న సినీ ప్రియులను అలరించారు. ఇప్పుడు వారణాసి మూవీతో రాజమౌళి ప్రేక్షకులను నిరాశపరచడనే నమ్మకం అందరికీ ఉంది.

కాబట్టి అటు రామాయణ.. ఇటు వారణాసి సినిమాలు రిలీజ్ అయ్యాక ఏం జరుగుతుందో వేచి చూడాలి.

# నటికి గంటల తరబడి తిండి తినే అరుదైన వ్యాధి

దంగల్ చిత్రంలో క్రీడాకారిణిగా నటించింది ఫాతిమా సనా షేక్. ఆ సినిమా పాన్ ఇండియాలో సంచలన విజయం సాధించడమే గాక, చైనాలో ఇప్పటికీ అత్యధిక వసూళ్లను సాధించిన సినిమాగా రికార్డులకెక్కింది. ఈ సినిమాలో అమీర్ ఖాన్, సాన్య మల్హోత్రా తదితరులు నటించిన సంగతి తెలిసిందే. తాజాగా ఫాతిమ దంగల్ చిత్రీకరణ సమయంలో తాను ఎదుర్కొన్న బులిమియా అనే వ్యాధి గురించి మాట్లాడింది. తనకు అతిగా తినే అలవాటుందని, ఒక్కోసారి ఆహారం విషంగా మారిపోతుందని వెల్లడించి షాకిచ్చింది. అయితే దంగల్ చిత్రీకరణ సమయంలో రోజూ 3 గంటల పాటు శ్రమించేదానిని.. కనీసం గంటన్నర సమయం జిమ్ కి కేటాయించేదానిని అని ఫాతిమా చెప్పింది. నేను నిరంతరాయంగా గంటల తరబడి తినగలను. సినిమా కోసం 3000 కేలరీలు పెరగాలి కాబట్టి బాగా తిన్నాను. కానీ దంగల్ చిత్రీకరణ అయిపోయాక కూడా అదే విధంగా తినడం కొనసాగించాను. ఒకానొక దశలో తిండిపై విసుగొచ్చింది. భయం వేసిందని తెలిపింది. అంతేకాదు దంగల్ సెట్స్ లో తనకు అతిగా తినే అలవాటుందని సహనటి సాన్య మల్హోత్రా గుర్తించినట్టు అంగీకరించింది ఫాతిమా. తనకు సిగ్గుగా అనిపించిందని కూడా చెప్పింది. కానీ తిండి మానలేని పరిస్థితి. నిరంతరం ఎక్కువగా తినడం వల్ల శరీరం నియంత్రణలో లేదని భావించినట్టు ఫాతిమా చెప్పింది. గంటల తరబడి అతిగా తినడం, ఆకలితో ఉండటం అనే



సమస్యలను తాను ఎదుర్కొన్నానని తెలిపింది. రెండు విపరీత పరిస్థితితుల మధ్య జీవించానని అంది. బాగా తిన్న తర్వాత ఆకలితో అలమటించినట్టు అనిపిస్తుంది. ఒక సంవత్సరం పాటు బులిమియాతో పోరాడాను అని వెల్లడించింది. రియా చక్రవర్తితో చాటింగ్ సెషన్ లో ఫాతిమా ఈ విషయాలను వెల్లడించింది. ఆకలి మోడ్ ఆన్ అయితే ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా గంటల తరబడి తింటానని చెప్పింది.నాకు పూర్తిగా నియంత్రణ లేకపోవడంతో నేను ఒక సంవత్సరం పాటు బులిమిక్‌గా ఉన్నాను.. ప్రతి గంటా ఆకలి ఆకలి అంటూ అలమటిస్తాను. బాగా తినేస్తాను. అప్పటికి తిండి గురించి నాకు అంతగా అవగాహన లేదు. కానీ ఇప్పుడు తనకు మంచి అవగాహన ఉందని, పరిస్థితులు మారిపోయాయని తెలిపింది. తినగా తినగా ఒక టైమ్ కి మొద్దుభారిపోయినట్టు అనిపిస్తుంది. అప్పుడు తిండిని అనుభూతి చెందలేము. తిమ్మిరితనం అనిపిస్తుంది. చివరికి వికారం అనిపిస్తుంది. ఇకపై తినకూడదని అనుకుంటాం. అయితే ఎప్పటిలాగే అధికమొత్తంలో కేలరీలు తీసుకోకపోతే అది బులిమియాకు దారి తీస్తుందని కూడా చెప్పింది. ఈ బులిమియా అత్యంత హానికరం అని వెల్లడించింది. ఫాతిమ- విజయ్ వర్మ జంటగా నటించిన రొమాంటిక్ ఎంటర్ టైనర్ గుస్తాక్ ఇష్క్ త్వరలో విడుదలకు రానుంది. ఈ చిత్రంలో నసీరుద్దీన్ షా ఓ కీలక పాత్రను పోషించారు. ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా ఈ చిత్రాన్ని నిర్మించారు.

# ఆ బ్యూటీకి విజయ్ సేతుపతి స్ఫూర్తి!

మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి అనతి కాలంలోనే స్టార్ లీగ్ లో చేరాడంటే? అది ట్యాలెంట్ తో మాత్రమే సాధ్యమైంది. తన అసాధారణ నటనతోనే విమర్శకుల ప్రశంసలందుకున్నాడు. వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును దక్కించుకున్నాడు. తమిళ నటుడైనా? దేశవ్యాప్తంగా పాపులర్ అయ్యాడంటే? కేవలం తన నటనతోనే సాధ్యమైంది. భవిష్యత్ లో కమల్ హాసన్ లా పరిశ్రమలో ఎదుగుతాడని అంచనాలు భారీగా ఉన్నాయి. ఎంతో మంది స్టార్ హీరోలున్నా? వాళ్లందరికంటే తాను ప్రత్యేకమనే విషయాన్ని తన పాత్రల ద్వారా చెప్పకనే చెబుతున్నాడు.

**రెగ్యులర్ పాత్రలకు భిన్నంగా:** అయితే విజయ్ సేతుపతిని పొలిమేర ఫేం కామాక్షి భాస్కర్ల స్ఫూర్తిగా తీసుకుని రాణిస్తుందని ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని తానే స్వయంగా రివీల్ చేసింది. విజయ్ సేతుపతితో పాటు మరో ఇద్దరు యంగ్ హీరోలు కూడా తనకు స్ఫూర్తిగా నిలిచారంది. విజయ్ సేతు పతిలాగే శ్రీవిష్ణు, సుహాస్ కూడా డిఫరెంట్ ప్రయత్నాలు చేస్తున్నారంది. హీరోయిన్లు కూడా అలా ఎందుకు చేయకూడదని తాను కూడా సవాల్ గా తీసుకు న్నట్లు తెలిపింది. విభిన్న రకాల పాత్రలు పోషించే ప్రయత్నం చేస్తున్నానంది. కెరీర్ ఆరంభం నుంచి తన ఆలోచనలు రెగ్యులర్ సినిమాలకు భిన్నంగా ఉంటాయంది.



**పొలిమేరతో అమ్మడు ఫేమస్:** పొలిమేర, విరూపాక్ష చిత్రాలు తనకు మంచి పేరు తీసుకురావడానికి కారణంగా అందులో పాత్రలు సహా కథ కారణంగానే సాధ్యమైందని తెలిపింది. ప్రస్తుతం తాను నటిస్తోన్న 12 ఏ రైల్వే కాలనీ లో పాత్ర కూడా రెగ్యులర్ చిత్రాలకు భిన్నంగా ఉంటుందని పేర్కొంది. ఇదో మంచి ప్రేమ కథతో కూడిన సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమని తెలిపింది. ప్రస్తుతం ఈ సినిమాతో పాటు, అమ్మడు మరో రెండు సినిమాల్లో కూడా నటిస్తోంది. హిట్ ఫ్రాంచైజీ పొలిమేర నుంచి పొలిమేర 3 కూడా రెడీ అవుతోంది. ఈ సినిమాపై అంచనాలు ఏ స్థాయిలో ఉన్నాయో చెప్పాల్సిన పనిలేదు.

**మూడు సినిమాలతో బిజీ:** రెండు భాగాలు భారీ విజయం సాధించడంతో మూడవ భాగాన్ని ఏకంగా పాన్ ఇండియాలోనే ప్లాన్ చేస్తున్నారు. భారీ బడ్జెట్ తో ప్రతిష్టాత్మకంగా నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. అలాగే మాన్షన్ మౌస్ మల్లేష్ అనే మరో సినిమాలు కూడా కామాక్షి నటిస్తోంది. ఈ సినిమా వచ్చే ఏడాది రిలీజ్ కానుంది. ఈ బ్యూటీ కూడా డాక్టర్ కాబోయి యాక్టర్ అయింది. కానీ డాక్టర్ గా చదువు పూర్తి చేసింది. కొంత కాలం ఉద్యోగం కూడా చేసింది. ఆ తరువాతనే మోడలింగ్ పట్ల ఆసక్తి అటువైపు టర్న్ తీసుకుంది. అక్కడా గుర్తింపు రావడంతో సినిమాల్లోనూ ప్రయత్నాలు చేసి సక్సస్ అయింది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA. PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536